www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
విజయవాడ సిటీ**
ANDHRAJYOTHI
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 246
శనివారం | 21-12-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి మ. 12.21 తదుపరి సప్తమి; నక్షత్రం: పుబ్బ తె. 6.14 తదుపరి ఉత్తర; వర్జ్యం: మ. 12.36-2.21; దుర్ముహూర్తం: ఉ. 6.44-8.12; అమృతఘడియలు: రా. 11.10-12.56; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 5.42
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేటీఆర్‌పై ఈడీ కేసు



- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఐఆర్.. కేటీఆరే ఏ1.. ఒకట్రెండు రోజుల్లో నోటీస్
- 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు.. ఫార్ములా-ఈ రేసు కేసులో హైకోర్టు
- క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా.. జరగని ఒప్పందానికి ముందే చెల్లింపులా?
- గవర్నర్ అనుమతి, దర్యాప్తు తర్వాతే ఎఫ్ఐఆర్.. కేటీఆర్ పాత్ర దర్యాప్తులో తేలుతుంది
- విదేశీ సంస్థకు చెల్లింపుల్లో తీవ్రమైన ఉల్లంఘనలు: ఏజీ
- రాజకీయ, వ్యక్తిగత కుట్రతోనే కేసు.. కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం

11



అమరావతికి ఆరేళ్లు నిధులు

రాజధానికి 13,592 కోట్ల రుణం

- ప్రపంచ బ్యాంకు నుంచి 6,796 కోట్లు
- ఆసియా అభివృద్ధి బ్యాంకు 6,796 కోట్లు
- ఆరేళ్లపాటు విడతల వారీగా నిధుల రాక
- రుణ షెడ్యూల్‌ను ఇచ్చిన ప్రపంచ బ్యాంకు
- సీఆర్‌డీఏ కమిషనర్‌కు చేరిన షెడ్యూల్
- జనవరిలో తొలి విడతగా రూ.348 కోట్లు
- లక్ష్యాలు నిర్దేశించిన ప్రపంచ బ్యాంకు
- వీటికి అనుగుణంగా సర్కారు ప్రణాళికలు
- రాజధాని టెండరు నిబంధనల పరిశీలన
- నిర్మాణ పనులనూ పర్యవేక్షించనున్న ప్రపంచ బ్యాంకు

11

కొండనూ కొట్టేశారు

అరబిందోకు అడ్డగోలుగా మేళ్లు

AUROBINDO

కాకినాడ సీపోర్టులో రూ.2,500 కోట్ల విలువైన 41.12 శాతం వాటాను కేవీ రావు నుంచి బలవంతంగా 494 కోట్లకే లాక్కున్నారు. పక్కనే కాకినాడ సెజ్‌లో 1,104 కోట్ల విలువైన షేర్లకు కేవలం 12 కోట్లే ఇచ్చారు. కేవీ రావు స్వయంగా సీఐడీకి ఫిర్యాదు చేసిన విషయమిది. ఇక కాకినాడ సెజ్‌లో జీఎమ్మార్‌ను బెదిరించి మరో 51 శాతం వాటా కూడా దక్కించు కున్నారు. ఇలా కాకినాడ సీపోర్టు, కాకినాడ సెజ్, అందులో నిర్మించబోయే పోర్టు... అన్నీ అరబిందో పరం చేసేశారు.

అంతేకాదు.. కాకినాడ సెజ్‌లో అరబిందో గేట్‌వే పోర్టు నిర్మాణం కోసం ఏకంగా 125 ఎకరాల్లోని కొండను గత జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా రాసిచ్చేసింది. పదేళ్ల పాటు ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా మినహాయింపు ఇచ్చేసింది. తద్వారా అటు బండ రాళ్లు ఉచితం.. ఇటు రూ.71 కోట్ల సీనరేజీ పన్ను రద్దు. అంతా అడ్డగోలు దోపిడీ అన్నమాట. ఈ మొత్తం డీల్ వెనుక వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి, ఎంపీ విజయసాయి రెడ్డి చక్రం తిప్పారు.

కాకినాడ సెజ్‌లో నిర్మిస్తున్న గేట్‌వే పోర్టుకు 125 ఎకరాల్లో కొండ సమర్పయామి


కాకినాడ జిల్లా రౌతులపూడిలో అరబిందోకు రాసిచ్చిన కొండ

- పదేళ్లు నల్లరాయి తవ్వుకునేలా అనుమతి
- రూ.71.11 కోట్లు సీనరేజీ పన్ను రద్దు
- ప్రభుత్వ ఖజానాకు కోత పెట్టిన జగన్
- అప్పటికే తెరవెనుక బెదిరింపులతో కాకినాడ సెజ్ మొత్తం అరబిందోకు
- సీపోర్టులోనూ 41.12% కొట్టేశారు
- పక్కపక్కనే 2 పోర్టులకు ఒకే యాజమాన్యం ఉండరాదన్న రూల్‌కు బ్రేక్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ సీపోర్టులో వాటాలనే కాదు, కాకినాడ సెజ్‌లో అరబిందో నిర్మిస్తున్న గేట్‌వే పోర్టు కోసం కొండనూ కొట్టేశారు. జగన్ ప్రభుత్వంలో కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడి గ్రామ పరిధిలో మొత్తం 125 ఎకరాల్లో ఉన్న కొండను పదేళ్ల పాటు అప్పనంగా రాసిచ్చేశారు. 2023 డిసెంబరు 2 నుంచి 2033 డిసెంబరు వరకు ఉచితంగా కొండను తవ్వుకునేలా అనుమతులు జారీ చేశారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా రాయల్టీ చెల్లించకుండా

మిగతా 2వ పేజీలో...


విజయవాడలోని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినులు, సిబ్బందితో చంద్రబాబు

కబ్జా చేస్తే ఖబడ్దార్

- సెంటు భూమి ఆక్రమించినా తాటతీస్తా
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతా
- కబ్జాలతో మొదలుపెట్టి వ్యవస్థలన్నీ ధ్వంసం
- భూములపైనే మాకు అత్యధికంగా ఫిర్యాదులు
- ధాన్యం విక్రయించిన 2గంటల్లోపే చెల్లింపులు
- కృష్ణా జిల్లా ఈడుపుగల్లు రెవెన్యూ సదస్సులో చంద్రబాబు భరోసా

మచిలీపట్నం/గంగూరు (కంకిపాడు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భూములు కబ్జా చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, సెంటు భూమి కబ్జా చేసినా వారు జైలులో ఉండేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ధాన్యం విక్రయించిన గంట, రెండు గంటల్లోనే

మిగతా 13వ పేజీలో...


సాలూరు నియోజకవర్గ పర్యటనలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న పవన్ కల్యాణ్

డోలీ మోతలు తప్పిస్తాం

- 3 విడతల్లో 4 వేల తండాలకు రోడ్లు
- 2 నెలలకోసారి మన్యంలో పర్యటిస్తా
- గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ
- మన్యం జిల్లాలో రోడ్ల పనులకు శంకుస్థాపన

13

భరణం అంటే భర్తను దోచుకోవడం కాదు



న్యూఢిల్లీ, డిసెంబరు 20: విడాకుల అనంతరం భరణానికి సంబంధించిన నిబంధనలు భార్య సంక్షేమానికి ఉద్దేశించినవే తప్ప భర్తను భయపెట్టేందుకో, బెదిరించేందుకో, శిక్షించేందుకో, దోపిడీ చేసేందుకో ఉద్దేశించినవి కావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆమె అవసరాలకు తగ్గట్టుగానే మనోవర్తి ఉంటుందని తెలిపింది. భర్తకు సంపద ఉంది కాబట్టి అందుకు తగ్గట్టుగా మనోవర్తి ఇవ్వాలని అడగలేరని తెలిపింది. "విడాకుల అనంతరం భర్త హోదా పెరిగి ఉండవచ్చు. అంతమాత్రాన జీవితకాలమంతా అదే పరిస్థితి ఉంటుందని చెప్పలేం. అందువల్ల ఆయన హోదా పెరిగింది కాబట్టి భరణం కూడా పెంచాలని అడగలేరు. ఆయన వ్యక్తిగత అభివృద్ధిపై భారం మోపలేరు" అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. సరిదిద్దలేని పరిస్థితికి చేరుకోవడంతో ఓ జంటకు విడాకులు మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన కొద్ది కాలానికే ఆ జంట మధ్య విభేదాలు తలెత్తాయి. భార్యకు శాశ్వత మనోవర్తి కింద రూ.12 కోట్లు ఇవ్వాలని, నెల రోజుల్లో చెల్లింపులు పూర్తి చేయాలని భర్తను ఆదేశించింది. మొదటి భార్యకు రూ.500 కోట్లు మనోవర్తి కింద ఇచ్చారని, అందువల్ల ఆయన సంపదకు తగ్గట్టుగా తనకూ భరణం ఇవ్వాలంటూ ఆ భార్య చేసిన వినతిని తిరస్కరించింది. తన భర్తకు రూ.5,000 కోట్ల ఆస్తి ఉందని చెప్పిన విషయాన్నీ ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. ఈ సందర్భంగా కుటుంబ వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేసింది. హిందూ వివాహ వ్యవస్థ పవిత్రమైనదని, కుటుంబానికి పునాది అని తెలిపింది. ఇదేమీ వ్యాపార సంస్థ కాదని పేర్కొంది. కుటుంబ కలహాలు తలెత్తినప్పుడు అత్యాచారం, క్రిమినల్ వేధింపులు, క్రూరత్వం తదితర ఆరోపణలతో 'కంబైన్డ్ ప్యాకేజీ' రూపంలో కేసులు పెడుతుండడాన్ని పలుమార్లు సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టిన విషయాన్ని గుర్తుచేసింది. కఠినమైన ఈ నిబంధనలన్నీ వివాహితల సంరక్షణకు ఉద్దేశించినవే తప్ప భర్తను వేధించడానికి కాదని మహిళలు గుర్తుంచుకోవాలని తెలిపింది. భర్త, అత్తింటివారి నుంచి సొమ్ములు వసూలు చేయాలన్న లక్ష్యంతోనే తీవ్రమైన ఆరోపణలతో క్రిమినల్ కేసులు పెడుతున్నారని పేర్కొంది. భర్త హోదాకు తగ్గట్టుగా తన జీవన శైలి కూడా ఉండాలని కోరుకోవడం తగదని పేర్కొంది. ఒకవేళ విడాకులు తీసుకున్న తరువాత భర్త పేదగా మారితే అప్పుడేమైనా బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించింది. భర్తపై ఆమె పెట్టిన అన్ని క్రిమినల్ కేసులను కొట్టివేసింది.

బెయిల్ వచ్చిన వెంటనే మంత్రి పదవి ఇవ్వడం భయంకరమైన తప్పు

» తమిళనాడు మంత్రి బాలాజీ కేసులో సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, డిసెంబరు 20: బెయిల్ లభించిన మరుక్షణమే డీఎంకే నాయకుడు వి.సెంథిల్ బాలాజీని మళ్లీ తమిళనాడు మంత్రిగా తీసుకోవడం భయంకరమైన తప్పు అని శుక్రవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రవాణా మంత్రిగా పనిచేసినప్పుడు డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలతో ఆయనపై మనీలాండరింగ్ కేసు నమోదయింది. ఇందులో సాక్షులుగా ప్రభుత్వ ఉద్యోగులే ఉన్నారని, అందువల్ల మంత్రి పదవి ఇవ్వడం ప్రశ్నించదగ్గ అంశమని ధర్మాసనం తెలిపింది. ఆయనపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను, విచారించాల్సిన సాక్షుల సమాచారాన్ని సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ సెంథిల్ బాలాజీ జైల్లో ఉన్నప్పుడు కూడా శాఖలేని మంత్రిగా కొనసాగారని చెప్పారు. ఆయన ప్రభావం చూపే వ్యక్తి అని, ఈ కారణంగా విచారణలో జాప్యం జరుగుతోందని తెలిపారు.

'ధారావి' ప్రాజెక్టు అదానీలకు కేటాయింపు సబబే

ముంబయి, డిసెంబరు 20: ముంబయిలోని ధారావి మురికివాడ పునర్నిర్మాణ ప్రాజెక్టును అదానీ గ్రూపునకు కేటాయించడం సబబేనని శుక్రవారం బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. కాంట్రాక్టు మంజూరులో ఏకపక్ష ధోరణి, అహేతుకత, దుర్బుద్ధి వంటివి లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. 259 హెక్టార్లలో ఉన్న మురికివాడలో రూ.5,069 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అదానీ గ్రూపు టెండరు వేసింది. ఆకాశహర్మ్యాలు నిర్మించి పునరావాసం కల్పించడం ఈ ప్రాజెక్టులో ప్రధాన అంశం. అదానీ గ్రూపునకు ఈ కాంట్రాక్టు దక్కడాన్ని సవాలు చేస్తూ యూఏఈకి చెందిన సెక్‌లింక్ టెక్నాలజీస్ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. నిజానికి 2018లో తామే అతిపెద్ద బిడ్డర్‌గా నిలిచామని, కానీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచిందని తెలిపింది. అదానీ గ్రూపునకు టెండరు దక్కేలా చూసేందుకు నిబంధనలు సడలించిందని ఆరోపించింది.

హరియాణా మాజీ సీఎం చౌతాలా కన్నుమూత



చండీగఢ్, డిసెంబరు 20: హరియాణా మాజీ సీఎం, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా(89) కన్నుమూశారు. గురుగ్రామ్‌లోని నివాసంలోనే ఆయన గుండెపోటుతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. మాజీ ఉప ప్రధాన మంత్రి దేవీ లాల్ పెద్ద కొడుకైన చౌతాలా అయిదు సార్లు హరియాణా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. చౌతాలా మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చౌతాలా మృతి నేపథ్యంలో హరియాణా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు శనివారం సెలవు ప్రకటించింది. అలాగే శుక్రవారం నుంచి మూడురోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన కుంభకోణంలో 2013 నుంచి 2021 జులై వరకు చౌతాలా జైలు శిక్ష అనుభవించారు.

రాహుల్‌పై విచారణ

పార్లమెంటు ఆవరణలో బాహాబాహీ ఘటనపై పోలీసులు ప్రశ్నించే అవకాశం

» 'అంబేడ్కర్‌కు అవమానం' అంశం నుంచి దృష్టి మరల్చేందుకే: ప్రియాంక



శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటాలతో ఇండియా కూటమి ఎంపీల నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, డిసెంబరు 20: పార్లమెంటు ఆవరణలో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య చోటుచేసుకున్న బాహాబాహీ ఘటనకు సంబంధించి.. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించనున్నట్లుగా ఢిల్లీ పోలీసు వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఎంపీల మధ్య తోపులాట కారణంగా ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడటం, రాహుల్‌గాంధీపై పార్లమెంటు స్ట్రీట్‌లోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేయటం తెలిసిన విషయమే. దీనిపై రాహుల్ మీద పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేశారు. దీంట్లో భాగంగానే ప్రతిపక్షనేతను ప్రశ్నించనున్నట్లు సమాచారం. కాగా, రాహుల్‌పై నమోదైన కేసు ఢిల్లీ క్రైం బ్రాంచ్‌కు బదిలీ అయింది. ఇదే ఘటనలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే గాయపడటంపై ఆ పార్టీ నేతలు బీజేపీ ఎంపీలపై ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోపులాట ఘటనకు సంబంధించిన సీసీటీవీ రికార్డులను పరిశీలించటానికి అనుమతించాలని పార్లమెంటు సెక్రటేరియట్‌ను పోలీసులు కోరే అవకాశం ఉందని తెలిసింది. కాగా, పార్లమెంటు ఘటన సందర్భంగా రాహుల్ తనతో అనుచితంగా ప్రవర్తించారంటూ బీజేపీ మహిళా ఎంపీ ఫాంగ్‌నాన్ కొన్యాక్ ఆరోపించిన నేపథ్యంలో మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరింది.

రాహుల్ ఎన్నడూ అలా చేయరు

రాహుల్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు కావటంపై ఆయన సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ స్పందిస్తూ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యల వల్ల అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని భారతదేశం సహించదన్న విషయం బీజేపీకి తెలుసు కాబట్టే.. ఈ తరహాలో దృష్టి మరల్చే పనులకు పాల్పడుతోందన్నారు. అంబేడ్కర్ పట్ల బీజేపీకి ఉండే అసలు అభిప్రాయాలు ఇప్పుడు బయటపడ్డాయని, దీనివల్లే ఆ పార్టీ భయపడుతోందని విమర్శించారు. కేంద్రానికి చర్చలంటే భయమని, అందుకనే అదానీతో పాటు ఏ అంశంపైనా పార్లమెంటులో చర్చకు ముందుకు రావటం లేదన్నారు. రాహుల్ ఎలాంటివాడో ఆయన సోదరిగా తనకు తెలుసునని ప్రియాంక పేర్కొన్నారు. 'రాహుల్ ఎవరినీ నెట్టివేయరు. అటువంటి పని ఆయన ఎన్నడూ చేయరు. ప్రభుత్వం పూర్తి నిరాశలో కూరుకుపోయింది. అందువల్లే రాహుల్‌పై పలు తప్పుడు కేసులు నమోదు చేస్తోంది' అని ఆరోపించారు.

ప్రియాంకకు '1984' బ్యాగును బహూకరించిన బీజేపీ ఎంపీ

ప్రియాంకా గాంధీకి శుక్రవారం పార్లమెంటులో అనూహ్య పరిణామం ఎదురైంది. బీజేపీ మహిళా ఎంపీ అపరాజిత సారంగి.. ప్రియాంకకు '1984' అని ఎరుపు రంగుతో రాసి ఉన్న బ్యాగును బహుమతిగా ఇచ్చారు. 1984లో ఇందిరా గాంధీ హత్య తర్వాత జరిగిన సిక్కుల ఊచకోతను గుర్తుచేసే విధంగా బ్యాగును రూపొందించారు. అయితే ప్రియాంక మాత్రం తొలుత బ్యాగును తీసుకోవడానికి నిరాకరించినా... కొద్దిసేపటికి తీసుకొని పక్కన పడేసి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను సోషల్ మీడియాలో బీజేపీ ఎంపీ పోస్టు చేశారు.


జమిలి ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం

కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్

న్యూఢిల్లీ, డిసెంబరు 20: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది రాజ్యాంగ మూల స్వరూపానికి విరుద్ధమని, ఈ ఆలోచనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ శుక్రవారం స్పష్టం చేసింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక ఆలోచన అనేది ప్రజాస్వామ్య వ్యతిరేకమే కాకుండా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. జమిలి ఎన్నికలు నిర్వహించేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే బిల్లులను ప్రవేశపెట్టే సమయంలో 272 మంది ఎంపీలను కూడబెట్టలేకపోయిన ప్రభుత్వం.. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఎలా సమకూర్చుకుంటుందని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీసు కేవలం ట్రైలర్ మాత్రమేనని జైరామ్ రమేష్ అన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఛైర్మన్‌పై మళ్లీ విపక్షాలు అభిశంసన నోటీసు ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మసీదు-మందిరాల రగడ వద్దు

ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ వ్యాఖ్యలు



పుణే, డిసెంబరు 20: 'సామరస్యంతో కూడిన సమ్మిళిత సమాజమే ముద్దు. మసీదు-ఆలయాల రగడ వద్దు' అని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలు, మసీదుల వ్యవహారంపై జరుగుతున్న వివాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే.. ఏ వివాదాన్నీ నేరుగా ఆయన ప్రస్తావించలేదు. 'అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత.. పలు ప్రాంతాల్లో కొందరు ఇలాంటి వివాదాలనే తెర మీదికి తెస్తూ.. హిందువులకు నాయకులుగా ఎదగాలని భావిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని పుణేలో జరిగిన ఓ కార్యక్రమంలో 'భారత్ విశ్వగురు' అనే అంశంపై భగవత్ ప్రసంగించారు. సమ్మిళిత సమాజం దేశానికి అవసరమని పేర్కొన్నారు. 'దేశం సామరస్యంతో కలిసి జీవించగలదని ఈ ప్రపంచానికి చూపించాల్సిన అవసరం ఉంది. రామకృష్ణ మఠంలో క్రిస్మస్‌ను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. హిందువులుగా ఇలాంటివి మనకే సాధ్యం. చాలా కాలంగా ఈ దేశ ప్రజలు సామరస్యంగా జీవిస్తున్నారు. ఈ సామరస్యాన్ని ప్రపంచానికి చూపేందుకు.. మనం ఒక నమూనాగా మారాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత చాలా మంది కొత్త కొత్త ప్రదేశాల్లో ఇలాంటి అంశాలనే తెరమీదికి తెస్తున్నారని, కానీ.. ఇది ఆమోదయోగ్యం కాదని తెలిపారు. 'ఎవరు మైనారిటీ.. ఎవరు మెజారిటీ? ఇక్కడ ప్రతి ఒక్కరూ సమానులే. ఎవరి విశ్వాసాలను వారు అనుసరించవచ్చు' అని భగవత్ అన్నారు. భగవత్ వ్యాఖ్యలపై అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. పెట్టాల్సిన చిచ్చు పెట్టి.. ఇప్పుడు ఏమీ తెలియనట్టు ముచ్చట్లు చెబుతున్నారని, ఇకపై తవ్వకాలు వద్దని పిలుపునిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

అంగరంగ పెళ్లిళ్లపై ఐటీ చూపు

న్యూఢిల్లీ, డిసెంబరు 20: భారీ సెట్టింగు.. డెస్టినేషన్ వెడ్డింగ్. సినీ తారల సందడి.. కోట్లు ఖర్చు అయినా వెనుకాడకుండా ఆతిథ్యం.. ఇలా అంగరంగ వైభోగంగా జరిగే పెళ్లిళ్లపై ఆదాయ పన్ను శాఖ దృష్టి పెట్టింది. పన్ను లెక్కల్లో చూపని నగదును ఈ కల్యాణాల్లో ఖర్చు చేస్తున్నట్లు పసిగట్టింది. ఇలాంటి డబ్బు గతేడాది కాలంలో రూ. 7,500 కోట్లకుపైగా ఖర్చు పెట్టారని లెక్కగట్టింది. ఆ విలాసవంతమైన వెడ్డింగ్‌లకు జైపూర్ కేంద్రమని గుర్తించిన ఆదాయ పన్ను అధికారులు.. ఇక్కడి టాప్ 20 వెడ్డింగ్ ప్లానర్ల లెక్కలు బయటకు తీస్తోంది. వీరిని ఇతర ప్రాంతాల వెడ్డింగ్ ప్లానర్లు సంప్రదిస్తారని అధికారులు గుర్తించారు. జైపూర్‌లో భారీ పెళ్లిళ్ల కోసం మ్యూల్ ఖాతాలు, హవాలా ఏజెంట్లు, నకిలీ బిల్లుల సృష్టి కర్తలతో కూడిన ఓ నెట్‌వర్క్ పనిచేస్తోందని, ఈ నెట్‌వర్క్‌కు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లోని సహచరులతో సంబంధాలు ఉన్నాయని కనిపెట్టారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: అధికార, విపక్ష సభ్యుల మధ్య తోపులాటలు, వాగ్వాదాల మధ్య పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. రాజ్యాంగంపై చర్చ, జమిలి ఎన్నికలపై బిల్లును జేపీసీకి పంపడం మినహా ఈ సమావేశాల్లో పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించారంటూ విపక్షాలు ఆరోపించడం, అధికార పక్ష సభ్యులు అడ్డుకోవడంతో ఉభయసభలు అట్టుడికాయి. చివరి రోజు కూడా ఇదే విషయంపై విపక్షాల నిరసనలు కొనసాగడంతో ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. చివరి రోజు లోక్‌సభ ప్రారంభమైన 3 నిమిషాలకే స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు. అంతకు ముందు తేనీటి విందుకు రావాలని స్పీకర్ ఆహ్వానించినా విపక్ష సభ్యులు రాలేదు. నవంబరు 25న శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగా మొత్తం 3 సెషన్లలో 70 పనిగంటలను లోక్‌సభ కోల్పోయింది. తద్వారా 57.87 శాతం మాత్రమే పనిచేసింది. రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళనతో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. చివరి రోజు ఆయిల్ ఫీల్డ్స్ సవరణ బిల్లు, 2024 బాయిలర్స్ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ మొత్తం 43 గంటల 27 నిమిషాలు పనిచేసింది. 40.03 శాతం మాత్రమే పనిచేసింది. కాగా, దేశవ్యాప్తంగా లోక్‌సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును అధ్యయనం చేసేందుకు కేంద్రం జేపీసీలో మొత్తం 39కి చోటు కల్పించింది. సభ్యుల్లో 27 మంది లోక్‌సభకు, 12 మంది రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న 12 మందిలో తెలంగాణ నుంచి కె.లక్ష్మణ్, ఏపీ నుంచి విజయసాయిరెడ్డికి స్థానం కల్పించారు. బీజేపీ ఎంపీ పీపీ చౌదరి జేపీసీకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

అమెరికాకు 'ఘోస్ట్ గన్స్' తలనొప్పి!



» పెరిగిపోతున్న త్రీడీ ముద్రిత తుపాకుల సంస్కృతి

తుపాకుల సంస్కృతి అమెరికాకు కొత్త కాదు! తరచుగా ఎక్కడో ఒకచోట కాల్పుల ఘటనలు జరుగుతూనే ఉంటాయి. అలాంటి దేశాన్నే ఇప్పుడు 'త్రీడీ ప్రింటెడ్' తుపాకుల విస్తృతి తీవ్రంగా భయపెడుతోంది. చూడ్డానికి పిల్లలు ఆడుకునే బొమ్మల్లా ఉండే ఈ తుపాకులు అగ్రరాజ్యానికి తలనొప్పిగా మారాయి. ఉదాహరణకు.. ఈ నెల 4వ తేదీన అమెరికాలో యునైటెడ్ హెల్త్‌కేర్ సీఈవో బ్రియాన్ థాంప్సన్.. కాల్పుల్లో చనిపోయారు గుర్తుంది కదా! ఆ హత్యకు నిందితుడు వాడింది త్రీడీ ప్రింటెడ్ తుపాకీనే. అదొక్కటే కాదు.. ఇటీవలికాలంలో అమెరికాలో జరిగిన పలు హై-ప్రొఫైల్ నేరాల్లో నిందితులు ఇంట్లోనే త్రీడీ ప్రింటర్ల సాయంతో ముద్రించిన ఆయుధాలను వాడినట్టు తేలడం పోలీసులను కలవరపెడుతోంది. దుకాణంలో కొన్న తుపాకులకు ఒక లెక్కాపత్రం ఉంటాయి! ఇంట్లో త్రీడీ ప్రింటర్ పెట్టి దాంట్లో ఆయుధాలను/తుపాకులను ముద్రించి నేరాలకు పాల్పడితే వాటిని గుర్తించడం కూడా కష్టమే కదా! అందుకే ఈ తుపాకులను అమెరికా పోలీసులు 'ఘోస్ట్ గన్స్'గా వ్యవహరిస్తున్నారు. చాలా కేసుల్లో ఘోస్ట్ గన్స్ వాడినట్టు తేలడంతో అమెరికా సుప్రీంకోర్టు కూడా ఈ సమస్యపై దృష్టి సారించింది. ఈ సమస్య ఒక్క అమెరికాకే కాదు.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలకు ఉంది. నిజానికి త్రీడీ ముద్రిత తుపాకీకి సంబంధించి ప్రపంచంలో తొలి క్రిమినల్ కేసు యూకేలో 2013లో నమోదైంది. అప్పటి నుంచి యూరప్‌లోని వ్యవస్థీకృత నేర ముఠాల నుంచి మయన్మార్‌లో తిరుగుబాటుదారుల దాకా.. జిహాదీలు, వామపక్ష తీవ్రవాదులు, మితవాదులు, జాతిపరమైన వేర్పాటువాదులు.. ఇలా అందరి దృష్టీ వీటిపైకి మళ్లింది. యూరప్‌లో 2013-2024 నడుమ త్రీడీ ప్రింటెడ్ ఆయుధాలకు సంబంధించి 165 కేసులు నమోదయ్యాయి. అందులో 15% కేసులు ఉగ్రవాదానికి సంబంధించినవి. తుపాకులు కలిగి ఉండడం చట్టబద్ధమైన అమెరికాలో అయితే.. వీటి వినియోగం ఆందోళనకరస్థాయికి పెరిగిపోయింది. యూఎస్ బ్యూరో ఆఫ్ ఆల్కహాల్, ఫైర్‌ఆర్మ్స్ అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ గణాంకాల ప్రకారం.. 2017-21 నడుమ అక్కడి దర్యాప్తు సంస్థలు 38 వేల ఘోస్ట్ గన్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా త్రీడీ ముద్రిత తుపాకులకు సంబంధించి అరెస్టుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లోఅన్ని దేశాల్లో కలిపి ఈ తరహా కేసుల్లో 66 మంది అరెస్టయ్యారు.

ఎందుకు ప్రమాదం?

చట్టబద్ధంగా ఎవరైనా తుపాకీ కొంటే.. దాని సీరియల్ నంబర్, ఎవరు కొన్నారు? ఎప్పుడు కొన్నారు? లాంటి వివరాలన్నీ అధికారుల డేటాబేస్‌లో ఉంటాయి. కాల్పుల ఘటనలు జరిగినప్పుడు కొద్దిపాటి దర్యాప్తుతో నేరగాళ్లను గుర్తించే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఎవరికివారు ఇంట్లో ప్రింటర్ పెట్టి ప్రింటవుట్ తీసినంత సులభంగా ఆయుధాలు ముద్రించేసుకుంటే వాటిని గుర్తించడం పోలీసులకు అసాధ్యం అవుతుంది. ఈ ముప్పును గుర్తించే జపాన్, కెనడా, యూరోపియన్ దేశాలు త్రీడీ ప్రింటెడ్ తుపాకులపై నిషేధం విధించాయి.

అదానీపై ఆరోపణల వెనుక ఉన్న అమెరికా అటార్నీ రాజీనామా?

వాషింగ్టన్, డిసెంబరు 20: అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీపై కేసు నమోదు వెనుక ఉన్న అమెరికా అటార్నీ బ్రియాన్ పీస్ జనవరి 10న తన పదవికి రాజీనామా చేయనున్నారు. అమెరికా అటార్నీ కార్యాలయం తాజాగా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్‌కు ఆయన అటార్నీగా వ్యవహరిస్తున్నారు. 53 ఏళ్ల బ్రియాన్ పీస్‌ను 2021లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆయనను న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీగా నియమించారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఇవ్వడానికి అమెరికాలోని పెట్టుబడిదారుల నిధులను అదానీ గుట్టుచప్పుడు కాకుండా మళ్లించారని ఈ ఏడాది నవంబరులో బ్రియాన్ పీస్ కార్యాలయం అభియోగాలు మోపింది.



మీడియాతో మాట్లాడుతున్న సాయిదివ్య

పీఎస్ఎల్వీ-సీ60లో స్వేచ్ఛశాట్ పేలోడ్

తెనాలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా స్పాడెక్స్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది. శ్రీహరికోట నుంచి చేపట్టే ఈ ప్రయోగంలో తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ సంస్థ భాగస్వామ్యం కానుంది. ఇస్రో సహకారంతో యుహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ మాడ్యూల్‌కు సంబంధించి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అతి చిన్న స్వేచ్ఛశాట్-వీ.0 పేలోడ్‌ను పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్లు ఎన్ స్పేస్ టెక్ సంస్థ వ్యవస్థాపకురాలు, ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొత్తమాసు సాయిదివ్య శుక్రవారం తెలిపారు. తమ మాడ్యూల్‌కు సంబంధించి భూమిపై చేసిన పరీక్షలన్నీ విజయవంతమయ్యామని, ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక తాము పంపిన మాడ్యూల్ ఇస్రోకు సంకేతాలు పంపితే తమ ప్రయత్నం ఫలించినట్టేనని ఆమె చెప్పారు. స్వేచ్ఛశాట్ విజయవంతమైతే భారీ మాడ్యూల్స్ స్థానంలో అతి చిన్న మాడ్యూల్స్‌ను ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. అలాగే ఎటువంటి కమ్యూనికేషన్ వ్యవస్థ లేని మారుమూల ప్రాంతాలకు ఎంతగానో ఉపయోగమని అన్నారు. వ్యవసాయ రంగంలోనూ సమూల మార్పులకు ఇది దోహదపడుతుందన్నారు.

కొండనూ కొట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)

మినహాయింపు ఇచ్చింది. ఇలా అరబిందోకు ఏకంగా 71.11 కోట్లు లబ్ధి కలిగేలా మేళ్లు చేశారు. అన్ని నిబంధనలు గాలికొదిలేసి, అడ్డగోలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. కాకినాడ సీపోర్టు యజమాని కేవీ రావును బెదిరించి 41.12 శాతం వాటాను రాయించుకున్న సంగతి తెలిసిందే. అలాగే కాకినాడ సెజ్‌లోని విలువైన భూములనూ అరబిందోకు కట్టబెట్టారు. జగన్ సీఎంగా ఉండగానే కాకినాడ సెజ్‌లో పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి స్కెచ్ వేశారు. అరబిందో ద్వారా కాకినాడ గేట్‌వే పోర్టుగా ప్రమోట్ చేస్తూ 1650 ఎకరాల్లో ఏటా 20 మిలియన్ టన్నుల కార్గో సామర్థ్యంతో తొలుత 3 బెర్త్‌లను నిర్మించడానికి పనులు ప్రారంభించారు. పోర్టు నిర్మాణానికి వీలుగా 2023లో తీరం నుంచి సముద్రం మధ్యలో దక్షిణంవైపు 3.24 కిలోమీటర్లు, ఉత్తరం వైపు 0.57 కిలోమీటర్లు బ్రేక్‌వాటర్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం కొన్ని లక్షల టన్నుల రాళ్లు కావాల్సి ఉంది. ఏళ్ల తరబడి భారీ బండరాళ్లను ఈ పోర్టుకు తరలించి బ్రేక్ వాటర్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వైవీ విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి కలిసి పోర్టులో డైరెక్టర్‌గా ఉన్న తమ మనిషి మురళీధరన్, జగన్‌తో మంతనాలు జరిపారు. అరబిందోకు ఇబ్బంది లేకుండా అతి తక్కువ దూరంలోనే రాళ్ల రవాణాకు వీలుగా ఓ భారీ క్వారీని అన్వేషించారు. 30 కిలోమీటర్ల సమీపంలో ఉన్న రౌతులపూడి మండలం ములగపూడి గ్రామం సర్వే నంబర్1లో ఓ కొండను అరబిందోకు కట్టబెట్టాలని నిర్ణయించారు. అందులోని నల్లరాయి పోర్టు బ్రేక్‌వాటర్, బెర్త్‌ల నిర్మాణానికి అనువుగా ఉంటుందని తేల్చారు. అప్పటికప్పుడు కాకినాడ గేట్‌వే పోర్టు తరఫున క్వారీ కేటాయింపునకు లేఖ ఆహ్వానించి, దాని ప్రకారం క్వారీ కట్టబెడుతూ గుట్టుగా జగన్ ఆదేశాలు ఇచ్చేశారు. గనుల శాఖ అనుమతులు జారీ చేసింది. పదేళ్ల పాటు ఇందులో రాయి తవ్వి తరలించడానికి సదరు కంపెనీ నిబంధనల ప్రకారం రూ.71.11 కోట్లు రాయల్టీ ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ ఒక్క పైసా కూడా అరబిందో చెల్లించకుండా జగన్ రాయల్టీ మినహాయింపు ఇచ్చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వానికి పైసా కూడా కట్టకుండా పోర్టు కోసం యథేచ్ఛగా బండరాళ్లను పెద్దఎత్తున తరలించుకుపోతోంది.

జీఎమ్మార్‌ను బెదిరించి...

పదివేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకినాడ సెజ్ దేశంలోనే అతి పెద్దది. ఇందులో 51 శాతం జీఎమ్మార్ సంస్థకు, కాకినాడ డీప్ వాటర్‌పోర్టు నిర్వహణదారుడు కేవీరావుకు 0.29 శాతం, ఆయనకే చెందిన కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్(కేఐహెచ్‌పీఎల్)కు 33.75 శాతం, వేద ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 14.70 శాతం చొప్పున వాటాలు ఉండేవి. ఇది కాకుండా 0.26 శాతం వాటా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే నాన్‌బ్యాంకింగ్ సంస్థకు ఉంది. ఈ సెజ్‌లో ప్రధాన వాటాదారు జీఎమ్మార్ సంస్థ భవిష్యత్తులో సెజ్‌లో రాబోయే చమురు, గ్యాస్ సంస్థలు, ఆయిల్ రిఫైనరీల ఎగుమతి, దిగుమతి అవసరాల కోసం తొండంగి మండలం కోన తీర ప్రాంతంలో రూ.2,300 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు 2018 నవంబరు 21న అప్పటి చంద్రబాబు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 2019లో అప్పటి సీఎం హోదాలో చంద్రబాబు కాకినాడకు వచ్చి పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పోర్టు నిర్మాణం కోసం కేంద్ర పర్యావరణ అనుమతులు కూడా జీఎమ్మార్ తెచ్చుకుంది. పోర్టు నిర్మాణానికి నిధుల సమస్య ఉండడంతో 2019 మార్చిలో అదానీతో జట్టు కట్టింది. ఓడరేవు నిర్మాణంలో 49 శాతం వాటాను అదానీకి కట్టబెడుతూ జీఎంఆర్ డీల్ కుదుర్చుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం కథ మారిపోయింది. తెరవెనుక అనేక బెదిరింపులు జరిగాయి. సెజ్‌ను, అందులో నిర్మించబోయే పోర్టును విక్రయించే ఆలోచనే లేని జీఎమ్మార్ ఈ రెండింటినీ అరబిందోకు 2020లో విక్రయించేసింది. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ కాంట్రాక్టును రద్దు చేస్తామన్న బెదిరింపుతో జీఎమ్మార్‌ను దారికి తెచ్చుకున్నారు. దీంతో అరబిందో రియాల్టీకి సెజ్, ఓడరేవు అనుమతులతో సహా మొత్తం 51 శాతం వాటాను జీఎమ్మార్ రూ.2,610 కోట్లకు విక్రయించింది. అప్పటివరకు ఫార్మా రంగంలో ఉన్న అరబిందో సెజ్‌ను, అందులో పోర్టును కొంటుందనే ఊహేలేదు.

రూల్స్ మార్చేశారు

గత టీడీపీ ప్రభుత్వంలో కాకినాడ సెజ్‌ను జీఎమ్మార్ తీసుకున్న సమయంలో అందులో నిర్మించబోయే కొత్త పోర్టు నిర్మాణానికి దరఖాస్తు చేశారు. అప్పటి ప్రభుత్వం 5.13, 5.9 పేరుతో క్లాజులు తీసుకువచ్చింది. అందులోభాగంగా నిర్మించబోయే పోర్టుకు 75 కిలోమీటర్ల పరిధిలో ఇతర ఏ పోర్టులోనూ 25 శాతానికి మించి వాటాలు ఉండకూడదనే నిబంధన విధించింది. రెండు పోర్టులు ఒకే సంస్థ చేతిలో ఉంటే మోనోపోలీకి అవకాశం ఉంటుందని పేర్కొంది. అయితే అరబిందో సంస్థకు కాకినాడ డీప్ వాటర్ పోర్టులో 41.12 శాతం (కేవీరావు నుంచి లాక్కొన్న) వాటా, అటు సెజ్‌లో నిర్మించనున్న పోర్టులో 100 శాతం వాటా ఉన్న నేపథ్యంలో జగన్ సర్కారు ఆ క్లాజులను రద్దు చేసేసింది. రెండు పోర్టులు పక్కపక్కనే ఒకే యాజమాన్యం చేతిలో ఉన్నా అభ్యంతరం లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మొత్తం అరబిందోకు: కాకినాడ సెజ్‌లో జీఎమ్మార్ నుంచి 51 శాతం దక్కించుకున్న తర్వాత మిగిలిన వాటాపైనా జగన్ బ్యాచ్ కన్నేసింది. కేవీరావుకు ఉన్న 0.29%, ఆయన కంపెనీ కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (కేఐహెచ్‌పీఎల్)కు ఉన్న 33.75 శాతం, వేద ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఉన్న 14.70% సెజ్ వాటాలు కూడా అతి తక్కువ వ్యవధిలో అరబిందో చేతికి వచ్చేశాయి. ఇలా కాకినాడ సెజ్ మొత్తం, అందులో నిర్మించబోయే పోర్టు అరబిందో పరమైపోయాయి. ఇక్కడ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు కూడా జగన్ బ్యాచ్ ప్రయత్నించింది. 2020 ఆగస్టులో కేంద్రం ఏపీకి ప్రకటించిన బల్క్‌డ్రగ్ పార్కు ఇందులో ఏర్పాటు చేసేలా చక్రం తిప్పారు. ఆ తర్వాత సెజ్‌లో బల్క్‌డ్రగ్ పార్కును కేంద్రం రద్దు చేసి విశాఖకు తరలించింది.

లోకం తీరు



ఈవీఎంలపై జనవరిలో విచారణ

న్యూఢిల్లీ, డిసెంబరు 20: ఈవీఎంలపై సుప్రీంకోర్టులో మరో వ్యాజ్యం దాఖలయింది. దీనిపై జనవరి 20వ తేదీతో ప్రారంభమయ్యే వారంలో విచారణ జరగనుంది. న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరుపుతుందని శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ప్రకటించింది.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

- పోలీసు-న్యాయశాఖ సమన్వయంతో సాగాలి
- ఫాస్ట్ ట్రాక్, ప్రత్యేక కోర్టులపై మంత్రులు ఫరూక్, అనిత సమీక్ష

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారంపై న్యాయ, పోలీసుశాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరుపై శుక్రవారం అమరావతి సచివాలయంలో ముఖ్య అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. కేసుల తీవ్రతను బట్టి, ఏ ఉద్దేశంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు పని చేస్తున్నాయో అందుకు అనుగుణంగా ఆయా కోర్టుల్లోని కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేటట్లుగా ముందుకు సాగాలన్నారు. అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశానుసారం సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టలని సూచించారు. ముఖ్యంగా సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయ పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు, ప్రత్యేక కోర్టు లు మరింత వేగంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి, హోంశాఖ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారు.

మంత్రులకు పీఆర్‌వోల నియామకానికి ఉత్తర్వులు

- సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్‌లు, అసిస్టెంట్లు కూడా..

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మంత్రుల కార్యాలయాల్లో పౌర సంబంధాల అధికారులు, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్‌లు, సోషల్ మీడియా అసిస్టెంట్ల నియామకానికి అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 24 మంది మంత్రుల కార్యాలయాల్లో ఒక్కొక్కరు చొప్పున సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా నియమించాలని ఆదేశించింది. పీఆర్‌వోలకు రూ.37 వేలు, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్‌లకు రూ.50 వేలు, సోషల్ మీడియా అసిస్టెంట్లకు రూ.30 వేలు జీతాలు ఇవ్వనున్నట్లు తెలిపింది. పీఆర్‌వోలకు ఏదైనా డిగ్రీ, జర్నలిజంలో డిగ్రీ లేదా డిప్లొమా లేదా జర్నలిజంలో అనుభవం ఉండాలని, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్‌లకు బీటెక్, సోషల్ మీడియా అసిస్టెంట్లకు ఏదైనా డిగ్రీ విద్యార్హతలు ఉండాలని స్పష్టం చేసింది. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఈ నియామకాలు జరుగుతాయని పేర్కొంది.

ఏపీకి ఇన్నోవేషన్ వర్సిటీ

- రాష్ట్రానికి రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు
- విద్యార్థులకు సమకాలీన, ఆధునిక విద్య
- ఫిజిక్స్ వాలా కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం
- ఏఐలో ఏపీ నంబర్‌వన్ కావాలి: మంత్రి లోకేశ్



మంగళగిరిలోని ఒక కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలలో కేక్ కట్ చేస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నారు. అమెజాన్ వెబ్ భాగస్వామ్య కంపెనీ అయిన ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీతో ప్రభుత్వం ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్‌ను ఏకీకృతం చేసేలా ఈ యూనివర్సిటీ పనిచేయనుంది. హబ్ అండ్ మోడల్‌ను అనుసరించి సెంట్రల్ హబ్‌గా పనిచేస్తుంది. ఫలితంగా విభిన్న నేపథ్యాలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులంతా సమకాలీన, అధునాతన విద్యను అభ్యసించే వీలు కలుగుతుంది. శుక్రవారం మంత్రి నారా లోకేశ్ సమక్షంలో తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఉన్నత విద్యా శాఖ అధికారులు ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఏపీని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలన్న సీఎం ఆలోచనలకు అనుగుణంగా ఈ ఒప్పందాలు చేసుకున్నామన్నారు. అధునాతన ఆవిష్కరణలను యువత ద్వారా ముందుకు తీసుకెళ్లడం తమ లక్ష్యమని చెప్పారు. పరిశ్రమల్లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిపై ఇన్నోవేషన్ యూనివర్సిటీ దృష్టి సారిస్తుందన్నారు. టాలెంట్ డెవలప్‌మెంట్, నాలెడ్జ్ క్రియేషన్‌లో ఏపీని బలోపేతం చేయాలని ఫిజిక్స్ వాలా కంపెనీ ప్రతినిధులను కోరారు. ఏపీని ఏఐ హబ్‌గా మార్చేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని, ఇందుకోసం ఏఐలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక, తర్వాతి తరం నైపుణ్యాలను పెంపొందించడం కోసం మార్గం సుగమం చేస్తున్నామని చెప్పారు. ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకుడు అలఖ్ పాండే మాట్లాడుతూ... ఇన్నోవేషన్ యూనివర్సిటీ స్థాపనతో యూఎస్ జీఎస్‌వీ వెంచర్స్ ఇతర పెట్టుబడుల ద్వారా రూ.వెయ్యి కోట్లు పెట్టుబడులు వస్తాయన్నారు. అకడమిక్ లెర్నింగ్‌ను ఇండస్ట్రీతో మిళితం చేసే సంస్థను రూపొందించడానికి ఇన్నోవేషన్ వర్సిటీ పనిచేస్తుందన్నారు.

టీబీఐతో ఒప్పందం

రాష్ట్రంలో ఉన్నత విద్యను ఆధునికీకరణ లక్ష్యంతో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ)తో ఉన్నత విద్యా శాఖ మరో ఒప్పందం చేసుకుంది. టీబీఐ కంట్రీ డైరెక్టర్ వివేక్ అగర్వాల్, అసోసియేట్ డైరెక్టర్ ముంజులూరి రాగిణి మాట్లాడుతూ... ఏపీ విద్యార్థులను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. అంతర్జాతీయంగా విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులపై రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తామన్నారు. యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కాలేజీల్లో తృతీయ విద్య ల్యాండ్‌స్కేప్ మెరుగుపర్చడానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్య అంతరాలను గుర్తించి, వాటి పెంపుదలకు ఉత్తమ విధానాలు అవలంబించడంలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య కమిషనర్ భరత్‌గుప్తా పాల్గొన్నారు.

తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు సహించం

- సోషల్ మీడియా ద్వారా హెచ్చరించిన టీటీడీ చైర్మన్
- తెలంగాణ నేతపై చర్యలకు ఆదేశిస్తున్నట్లు వెల్లడి

తిరుమల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రశాంతతను దెబ్బతీసేలా కొండపై ఎవరు రాజకీయ వ్యాఖ్యలు చేసినా సహించేది లేదంటూ టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా హెచ్చరించారు. తిరుమలలో తెలంగాణ ప్రజలు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తల విషయంలో భేదం చూపిస్తున్నారంటూ తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో టీటీడీ చైర్మన్ తన ఫేస్‌బుక్ ఖాతాలో గురువారం అర్ధరాత్రి ఓ పోస్ట్ చేశారు. ' తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో వెనుకడుగు వేయకూడదనే మా బోర్డు తొలి సమావేశంలోనే ప్రత్యేక ఎజెండాగా చర్చించి నిర్ణయం తీసుకున్నాం. తిరుమల కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేసేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదేలేదు. తెలంగాణకు చెందిన ఒక నేత తిరుమల వేదికగా రాజకీయ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆయనపై చర్యలకు ఆదేశిస్తున్నాం' అంటూ పేర్కొన్నారు.

ఆర్టీసీని గాడిలో పెడుతున్నాం

- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంస్థ దెబ్బతింది
- సిబ్బంది సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- విశాఖలో కార్గో పార్శిళ్ల డోర్ డెలివరీ ప్రారంభం

విశాఖపట్నం, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రజా రవాణా శాఖను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్గోలో బుక్ చేసే పార్శిళ్లను డోర్ డెలివరీ చేసే సదుపాయాన్ని రాష్ట్రంలోనే మొదటిసారిగా విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్ఆర్టీసీని నిర్లక్ష్యం చేయడంతో సంస్థ బాగా దెబ్బతిందని, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత తిరిగి గాడిన పెట్టే చర్యలు ప్రారంభించామని చెప్పా రు. ఇప్పటికే ఆర్టీసీకి కొత్తగా 700 బస్సులు అందజేశామని, త్వరలోనే మరో 550 ఇస్తామన్నారు. సిబ్బంది సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నైట్ అలవెన్సులను అందజేస్తూ జీవో జారీచేశామన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీలో పెనుమార్పులు తీసుకురాబోతున్నామన్నారు. ఆర్టీసీ ఆస్తులను పరిరక్షించుకుంటామని, అన్యాక్రాంతమైన వాటిపై లోతుగా విచారణ జరిపిస్తామని చెప్పారు. అంతకుముందు మంత్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పాడేరు బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడారు. తర్వాత కాంప్లెక్స్ ఆవరణలో పరిశుభ్రతను, షాపుల్లోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కాంప్లెక్స్ ఆవరణలో సీసీ కెమెరాలను తక్షణం మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఆర్టీసీ జోన్-1 చైర్మన్ దొన్నుదొర, ఇన్‌చార్జి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



పార్శిళ్ల డోర్ డెలివరీకి సంబంధించిన పత్రాన్ని అందజేస్తున్న మంత్రి రాంప్రసాదరెడ్డి, ఆర్టీసీ జోన్-1 చైర్మన్ దొన్నుదొర

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం

విజయనగరం టౌన్: రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయనగరంలోని విజ్జీ క్రీడా ప్రాంగణంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఖేల్ ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ హాల్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వం క్రీడా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. క్రీడాకారులకు కనీస ప్రోత్సాహం అందించలేదు. క్రీడా రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. దేశంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీని రాష్ట్రంలో తీసుకువచ్చాం. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌ను 2శాతం నుంచి 3 శాతానికి పెంచాం. అన్ని ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, అకాడమీలు ఏర్పాటు చేస్తున్నాం. 2027లో అమరావతిలో జాతీయ క్రీడలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం శాసనసభ్యురాలు అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

గుంటూరు సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ గుంటూరుకు చెందిన బి.అశోక్, సీసీఐ మాజీ మేనేజర్ గోగినేని సాయి ఆదిత్య కమల్ దేవ్ హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఈ నెల 16న తీర్పు వెలువరించారు. సీసీఐ కేంద్రాలుగా నోటిఫై చేసిన జిన్నింగ్ కాటన్ మిల్లుల్లో సీసీ కెమెరాలు అమర్చడం ద్వారా మోసం జరగకుండా ఉండడం మాత్రమే కాకుండా, అవినీతికి కూడా ఆస్కారం ఉండదన్న పిటీషనర్ వాదనతో హైకోర్టు ఏకీభవించింది.

23న విజయవాడలో క్రిస్మస్ తేనీటి విందు

- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన విజయవాడలో ప్రభుత్వం తేనీటి విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు లబ్బీపేట ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

ఓర్వకల్లులో 14 వేల కోట్ల పెట్టుబడులు

- మంత్రి టీజీ భరత్

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రముఖ ఇండో-జపాన్ కంపెనీ సెమీ కండక్టర్ రంగంలో ఈ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఆ కంపెనీ ప్రతినిధులు అమరావతిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో సమావేశమై పెట్టుబడులపై చర్చించారని, జనవరి రెండో వారంలో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ చేసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

శ్రీవారి సేవలో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

తిరుమల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేకసేవలో పాల్గొన్నారు. అనంతరం ధ్వజస్తంభానికి మొక్కుకుని రంగనాయక మండపం వద్దకు చేరుకున్న ఆయన్ను వేదపండితులు ఆశీర్వదించారు. సీఎస్‌కు శ్రీవారి లడ్డూప్రసాదాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అందజేశారు.


శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న నీరబ్ కుమార్ ప్రసాద్

శ్రీవాణి, ఎస్ఈడీ టికెట్ల విడుదల తేదీల మార్పు


తిరుమల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టు టికెట్లు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించిన మార్చి నెల కోటా విడుదల తేదీల్లో టీటీడీ మార్పులు చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు పదిరోజుల పాటు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఈ పదిరోజులకు సంబంధించిన శ్రీవాణి ట్రస్టు టికెట్లను డిసెంబరు 23వ తేదీన ఉదయం 11 గంటలకు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను 24వ తేదీన ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. దీంతో మార్చి నెలకు సంబంధించిన శ్రీవాణి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా ఆన్‌లైన్ విడుదల తేదీలను మార్చినట్టు టీటీడీ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. 25వ తేదీన ఉదయం 11 గంటలకు మార్చి నెల శ్రీవాణి టికెట్లను, 26వ తేదీన ఉదయం 11 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను విడుదల చేయనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలలోని వసతి గదుల కోటాను కూడా విడుదల చేస్తారు. భక్తులు వీటిని 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే అధికారిక వెబ్‌సైట్ నుంచి బుక్ చేసుకోవచ్చు.

క్రైస్తవులకు నిజమైన సాయం చేసింది టీడీపీనే

- ఎన్టీఆర్ భవన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు


మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలలో కేక్ కట్ చేస్తున్న వర్ల రామయ్య, పల్లా శ్రీనివాస్, నక్కా ఆనందబాబు తదితరులు

అమరావతి, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు నిజమైన సాయం చేసింది తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇక్కడి ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ కేక్‌ను కత్తిరించి ఏసు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడారు. 'అన్ని మతాలనూ సమానంగా గౌరవించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. సర్వ మత స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాయమాటలు చెప్పి క్రైస్తవులను మోసం చేస్తే, టీడీపీ ప్రభుత్వం క్రైస్తవులకు నిండు హృదయంతో సాయం చేస్తోంది. ఏసు ప్రభువు ఇచ్చిన నియమాల్లో ఏ ఒక్కదానినీ జగన్ ఆచరించలేదు' అని నేతలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. మంచి సమాజం కోసం పాటుపడుతున్న చంద్రబాబు ప్రభుత్వం పదికాలాలపాటు ఉండాలని క్రైస్తవ సమాజం ప్రార్థించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల జోసెఫ్, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు, పలువురు బిషప్‌లు, పాస్టర్లు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ గురించి కేంద్ర ఎన్నికల సంఘం సమావేశమవుతున్నదనీ, ఎన్నికల షెడ్యూల్ నిర్ణయించుకోవడం కూడా వెనువెంటనే జరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎలాగూ ఫిబ్రవరిలోగా ఎన్నికలు జరుగుతాయి కనుక, పార్టీలన్నీ ఎంతో ముందుగానే యుద్ధం మొదలెట్టాయి. ఢిల్లీ పీఠాన్ని ఈ మారైనా వశం చేసుకోవాలని పట్టుదలతో ఉన్న భారతీయ జనతాపార్టీ 17మంది సీనియర్ నాయకులతో ఎన్నికల కమిటీని ప్రకటించింది. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి నేతృత్వంలో, ఢిల్లీ నుంచి ఎన్నికైన ఏడుగురు బీజేపీ ఎంపీలతోపాటు కొందరు పార్టీ పెద్దలు కూడా ఈ జాబితాలో ఉన్నారు. డెబ్బైస్థానాలున్న అసెంబ్లీకి పార్టీ తరఫు నుంచి పోటీపడబోతున్న అభ్యర్థుల జాబితాలకు అధిష్ఠానం మెరుగులు దిద్దుతోందని, ఈ ఏడాది చివరివారంలో అవి వెలుగుచూస్తాయని అంటున్నారు. రెండు పర్యాయాలు ఢిల్లీని గెలుచుకొని, ముచ్చటగా మూడోమారు అధికారంలో కొనసాగడానికి ప్రయత్నిస్తున్న ఆమ్ ఆద్మీపార్టీ నాలుగురోజుల క్రితం నాలుగో జాబితాతో అభ్యర్థుల పేర్లన్నీ ఖరారు చేసిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ ఎవరిని నిలబెట్టినా, ప్రజలు ఈ మారు తమనే అధికారంలో కూచోబెడతారని బీజేపీ నమ్మకం. ఆఖరు నిముషంలో అభ్యర్థుల పేర్లుమార్చే కుట్రకు కేజ్రీవాల్ పాల్పడవచ్చునన్న అనుమానం కూడా ఉన్నందున అభ్యర్థుల ఖరారు విషయంలో బీజేపీ కాస్తంత జాగ్రత్త పడుతోంది.

అభ్యర్థుల జాబితాల విడుదలలో ఆప్ మాంచి దూకుడుగా వ్యవహరించింది. అయితే, ఈ నాలుగువిడతల జాబితాల్లో పదహారుమంది సిట్టింగులకు సీట్లు పోయాయి. పదకొండుమందితో కూడిన తొలిజాబితాలోనే ముగ్గురు బీజేపీ నుంచి, మరో ముగ్గురు కాంగ్రెస్ నుంచి వచ్చినవారున్నారు. రెండో జాబితాలో చాలా కొత్తమొఖాలు చేరాయి. ఒకపక్క, బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి నాలుగురోజుల క్రితం వచ్చినవారిని కూడా జాబితాల్లో చేర్చేస్తూ మరోపక్క తమది ఉన్నతమైన, భిన్నమైన పార్టీ అని కేజ్రీవాల్ ఎలా చెప్పుకో

కేజ్రీవాల్ కదనోత్సాహం

గలరని విమర్శకుల ప్రశ్న. డెబ్బయ్‌మందిలో ఓ పదిమంది బయటనుంచి వచ్చినవారు ఉన్నంతమాత్రాన విలువలు కోల్పోయినట్టేనా అని ఆప్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. అన్నా హజారే ఉద్యమంనుంచి పుట్టినందువల్ల కాబోలు, కేజ్రీవాల్ పార్టీకి అప్పట్లో ఏవో విలువలుండేవనీ, ఇప్పుడవి తరిగిపోతున్నాయని కొందరికి బాధ. ఆప్ ఈ మారు తీవ్ర గందరగోళంలో ఉన్నదన్న విమర్శలు అటుంచితే, ఈ మారు అధికారం అంత సులభం కాదన్న అనుమానం దానికి బాగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ఆర్నెల్ల క్రితం ఒక్కటిగా కనిపించిన ఇండియాబ్లాక్ ఇప్పుడంత సంఘటితంగా లేదన్న విషయం తెలిసిందే. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ వేరుపడటమే కాక, పరస్పరం కలయబడుతున్నాయి. కేజ్రీవాల్ పోటీచేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంనుంచి షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ పార్టీ నిలబెడుతోంది. కాంగ్రెస్‌తో పొత్తులేదని కేజ్రీవాల్ తేల్చేయడంతో ఆ పార్టీ మీద ఆప్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. గత పదేళ్ళు ఎవరి సాయం అక్కరలేకుండా, సొంతబలంతో చక్కగా రెండు విడతలు పాలించుకున్నాక, ఈ మారు మాత్రం పొత్తులెందుకని కేజ్రీవాల్ అనుకొని ఉంటారు. పైగా, ఆర్నెల్లనాటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నందువల్ల ఆప్‌కు దక్కిన ప్రయోజనమేమీ లేకపోయింది. దేశ రాజధానిలో ఉన్న ఏడు లోక్‌సభ స్థానాలనూ యాభైఐదుశాతం ఓట్లతో బీజేపీ ఎగరేసుకుపోయింది. ఈ నేపథ్యంలో ఈ మారు కాంగ్రెస్‌తో చెలిమి తనకు అపకారమే తప్ప ఉపకారం కాదని ఆప్ అనుకొని ఉంటుంది. పైగా, బీజేపీ మతరాజకీయాలపట్ల మెతకగా ఉంటున్న ఆప్‌కు కాంగ్రెస్‌తో ప్రత్యక్ష పొత్తు కొన్ని స్థానాల్లో నష్టం చేయవచ్చు. హిందూ ఓటర్ల మనసు గెలుచుకొనే రీతిలో ఆప్ అతిజాగ్రత్తగా వ్యవహరిస్తూ కష్టపడి కూడబెట్టుకున్న ఓటు బ్యాంకును కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా బీజేపీకి కోల్పోయే ప్రమాదం ఉన్నది. పైగా, ఆప్–కాంగ్రెస్ మధ్య ఎప్పుడూ దూరమే తప్ప సయోధ్య అరుదు. ఢిల్లీలో తనకు ఇంకాబలం ఉన్నదని నమ్ముతున్న కాంగ్రెస్ కూడా పొత్తులేకపోవడమే మంచిదని అనుకుంటోంది. సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతాలు చేసి, అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలబడుతున్న చరిత్రగల బీజేపీ మాత్రం ఈ మారు లిక్కర్ కేసు, కేజ్రీవాల్ అరెస్టు ఇత్యాది పరిణామాలతో ఆప్ పూర్తిగా ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందనీ, ఢిల్లీని వశం చేసుకోవడం ఖాయమని నమ్ముతోంది.

చెరకు రాయితీలకు మంగళం!

రైతాంగ ప్రయోజనాలను హరించే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవటం; విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెంచటం; ఎరువుల ధరల నిర్ణయ అధికారం ఆ కంపెనీలకే ఇవ్వటం; పోషకాలను బట్టి ఎరువుల సబ్సిడీ ఇవ్వటం; ధాన్య సేకరణ నుంచి ఎఫ్‌సీఐని తప్పించటం; వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థలకు అవకాశం కల్పించటం; ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూముల సర్వే చేయించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టటం; రైతుల మోటార్లకు కరెంట్ మీటర్లు బిగించమని రాష్ట్రాలకు చెప్పటం లాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసింది. తాజాగా చెరకు రైతులకు ప్రయోజనంగా ఉన్నవాటిని కూడా ఉపసంహరిస్తూ ఆర్డర్ జారీ చేసింది.

మోదీ ప్రభుత్వంలోని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ 1966 షుగర్ (నియంత్రణ) ఆర్డర్, 2018 నాటి చక్కెర నియంత్రణ ఆర్డర్‌ను కలిపి... ది షుగర్ (నియంత్రణ) ఆర్డర్–2024 ముసాయిదాను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఉత్పత్తి ప్రక్రియలో సాంకేతిక పురోగతి, పరిశ్రమలో మార్పులను పేర్కొంటూ ఈ ముసాయిదా విడుదల చేసినట్లు చెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందటానికి పంచదార రికవరీ రేటు 8.5శాతం నుంచి 10శాతానికి కొత్త ముసాయిదాలో పెంచింది. భారతదేశంలో రికవరీ రేట్ రీడింగ్‌ను సక్రమంగా తెలిపే మిషన్లు లేని కారణంతో పాటు, రికవరీని పెంచే నాణ్యమైన విత్తనం అందకపోవటం వల్ల కొత్త ముసాయిదాలో పేర్కొన్న 10శాతం రికవరీ రేటు రాని పరిస్థితుల్లో రైతులు మద్దతు ధర పొందలేరు. దేశంలో పంచదార రికవరీ 9శాతం మించి ఎప్పుడు రాలేదు. 2024 నవంబర్ మొదటి వారంలో 8.82శాతం మాత్రమే ఉంది. బ్రెజిల్ లాంటి కొన్ని దేశాల్లో మాత్రమే 11 నుంచి 14శాతం పైగా పంచదార రికవరీ వస్తుంది.



చక్కెర మిల్లులు బ్యాంకుల్లో తనఖా పెట్టిన పంచదార అమ్ముకోవటానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరని కొత్త ముసాయిదాలో పేర్కొన్నారు. ఫలితంగా చెరకు కొనుగోలు చేసిన 14 రోజులలోపు మిల్లులు డబ్బులు చెల్లించాలన్న నిబంధన నిరుపయోగమైంది. రైతులకు డబ్బులు ఎప్పుడు చెల్లించాలన్న అధికారం మిల్లులకు దక్కింది. చెరకు విక్రయ డబ్బులు పొందటానికి మిల్లర్ల దయపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది.

దేశంలో లక్షలాది రైతు కుటుంబాలకు జీవనోపాధిగా ఉండి, ఎందరికో ఉపాధి కల్పిస్తూ, పెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న చెరకు రైతాంగం ఎడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర చెరకు రైతులకు ఏ మాత్రం మేలు చేయలేదు. ఎకరాకు అన్ని రకాల సేద్యపు ఖర్చు లక్ష దాకా ఉంది. కౌలు రైతుకు అదనంగా మరో 20 వేలు ఖర్చవుతుంది. దిగుబడి ఎకరాకు 30 టన్నులు. ప్రభుత్వ చెప్పే క్వింటాల్ చెరకు ఉత్పత్తి ఖర్చు 157 రూపాయలు. వాస్తవ ఖర్చు 305 రూపాయలు. కేంద్రం ప్రకటించిన క్వింటాల్ మద్దతు ధర 350 రూపాయలు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ ఖర్చుపై 50శాతం పెంచితే రూ.450 ప్రకటించాలి. 10శాతం పంచదార రికవరీ వచ్చే చెరకుకి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. అంతకన్నా తక్కువ రికవరీ వస్తే తగ్గిన దాని ప్రకారం మద్దతు ధరలో కోత పడుతుంది.

మద్దతు ధర ప్రకారం 30 క్వింటాళ్లు వచ్చిన రైతుకు లక్షా ఐదు వేల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం సొంత భూమి రైతులకు ఖర్చులకు సరిపోవటం లేదా నామమాత్రపు మిగులు ఉంటుంది. కౌలు రైతులకు పెట్టుబడి కూడా రాదు. టన్ను చెరకు ద్వారా 280 కిలోల పంచదార లభిస్తుంది. కేజీ రూ. 30 చొప్పున 8,680 రూపాయలు వస్తుంది. మద్దతు ధర ప్రకారం టన్ను చెరకు ద్వారా రైతుకు లభించేది 3,500 రూపాయలు. మిల్లు యజమానులకు మిగులుతున్నది 5,180 రూపాయలు. ఎకరం చెరకు పైన మిల్లు యజమాని 1,60,580 రూపాయలు మిగులు పొందుతాడు. ఫ్యాక్టరీ ఖర్చుల కింద 50 వేలు తీసేసినా, లక్షకు పైగా మిగులుతుంది. చెరకు సేద్యం నష్టదాయకంగా మారటంతో ఆ రైతుల్లో విముఖత ఏర్పడి, లక్షలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా 2022లో పంచదార ఉత్పత్తి 328.7 లక్షల టన్నులు ఉండగా, 2023 నాటికి 311 లక్షల టన్నులకు తగ్గింది. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి, రైతాంగం సాగు నుండి తప్పుకునేలా చేసి, చెరకు సాగును కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, పంచదారను విదేశాల నుంచి మోదీ ప్రభుత్వం దిగుమతి చేసుకోనున్నది. ఇప్పటికే మూడు లక్షల టన్నుల చక్కెర దేశంలోకి దిగుమతి అయ్యింది.

ఈ విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది చెరకు రైతులు ఉద్యమించాలి. కొత్త షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ముసాయిదాను ఉపసంహరించాలని, టన్ను చెరకుకు 4,775 రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేయాలి.

• **బొల్లిముంత సాంబశివరావు**
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

రాజ్యాంగ స్ఫూర్తికి అవరోధమెవరు?

ఒక జాతి జీవనంలో 75 ఏళ్ల రాజ్యాంగ బద్ధ ప్రస్థానం పూర్తవడం నిస్సందేహంగా చరిత్రాత్మకమైన సంఘటన. కనుకనే నవంబర్ 26, 2024న, భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని మనం ఘనంగా నిర్వహించుకున్నాం. పార్లమెంటు ఉభయ సభలూ దైనందిన వ్యవహారాలను పక్కన పెట్టి రెండేసి రోజులు చొప్పున భారత రాజ్యాంగ ప్రస్థానంలో వెలుగునీడలను ప్రత్యేకంగా చర్చించాయి. ఉభయ సభలలోను పలువురు సభ్యులు ఉదాత్త ప్రసంగాలు చేశారు; కొంతమంది విమర్శలు, దూషణలతో మాట్లాడారు. రాజ్యాంగ సభలో ఆగస్టు 14–15, 1947 అర్ధరాత్రి జవహర్ లాల్ నెహ్రూ వెలువరించిన 'భవిష్యత్తుతో భేటీ', నవంబర్ 25, 1949న బాబాసాహెబ్ అంబేడ్కర్ వెలువరించిన 'ప్రజల చేత ప్రభుత్వం'ను పోలిన స్ఫూర్తిదాయక ప్రసంగాలను ఈ చర్చలో ఎవరూ చేయలేదు.



▪ **పి. చిదంబరం**

'పళని' పలుకు

75 సంవత్సరాల క్రితం రాజ్యాంగ సభలో జరిగిన చర్చలు, సమాలోచనల వెనుక భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన ప్రేరణ శక్తిగా ఉన్నది. జాతి భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలనే విషయమై విశాల దృక్పథం, దూర దృష్టితో ప్రతిపాదనలు చేసి, వాటిపై భిన్నాభిప్రాయాలు కలవారు అందరూ చర్చలో పాల్గొనేలా ప్రేరేపించి అంతిమంగా ఏకాభిప్రాయ సాధనతో నిర్ణయాలు తీసుకుని రాజ్యాంగ రూపకల్పనలో కాంగ్రెస్ చరిత్రాత్మక కీలక పాత్ర వహించింది. రాజ్యాంగ సభకు కాంగ్రెస్ 'ఒక క్రమ విధానాన్ని, క్రమశిక్షణను తీసుకువచ్చింది' అని డాక్టర్ అంబేడ్కర్ ప్రశంసించారు. మరి ఈనాడు కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి? లోక్‌సభలోను, రాజ్యసభలోను ప్రతిపక్షంగా ఉన్నది. ఎంత మార్పు! ఈ మార్పు బాధాకరమైనది, అయితే వెనక్కు మళ్లించలేనిది ఎంత మాత్రం కాదు.

కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయ శక్తులు అయిన భారతీయ జనతా పార్టీ, ఇతర మితవాద పక్షాలు భారత రాజ్యాంగంతో కాంగ్రెస్ సంబంధాన్ని పూర్తిగా ఒక ప్రతికూల దృక్పథంతో చూస్తున్నాయి. జూన్ 1975, మార్చి 1977 మధ్య అమలులో ఉన్న అత్యవసర పరిస్థితి, ఆ చీకటి రోజుల్లో దేశ పౌరులకు ప్రాథమిక హక్కులను నిరాకరించిన ఒక దురదృష్టకర చరిత్రకు మాత్రమే ఆ సంబంధాన్ని పరిమితం చేస్తున్నాయి. నిజమే, 139 ఏళ్ల భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో అదొక అసహ్యకరమైన అధ్యాయం. నిస్సందేహంగా నిందార్హమైనది. అయితే ఆ దురదృష్టకర పరిణామాల విషయమై దేశ ప్రజలకు ఇందిరా గాంధీ మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. అత్యవసర పరిస్థితిని విధించడం ఇంకెన్నడూ జరగబోదని వాగ్దానం చేశారు. ప్రజలు ఆమె క్షమాపణలను అంగీకరించారు. 1980లో అత్యధిక స్థానాలతో కాంగ్రెస్‌ను గెలిపించి ఆమెకు మళ్లీ అధికారాన్ని అప్పగించారు.

అత్యవసర పరిస్థితి విధింపు మినహా రాజ్యాంగంతో కాంగ్రెస్‌కు మరేమీ సంబంధం లేదా? రాజ్యాంగ నిర్మాణంలోనూ, దానిని అమలుపరచడంలోనూ కాంగ్రెస్ పార్టీ మహోదాత్త పాత్రను ఎలా విస్మరించగలం? బీజేపీ ఉపేక్షించినా చరిత్ర మరచిపోతుందా? రాజ్యాంగంతో కాంగ్రెస్ సహవాసం ఒక స్ఫూర్తిదాయక గాథ. అరుదుగా మాత్రమే దానిని గుర్తు చేసుకోవడం, చెప్పడం జరుగుతోంది. రాజ్యాంగానికి సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు అధికరణ 368 ద్వారా సమకూరింది. ఏ దేశ రాజ్యాంగానికి అయినా తప్పనిసరిగా ఉండే అధికారమిది. ఎందుకంటే ఏ జాతి జీవనమూ నిల్వ నీరుగా ఉండదు. సుఖదుఃఖాలతో జాతి ప్రస్థానం సాగుతుంటుంది. ఈ సాగుతున్న యాత్రలో అపాయాలు ఎదురవుతాయి, అవకాశాలూ లభిస్తాయి. అధికార వ్యవస్థలో ప్రధాన భాగమైన న్యాయవ్యవస్థ మారుతున్న పరిస్థితులు, సందర్భాలకు అనుగుణంగా రాజ్యాంగ నిబంధనలకు వివరణలు ఇస్తుంది, భాష్యాలు చెబుతుంది. ఈ న్యాయ వివరణలు, భాష్యాలు తుది మాటగా ఉండవు, ఉండబోవు. కాలానికి అనుగుణంగా ఉండే రాజ్యాంగమే సజీవమైన సంవిధానం. మారుతున్న జాతి జీవనానికి అనుకూలంగా ఆ మౌలిక శాసనాన్ని మార్చుకోవల్సి ఉంటుంది. కాలానుగుణ మార్పులకు అనుగుణంగా ప్రతిస్పందించగలగడమనేది ఒక సరైన రాజ్యాంగానికి తార్కాణం. మరింత స్పష్టంగా చెప్పాలంటే రాజ్యాంగం సదా సమకాలీనంగా ఉండాలి. మన రాజ్యాంగం అటువంటి విశిష్ట సంవిధానం. పార్లమెంటులో రాజ్యాంగంపై జరిగిన చర్చలో నేనూ పాల్గొని ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగానికి తీసుకువచ్చిన సవరణల గురించి విపులంగా తప్పక ప్రస్తావించి ఉండేవాణ్ణి. ఎందుకంటే ఆ సవరణలు మన రాజ్యాంగాన్ని మరింతగా శక్తిమంతం చేశాయి. రాజ్యాంగ మున్నుడిలోని మహోదాత్త ఆదర్శాలు దేశ ప్రజల జీవితాలలో ప్రతిఫలించేందుకు ఆ సవరణలు విశేషంగా దోహదం చేశాయి. ముఖ్యంగా న్యాయం (సామాజిక, ఆర్థిక, రాజకీయ), సమానత్వం (అంతస్తు, అవకాశం) ప్రతి ఒక్కరికీ సమకూర్చడమే లక్ష్యంగా ఆ సవరణలు జరిగాయి.

రాజ్యాంగ (ప్రథమ సవరణ) చట్టం, 1951 స్వతంత్ర భారత దేశ మొట్టమొదటి ముఖ్య శాసనం. సామాజికంగా, విద్యా వ్యాసంగాలలో వెనుకబడిన వర్గాలవారు లేదా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (దళితులు, గిరిజనులు) అభ్యున్నతికి ఉద్దేశించిన రిజర్వేషన్లకు ఆ చట్టం రాజ్యాంగ పరిరక్షణను కల్పించింది. ఆ ప్రథమ రాజ్యాంగ సవరణే లేని పక్షంలో అసలు ఎలాంటి రిజర్వేషన్ల వ్యవస్థనూ ఏర్పాటు చేయడం సాధ్యమయ్యేది కాదు. ఈ మొదటి సవరణ ద్వారా రాజ్యాంగంలో అధికరణ 31ఎ, అధికరణ 31బి ని చేర్చడం జరిగింది. తద్వారా దోపిడీ, అణచివేతలకు నెలవైన భూస్వామ్య జమిందారీ వ్యవస్థ రద్దుకు మార్గం సుగమమైంది. లక్షలాది రైతు, రైతు కూలీ కుటుంబాలు తమ దైన్య పరిస్థితుల నుంచి విముక్తమయ్యారు. భూసంస్కరణలకు, మిగులు భూముల పంపిణీకి కూడా రాజ్యాంగ మొదటి సవరణ విశేషంగా సహకరించింది. వ్యాపార వాణిజ్యాలు, పరిశ్రమలు, సేవల రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థల వ్యవస్థాపనకు కూడా చట్టపరమైన పునాదులను ఈ మొదటి సవరణే నిర్మించింది.



పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చ పాలక, ప్రతిపక్షాల పరస్పర ప్రత్యారోపణల మయంగా జరిగింది. భారత గణతంత్ర రాజ్య 75 సంవత్సరాల రాజ్యాంగబద్ధ ప్రస్థానంలో ఏకైక పథ భ్రష్టత (అత్యవసర పరిస్థితి విధింపు) కేంద్రంగా వాదోపవాదాలు సాగాయి. మరి బీజేపీ సంకల్పించిన ఒకే దేశం ఒకే ఎన్నిక సహా వివిధ మార్పులు ఆ ఏకైక పథ భ్రష్టత కంటే మన ప్రజాస్వామ్యానికి, సమాఖ్య పాలనా విధానానికి మరింత ఎక్కువగా హానిచేసేవే కావూ?

రాజ్యాంగ (42వ సవరణ) చట్టం–1976 రాజ్యాంగంలో అనేక మార్పులు చేసింది. అందుకే ఆ మార్పులను, వాటికి కారణమైన కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించడం జరుగుతోంది. అయితే అదే చట్టం ద్వారా రాజ్యంగంలో జరిగిన రెండు మార్పులను భావి తరాలు తప్పక గుర్తుంచుకుంటాయనే వాస్తవాన్ని చాలా తక్కువమంది మాత్రమే ప్రస్తావిస్తున్నారు. వాటిలో ఒకటి రాజ్యాంగంలో అధికరణ 39ఎ చేర్పు. ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరిగేందుకు ప్రభుత్వమే 'ఉచిత న్యాయ సహాయం'ను సమకూర్చాలని ఆ మార్పు నిర్దేశించింది. మరొక మార్పు అధికరణ 48ఎ చేర్పు. ప్రభుత్వమే 'పర్యావరణాన్ని పరిరక్షించి, మెరుగుపరచాలని, అడవులు, వన్య ప్రాణులను సంరక్షించాలని' ఈ కొత్త అధికరణ నిర్దేశించింది.

రాజ్యాంగ (52వ సవరణ) చట్టం–1985 రాజ్యాంగంలో 10వ షెడ్యూలును ప్రవేశపెట్టింది. దేశ రాజకీయాలకు చీడగా పరిణమించిన ఆయారామ్, గయారామ్ బెడద అంటే పార్టీ ఫిరాయింపుల సమస్యను తుదముట్టించేందుకు ఈ సవరణ చట్టం ప్రప్రథమంగా ప్రయత్నించింది. శోచనీయమైన విషయమేమిటంటే అది చట్ట సభలకు ఎన్నికైన సభ్యుల జిత్తులమారితనం, వారికి సభాపతుల (స్పీకర్ల) నుంచి రహస్య ప్రోత్సాహం, ఈ పరిణామాలపై న్యాయస్థానాల అయోమయ తీర్పులు ఇత్యాది వైపరీత్యాలను ఆ చట్ట నిర్మాతలు ఊహించలేకపోయారు. పదవ షెడ్యూలును సవరించినప్పుడే ఆ షెడ్యూలు లక్ష్యం నెరవేరుతుందని నిక్కచ్చిగా చెప్పక తప్పదు.

చాలా విస్తృత పర్యవసానాలకు దారితీసి, విశేష ప్రభావాన్ని చూపిన సవరణలు: రాజ్యాంగ (73వ సవరణ) చట్టం–1992, రాజ్యాంగ (74వ సవరణ) చట్టం–1992. ఇవి స్థానిక స్వపరిపాలనా సంస్థలు అయిన పంచాయత్‌లు, పురపాలక సంఘాలను రాజ్యాంగబద్ధ సంస్థలుగా చేయడం ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠమూ, ప్రగాఢమూ చేశాయి. ఈ చట్టాల ఫలితంగా మహిళలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన లక్షలాది మందిని రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చాయి. మహిళలు, దళితులు, ఆదివాసీలకు తమ ప్రజాస్వామ్య అధికారాలను వినియోగించే సాధికారతను అవి కల్పించాయి. పాలనాధికారాలను ఇంతగా క్రిందిస్థాయి పాలనా సంస్థలకు బదిలీ చేయడం, రాజకీయ అధికారాలు, అవకాశాలను విస్తృతంగా పునఃపంపిణీ చేయడం చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరగలేదు.


పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చ, దురదృష్టవశాత్తు పాలక, ప్రతిపక్షాల పరస్పర ప్రత్యారోపణల మయంగా జరిగింది. భారత గణతంత్ర రాజ్య 75 సంవత్సరాల రాజ్యాంగ బద్ధ ప్రస్థానంలో ఏకైక పథ భ్రష్టత (అత్యవసర పరిస్థితి విధింపు) కేంద్రంగా వాదోపవాదాలు సాగాయి. అవేవీ ఉదాత్తమైనవి కావు. మరి బీజేపీ సంకల్పించిన ఒకే దేశం ఒకే ఎన్నిక సహా వివిధ మార్పులు ఆ ఏకైక పథ భ్రష్టత కంటే మన ప్రజాస్వామ్యానికి, సమాఖ్య పాలనా విధానానికి మరింత ఎక్కువగా హానిచేసేవే కావూ? అయినప్పటికీ మన రాజ్యాంగం వెన్ను దృఢమైనదని, ఆ మహోన్నత సంవిధాన ప్రగతిశీల స్ఫూర్తి అంతిమంగా అజేయంగా వెలుగొందుతుందని నేను నిండుగా విశ్వసిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

దేశభక్తే ఆయన ఆధ్యాత్మికత

త్యాగం చేయమని బోధించేముందు తాను త్యాగం చేసి ఎందరు చూపించగలరు? దైవభక్తి కంటే దేశ భక్తి గొప్పది అని ఒక సనాతన సంప్రదాయ కుటుంబంలో పుట్టి ఎందరు చెప్పగలరు? ఇవ్వడమే తప్ప ఆశించడం తెలియని ప్రకృతిలా జీవించాలని బోధించేవారే తప్ప జీవితంలో ఆచరించే వారెందరు? ఇటువంటి లక్షణాలున్న వ్యక్తి మన మధ్య జీవించారు. వారే 'హాల్ ఆఫ్ టైమ్స్' గ్రంథాలయాన్ని భీమిలిలో ఏర్పాటు చేసిన శివానందమూర్తి. కొందరు ఆయనలో ఆధ్యాత్మిక గురువును చూస్తే మరికొందరు గొప్ప దేశభక్తుణ్ణి చూసారు.

1928 డిసెంబర్ 21న రాజమండ్రిలో సర్వమంగళా దేవి, వీర బసవరాజు దంపతులకు జన్మించిన ఏకైక సంతానం శివానంద మూర్తి. ఉర్లాం సంస్థానానికి ఏకైక వారసులు, జమిందారీ పద్ధతిలో పెరిగినవారు. డిగ్రీ పూర్తి కాగానే తాను ఒంటరిగా లోకంలోకి వెళ్లి జీవించాలనుకుంటున్నానని ఆయన తల్లిదండ్రులకు చెప్పారు. జమీన్‌కి నువ్వే వారసుడివి, నువ్వెళ్ళిపోతే ఎలా అని తండ్రి అభ్యంతరం చెప్పినా, ఆస్తిలో నీకు హక్కు ఉండదని హెచ్చరించినా శివానందమూర్తి నిర్ణయంలో మార్పు రాలేదు. పోలీస్ డిపార్టుమెంటులో క్లర్క్‌గా ఉద్యోగం సంపాదించారు, వరంగల్ చేరారు. ఆ తరువాత పెద్దలకు నచ్చిన అమ్మాయినే పెండ్లి చేసుకొని చిన్న గదిలో కాపురం పెట్టారు. కార్మికులంతా ఉండే ఆ కాలనీ వీధి కొళాయి దగ్గర బకెట్లో నీళ్ల పట్టుకొని ఇంటికి మోసుకెళ్లే శివానందమూర్తిని చూసి ఈయనేనా ఉర్లాం జమీందార్ వారసులు అని చుట్టుపక్కలవారు ఆశ్చర్యపోయేవారు. కాలికి చెప్పులు లేకుండా దేశం మొత్తం పాదయాత్ర చేసినవారు శివానంద మూర్తి.



తనకున్న దానిలోనే పొరుగువారికి సహాయం చేయడం, వారి కష్టాల్లో పాలుపంచుకోవడం శివానంద మూర్తికి అలవాటు. హోమియో వైద్యంతో ఉచిత సేవలు అందించి అందరికీ స్వస్థత చేకూర్చేవారు. తెలిసిన జ్యోతిషవిద్యతో ముహూర్తాలు పెట్టేవారు. వారి సతీమణి గంగాదేవి ఎవరైనా ప్రసవం అయితే వారికి సపర్యలు చేసేవారు. అలా వరంగల్లులో వారున్న ప్రాంతంలోనే కాక దూరప్రాంతాలకు కూడా వారి సేవలు విస్తరించాయి. చివరకు సమీపంలోని గ్రామాల వారు తమ ఆవులు కనిపించకపోతే ఆయనను సంప్రదించేవారు, వారు చెప్పినట్టు చేస్తే అవి దొరికేవి. ఒక పక్క ఉద్యోగం చేస్తూ మరోపక్క సమాజసేవలో నిమగ్నమయ్యారు ఆయన. లుంగీ కట్టుకొని తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణం చేయడం దగ్గర్నుంచి బృందాలను హిమాలయాలకు, ఇతర చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లి వాటి విశిష్టత వివరించడం వరకూ ఆయన కార్యాచరణ ఎందరికో దిశానిర్దేశం చేసింది.

శివానందమూర్తిలో బహుముఖ వ్యక్తిత్వాలను దర్శించినవారున్నారు. దైవభక్తులు ఆయనను సద్గురు అని సంబోధించారు. ఆయన మాత్రం దైవభక్తులకు ఎటువంటి పుణ్యం సంప్రాప్తమవుతుందో, దేశభక్తులకూ అటువంటి పుణ్యమే దొరుకుతుందని చెప్పేవారు. దేశ భక్తి లేని దైవభక్తి వ్యర్థమనీ, భారతదేశం బాగుంటే ప్రపంచం బాగుంటుందనేవారు. తమను ఆశ్రయించిన కుటుంబాలలో పిల్లలకు 'మీరు చదువుకోండి. విదేశాలకు వెళ్లారా వెళ్ళండి. సంపాదించండి, సుఖంగా ఉండండి. ఒక్కటే కండిషన్. ఏది చేసినా ధర్మం తప్పకండి. శక్తి ఉండగానే మీవంతు సేవలు దేశానికి అందించేందుకు సిద్ధంకండి' అని చెప్పేవారు. అంతే తప్ప మూఢభక్తిని ఎన్నడూ ప్రోత్సహించలేదు.

శివానందమూర్తి పుస్తక ప్రియులు. ఎక్కడకు వెళ్లినా పుస్తకాలు కొనకుండా, అక్కడి గ్రంథాలయాలను సందర్శించకుండా వచ్చేవారు కాదు. అలా ఎవరి దగ్గరా లేని అరుదైన గ్రంథాలను సేకరించారు. నిరంతరం చదవటమే. వారు చదివిన పుస్తకాలే పెద్ద గ్రంథాలయంగా ఏర్పాటైంది. భీమిలి ఆనందవనంలో ఎందరో పరిశోధకులకు ఆ గ్రంథాలయం ఉపయోగపడుతున్నది. వారు ఇంటర్మీడియట్ చదువుతున్నపుడు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ లెక్చరర్. వారిరువురిదీ వయోభేదం లేని స్నేహం. శివానంద మూర్తి చదివింది బిఎస్‌సి మాత్రమే. కానీ సంగీతం, సాహిత్యం, ఖగోళం, వైద్యం, జ్యోతిషం, ఆంగ్లసాహిత్యం... ఇలా ఏ సబ్జెక్టు గురించి అయినా సమగ్రంగా మాట్లాడే వారు. శివానందమూర్తి అంతేవాసి (జర్మనీలో చదువుకున్న తమిళుడు) ప్రొఫెసర్ రాఘవేంద్రన్. ఆయనతో ఇంగ్లీష్ సాహిత్యం గురించి మాట్లాడుతుంటే ఒక మనిషికి ఇన్ని అంశాలలో పట్టు ఎలా సాధ్యం? అని ఆశ్చర్యచకితులయ్యేవారు. ఈ ప్రశ్నే వారితో 'శివానంద యోగం' అనే పుస్తకాన్ని ఆంగ్లంలో రాయించింది.. శివానందమూర్తి ప్రసంగాలు గ్రంథాలుగా వెలువడుతున్నాయి. అందులో భారతీయత పేరుతో నాలుగు భాగాలు వచ్చాయి. మన దేశం గురించి చాల ప్రశ్నలకు సమాధానాలు ఆ ప్రసంగాలలో లభిస్తాయి. 2015 జూన్ 11న దేహత్యాగం చేసినా శివానంద మూర్తి ఆరంభించిన సేవలు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కొనసాగుతూనే ఉన్నాయి.

○ **నట్టి శ్రీనివాసరావు**

అభివృద్ధి దిశగా అడుగులు!

అసమర్థ పాలకుల నియంతృత్వ, మూర్ఖపు చర్యలతో గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అరాచకంతో అప్పుల పాలయింది. రాష్ట్ర భవిష్యత్తును కాచుకోవడమే లక్ష్యంగా విధ్వంస ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టింది కూటమి ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అలంబనలయ్యే పోలవరం, అమరావతి రాజధాని నగర నిర్మాణాలను పరుగులు తీయించడం సీఎం చంద్రబాబు దీక్షా దక్షతలకు అద్దం పడుతున్నది. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించింది. కొత్త ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుతో రాష్ట్రాల్లో గణనీయమైన పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఆరు నెలల్లో 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు పెట్టుబడులతో వచ్చాయి. కేంద్రం నుంచి అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి రూ. 12,500 కోట్లు సాధించడం, కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక పార్కులకు 25 వేల కోట్ల పెట్టుబడులు సాధించడం, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించడం వంటివి రాష్ట్రాభివృద్ధికి మేలు చేస్తాయి. అలాగే రూ.55 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులు రెండున్నరేళ్లలో పూర్తి చేయడానికి కేంద్రం అనుమతి సాధించడం, రూ.70 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు సాధించడం వంటి కార్యక్రమాలతో చక్కటి ప్రణాళికతో రాష్ట్రాన్ని అభివృద్ధిబాట పట్టించడానికి కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతున్నది. కూటమి పాలనలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తున్నది.

– **నీరుకొండ ప్రసాద్**

జమిలితో కొత్త ఎన్నికల వ్యవస్థ

దేశమంతా లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే పట్టుదలతో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎట్టకేలకు ఈ ప్రక్రియలో ఒక ముందడుగు వేసింది. డిసెంబర్ 17న జమిలి ఎన్నికలకు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు–2024, కేంద్రపాలిత చట్ట సవరణ బిల్లు–2024 అనే రెండు ముసాయిదా బిల్లులను లోక్‌సభలో కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ప్రధాని మోదీ సూచన మేరకు ఈ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించనున్నట్లు మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ స్పష్టం చేశారు. దీని ద్వారా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశాలు కల్పించినట్టు అవుతుందనే భావన కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. అందరూ ఊహించినట్లుగానే ఈ బిల్లులు రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నాయంటూ ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇవి రాజ్యాంగ మూల స్వరూపానికి, సమాఖ్య వ్యవస్థకు ఎటువంటి భంగం కలిగించవని పేర్కొంది. ఈ సవరణల ద్వారా రాష్ట్రాల అధికారాలను తగ్గించడం లేదా లాగేసుకోవడం జరగదని స్పష్టం చేసింది. జమిలి ఎన్నికలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు.



ధన రాజకీయాలకు లభిస్తున్న తాత్కాలిక ఆదరణను జన రాజకీయంగా భ్రమింపజేయకుండా... సమర్థులు, నిజాయితీపరులు, ముఖ్యంగా యువత నాయకత్వ బాధ్యతల్ని అందుకోవాలి. వారు తమ తర్వాతి తరానికి ఆ బాధ్యతల్ని బదిలీ చేసేలా రాజకీయ, పాలనా, ఎన్నికల వ్యవస్థల్ని మార్చే సంస్కరణల్ని తెచ్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయడం ఇప్పుడు ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం.

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. రాజ్యాంగ సవరణలు కూడా చేయాలి కాబట్టి దీనిపై పార్లమెంట్‌లో కూడా పూర్తిస్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకేసారి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయిలో భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉంటుంది కానీ, ప్రాంతీయ భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉండదనే భయంతో ఈ జమిలి ఎన్నికల విధానాన్ని సహజంగానే కొన్ని పార్టీలు వ్యతిరేకిస్తాయి. అందులోనూ మన దేశంలో ఏ విధానం పైనైనా విభేదాలు తలెత్తగానే పార్టీలు ఆరోగ్యకరమైన చర్చను ప్రోత్సహించే బదులు త్వరపడి ఏకపక్ష నిర్ణయానికి వచ్చేస్తాయి. కీలకమైన అంశాలపై సామరస్య వాతావరణంలో చర్చ జరగడం చాలా అరుదవుతోంది. ప్రత్యర్థుల భావాలను సానుభూతితో అర్థం చేసుకునే ప్రయత్నం గానీ, తమ వాదనను సాక్ష్యాధారాలతో హేతుబద్ధంగా వివరించి ఎక్కువ మందిని తమ మార్గం వైపు ఆకర్షింపజేసుకునే ప్రయత్నం గానీ మన సమాజంలో కొరవడుతున్నాయి.

దేశమంతా ఒకేసారి ఎన్నికలు అనేది మొత్తం దేశాన్ని ప్రభావితం చేసే అంశం కాబట్టి పార్లమెంట్‌లో పూర్తి స్థాయిలో చర్చ జరగాలి. కేవలం జమిలి ఎన్నికల నిర్వహణ ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసమే అయితే అది వృథా ప్రయాసే అవుతుంది. ఈ విధానంపై ఇప్పుడు సర్వత్రా కనిపిస్తున్న ఆసక్తిని మన ఎన్నికల వ్యవస్థను మెరుగుపరిచే సదవకాశంగా వినియోగించుకోవడం అవసరం. ఎన్నికల సంస్కరణలు అనగానే నేర చరితులు, పార్టీల విరాళాలు, సంపన్న అభ్యర్థులు, నల్ల డబ్బుతో ప్రచారం, ఓట్ల కొనుగోలు తదితర అంశాలన్నీ ప్రస్తావనకు వస్తాయి. తరచి చూస్తే ఇవన్నీ ఒకే సంక్షోభానికి బహురూపాలు. ఒకే రోగానికున్న రకరకాల లక్షణాలు అని కూడా చెప్పుకోవచ్చు. నేతలు వ్యక్తిగతంగా అవినీతి చేసినా, పార్టీ గెలుపు కోసం చేసినా ప్రజలకు మాత్రం నష్టంలో తేడా ఏమీ ఉండదు. పోయేది ప్రజల సొమ్మే. మనం చేస్తున్న తప్పిదం ఏమిటంటే.. మనం కోరుకుంటున్న లక్ష్యాల్ని సాధించుకోవడానికి, తగిన వ్యవస్థల్ని నిర్మించుకోవడానికి కావలసిన సంస్కరణల కోసం ప్రయత్నించకపోవడం.

మన దేశంలో గత ఏడు దశాబ్దాలుగా ప్రజల సమస్యలు మరింత పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ముసుగులో మన దేశంలో జరిగే ఎన్నికలు... ఒక తంతు మాత్రమే అని మనమంతా ఒప్పుకోక తప్పదు. అటు నేతలు, ఇటు ప్రజలు చెరోదిక్కున సమస్యను పెంచి పోషిస్తూ సంక్షోభం దిశగా వెళ్తున్నారు తప్ప, ఈ విష వలయాన్ని ఛేదించే పరిష్కారాల మీద దృష్టి పెట్టడం లేదు. పేదరికంలో ఉన్నవారు ఈ రాజకీయం ఇంతే, అవినీతిపరులైన నేతల నుంచి దక్కిందే చాలు అన్నట్టు ఓటును వృథా చేస్తున్నారు. ఈ రాజకీయం కుళ్లిపోయింది, ఎవరో దైవదూతలు వస్తే తప్ప మార్పు తేవడం కుదరదు అనుకునే చాలామంది ఆలోచనాపరులు, మధ్యతరగతి వారు ఎన్నికల ప్రక్రియ పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. అసలు ఈ వ్యవస్థే మంచిది కాదు, దీన్ని పూర్తిగా కూలదోసి మరో వ్యవస్థను తేవాలని మరికొందరు పిడివాదులు భావిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా కూడా ఉన్న వ్యవస్థను పూర్తిగా కూలదోసి, దాంతో సంబంధం లేకుండా కొత్త వ్యవస్థ వచ్చి విజయవంతమైన దాఖలాలు లేవు. కాబట్టి గతంలో మన వ్యవస్థలోని మంచిని కొనసాగిస్తూ వినియోగించుకుంటూనే, నూతన వ్యవస్థల నిర్మాణం చేసుకోవాలి. అందుకే ఇప్పుడు ఉన్న ఎన్నికల వ్యవస్థని ప్రక్షాళన చేయాలి.

పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ఇప్పుడైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ కలిసి కొన్ని కఠిన నిర్ణయాలు, కొన్ని సంస్థాగత నిర్ణయాలు తీసుకోక తప్పదు. మొదటిది– సమర్థులు, నిజాయితీపరులైన అధికారులను ఎంపికచేసి, వారికి తగిన అధికారాలను, సిబ్బందిని ఇచ్చి వెన్నుతట్టి ప్రోత్సహించడం. రెండవది– నేరగాళ్ళను, ముఠా నాయకులను ఎన్నికలకు దూరంగా ఉంచడం. ఆత్మస్తుతి, పరనింద మాని అన్ని రాజకీయ పార్టీలూ ఇకనైనా పరిస్థితిని మార్చడానికి నడుం కట్టాలి. నాలుగు సీట్లు పోయినా పర్వాలేదు, మేం మాత్రం మా పద్ధతి మార్చుకుంటున్నాం అని ప్రజలకు ప్రత్యక్షంగా రుజువు చేయగలగాలి.

ఇదే సందర్భంలో ధన రాజకీయాలకు లభిస్తున్న తాత్కాలిక ఆదరణను జన రాజకీయంగా భ్రమింపజేయకుండా... సమర్థులు, నిజాయితీపరులు, ముఖ్యంగా యువత నాయకత్వం బాధ్యతల్ని అందుకోవాలి. వారు వీలున్నంతకాలం చేశాక తమ తర్వాతి తరానికి ఆ బాధ్యతల్ని బదిలీ చేసేలా రాజకీయ, పాలనా, ఎన్నికల వ్యవస్థల్ని మార్చే సంస్కరణల్ని తెచ్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయడం ఇప్పుడు ప్రజల ముందున్న ప్రధాన లక్ష్యం. ఎన్నికల విషయంలో ప్రభుత్వాలు, పార్టీలు, ప్రజలు ఈ వాస్తవాల్ని గుర్తిస్తే... ఖచ్చితంగా జమిలి విధానం ఎన్నికల సంస్కరణలో ఒక కీలక ముందడుగు అవుతుంది.

▪ **కూసంపూడి శ్రీనివాస్**
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో సీఎంను చూసిన ఆనందంలో విద్యార్థులు

ఓవైపు రైతులు.. మరోవైపు విద్యార్థులు.. ఇంకోవైపు స్థానికులు.. ఇలా ప్రతి ఒక్కరి సమస్యలు సావదానంగా వింటూ, పరిష్కార మార్గాలను చూపిస్తూ, నేనున్నాననే భరోసానిస్తూ జిల్లాలో శుక్రవారం సీఎం చంద్రబాబు పర్యటన సాగింది. గంగూరులోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి, ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించి, ఈడుపుగల్లులోని రెవెన్యూ సదస్సులో పాల్గొని.. ప్రధానమైన సమస్యలను ప్రస్తావించిన సీఎం వాటికి పరిష్కార మార్గాలను చూపించారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



మమేకమై..

సమస్యలు వింటూ.. సావదానంగా పరిష్కరిస్తూ..

పెనమలూరులో సీఎం చంద్రబాబు పర్యటన

- గంగూరు రైతుసేవా కేంద్రం, రైస్‌మిల్ పరిశీలన
- కంకిపాడు మండలంలో రెవెన్యూ సదస్సు.. అర్జీల స్వీకరణ
- ధాన్యం తేమశాతంలో వ్యత్యాసాలు రాకుండా చర్యలు
- రైతులతో ముఖాముఖీ మాట్లాడి ఆపన్నహస్తం
- గంగూరు రైతుసేవా కేంద్రంలో తనిఖీలు
- రైతులకు ఇబ్బంది కలిగించొద్దంటూ అధికారులకు ఆదేశాలు
- ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో సీఎం సందడి

మీడియాతో చిట్‌చాట్

పట్టిసీమ ద్వారా ముందే సాగునీరందిస్తాం : సీఎం

6లో



గంగూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యపు బస్తాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (పై ఫొటో), ఈడుపుగల్లులో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన స్థానికులు (కింద ఫొటో)



మచిలీపట్నం/కంకిపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు, రైతుసేవా కేంద్రంలో పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం పరిశీలించారు. తొలుత ఆయన పెనమలూరు మండలంలోని గంగూరు రైతుసేవా కేంద్రానికి చేరుకున్నారు. అక్కడి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రైతులు సీఎంతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ అవుతోందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగటంతో ఖర్చులు తగ్గుతున్నాయని, దిగుబడులు పెరుగుతున్నాయని తెలిపారు. యంత్రాల ద్వారా వరికోతలు కోయటంతో ఎకరాకు ఐదారువేల ఖర్చులు కలిసొస్తున్నాయని, వరిగడ్డిని వృథా చేయకుండా బయోఫ్యూయల్ ప్లాంట్‌కు విక్రయిస్తే ఎకరాకు రూ.5 వేల వరకు ఆదాయం వస్తుందని సీఎం తెలిపారు. ధాన్యానికి సకాలంలో నగదు జమ అవుతుందా, లేదా అనే అంశంపై రైతుల నుంచి ముఖ్యమంత్రి వివరాలు రాబట్టారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రైతుసేవా కేంద్రం పరిశీలన

గంగూరులోని రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన షెడ్యూలింగ్‌ను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ధాన్యం ఎంతమేర దిగుబడి వచ్చిందో కూడా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. తేమశాతం కొలిచే విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుసేవా కేంద్రంలో వీఏవో లాగిన్‌ను ఓపెన్ చేసి ఆకునూరి సాంబశివరావు అనే రైతు ధాన్యం విక్రయాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయించారు. రైతులకు సంచుల కొరత లేకుండా చూడాలని

మిగతా 6లో..



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ఇంద్రకీలాద్రిపై రాజగోపురం (ఇన్‌సెట్‌లో) సిద్ధమైన హోమగుండం

నేటి నుంచి భవానీ దీక్షా విరమణోత్సవాలు

విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ఇంద్రకీలాద్రి

- 6 లక్షల మంది వరకు భవానీలు వస్తారని అంచనా
- అంతరాలయ దర్శనం రద్దు
- నేటి ఉదయం 6.30 గంటలకు తొలిదర్శనం
- 25వ తేదీతో ఉత్సవాలు ముగింపు

6లో

సెక్టార్లవారీ బందోబస్తు

- భవానీ దీక్షల విరమణకు పటిష్ఠ నిఘా ఏర్పాటు
- 45 సెక్టార్లుగా విభజించి విధుల కేటాయింపు
- విధుల్లో 4,600 మంది పోలీస్ సిబ్బంది
- ఇతర జిల్లాల నుంచి 2,594 మంది రాక
- 6 లక్షల వరకు భవానీలు వస్తారని అంచనా
- 2,200 సీసీ కెమెరాలు, 20 డ్రోన్ల వినియోగం



'ఆంధ్రజ్యోతి'తో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు

6లో

గౌతంరెడ్డిపై లుక్ అవుట్ నోటీసు

విజయవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గందూరి ఉమామహేశ్వరశాస్త్రి స్థలాన్ని కబ్జా చేయడంతో పాటు అతడిపై సుపారీ గ్యాంగ్‌తో హత్యాయత్నం చేయించిన వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డికి విజయవాడ పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. గతనెల 6వ తేదీన ఉమామహే శ్వరశాస్త్రిపై హత్యాయత్నం చేయించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులను సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గౌతంరెడ్డితో పాటు మరో నిందితుడు పరారీలో ఉన్నారు. వారి కోసం మూడు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గౌతంరెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు పిటిషన్ దాఖలు చేసుకుని కొద్దిరోజుల పాటు ఊరట పొందారు. తర్వాత ఈ పిటిషన్‌ను కోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టు తలుపులు తట్టారు. ఈలోపు పోలీసులు తన చేతులకు సంకెళ్లు వేస్తారని భావించి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కాగా గౌతంరెడ్డి విదేశాలకు పారిపోకుండా విజయవాడ పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు.



చలి జల్లులు

నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంచుతో పాటు చిరుజల్లులు కురవడంతో నగరవాసులు వణికిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగా ఉండటంతో కొందరు ఇళ్లు వదిలి బయటకు రాలేదు.

విజయవాడ రైల్వే డివిజన్‌కు ఇంధన పొదుపు పురస్కారాలు

8లో

శివార్పణం

ముక్త్యాల కోటిలింగ క్షేత్రం ధారాదత్తం

తాళ్లయపాలెంకు చెందిన శైవక్షేత్రానికి అప్పగించటంపై విమర్శలు

- కోట్లాది రూపాయల ఆస్తులు... దండిగా కానుకలు
- ఉత్తర కాశీగా ప్రాచుర్యం
- వైసీపీ హయాంలో అప్పటి ఏసీ శాంతి సహకారంతో స్కెచ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆచరణ



ముక్త్యాల ఆలయం

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట రూరల్) : దక్షిణ కాశీగా వెలుగొందుతూ, కోట్లాది రూపాయల ఆస్తులున్న ఆలయాన్ని దేవదాయ శాఖ దత్తత ఇవ్వటం అనుమానాలను రేకెత్తిస్తోంది. జగ్గయ్యపేట సమీపంలోని ముక్త్యాల కోటిలింగ క్షేత్రాన్ని దత్తత పేరుతో గుంటూరు జిల్లా తాళ్లయపాలేనికి చెందిన శైవక్షేత్రానికి అప్పగించటం పట్ల భక్తులు అవాక్కవుతున్నారు. 2006లో కంచికచర్లకు చెందిన దాత గద్దె ప్రసాద్ 46 ఎకరాల విస్తీర్ణంలో కోట్ల వ్యయంతో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరస్వామి ఆలయాలతో పాటు భారీ ముఖ మండపం, నాలుగు ధ్వజస్తంభాలను నిర్మించారు. దానికి అనుసంధానంగా 108 ఉపాలయాలను ఏర్పాటుచేశారు. సమీపంలోనే కోనేటి రాయుడు, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. కృష్ణానది ఉత్తరవాహిని క్షేత్రం ముక్త్యాలకు మణిహారంగా ఉన్న ఈ ఆలయం గద్దె ప్రసాద్ హయాంలో నిర్వహణ కష్టంగా మారటంతో 2009లో దేవదాయ శాఖకు అప్పగించారు. నేటి వరకు ఆలయం ఆ శాఖ ఆధీనంలో ఉంది. రూ.45 లక్షల వార్షిక ఆదాయం, రూ. 1.60 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 46 ఎకరాల సువిశాల ప్రాంగణాన్ని.. దత్తత పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది ఆలయాలను నిర్వహించే దేవదాయ శాఖ ఈ ఆలయాన్ని అభివృద్ధి పరచలేదా, నిర్వహించలేదా అని చర్చించుకుంటున్నారు.

రూ.కోట్ల విలువైన క్షేత్రంపై కన్ను?

ముక్త్యాలలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రం ప్రారంభ తొలిదశలో గద్దె ప్రసాద్, శివస్వామి పర్యవేక్షణలోనే శంకుస్థాపన జరిగింది. అనంతరం శివస్వామి తాళ్లాయపాలెంలో సొంత క్షేత్రం ఏర్పాటు చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముక్త్యాల కోటిలింగ క్షేత్రంపై కన్నేసిన వ్యక్తులు తమకున్న లావాదేవీలతో అప్పటి ఏసీ, సస్పెండ్ అయిన శాంతి సహకారంతో రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా వివిధ మార్గాల్లో ఆలయాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదని సమాచారం. తాజాగా కూటమి ప్రభుత్వం రాగానే అంగ, అర్థబలంతో ఈ ఆలయాన్ని దత్తత పేరుతో స్వాధీనం చేసుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దత్తత కార్యక్రమం జరిగేందుకు రూ.లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు సైతం నెలకొన్నాయి. దేవదాయ శాఖ ఇంతకన్నా అధ్వానంగా ఉన్న ఆలయాలను నిర్వహిస్తున్నా... మంచి రాబడి ఉండి ఉత్తర కాశీగా వెలుగొందుతున్న ఈ క్షేత్రాన్ని దత్తత ఇవ్వటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దత్తత అంశంపై పాలకులు, అధికారులు పునరాలోచన చేయాలని భక్తులు కోరుతున్నారు.

యాక్షన్ హెల్మెట్

- నగరంలో విస్తృతంగా తనిఖీలు
- ట్రాఫిక్ పోలీసులపై హైకోర్టు ఎఫెక్ట్
- ఒక్కరోజులో 150 మందికి చలానా



నగరంలో వాహనాలకు చలానాలు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఇన్‌సెట్‌లో) రామవరప్పాడు వద్ద డ్రోన్‌తో పోలీసుల నిఘా

హెల్మెట్ ధారణకు సంబంధించి హైకోర్టు కొద్దిరోజుల క్రితం చేసిన వ్యాఖ్యల ప్రభావం ట్రాఫిక్ పోలీసులపై పడింది. ఓ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్ ఇంకా విచారణలో ఉంది. విచారణ సందర్భంగా కోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. ఈ ప్రభావంతో పోలీసులు జూలు విదల్చడం మొదలుపెట్టారు. నగరం మొత్తం శుక్రవారం విస్తృతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించారు. వివిధ కూడళ్లు, ప్రధాన రహదారుల పక్కన తనిఖీలు చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి జరిమానాలు విధించారు. ఒక్కరోజులో మొత్తం 150 మంది వాహనదారులకు రూ.61,020 చలానాలు విధించారు. జరిమానా చెల్లించిన వాహనాలనే విడుదల చేశారు. చెల్లించని వారి వాహనాలను సీజ్ చేశారు. ఈ-చలాన్ చెల్లించినట్టుగా రశీదును తీసుకొచ్చిన తర్వాత వాహనాలను ఇచ్చారు. ఈ-చలాన్‌ను 90 రోజుల్లో చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి

రైలు టికెట్‌తో దోపిడీకి స్కెచ్

- పోలీసు అవతారమెత్తిన నిందితులు
- 'ప్రభాస్' వద్ద దోపిడీ కేసును ఛేదించిన సీసీఎస్
- నలుగురు అరెస్టు.. రూ.25.27 లక్షల రికవరీ

8లో



భక్తితో అడుగులు..

- నేటి నుంచి భవానీ దీక్షల విరమణ
- 25వ తేదీతో ముగింపు
- విద్యుత్‌కాంతుల్లో ఇంద్రకీలాద్రి
- 5-6లక్షల మంది భవానీలు వస్తారని అంచనా
- అంతరాలయ దర్శనం రద్దు
- అందరికి ఉచిత దర్శనం
- నేడు ఉదయం 6.30 గంటలకు తొలిదర్శనం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇంద్రకీలాద్రి ఎరుపెక్కనుంది. విజయవాడలో సందడి వాతావరణం కొలువుదీరనుంది. ఊరు వాడా జై భవానీ నినాదాలు వినిపించనున్నాయి. మండల, అర్థమండల దీక్షలు తీసుకున్న అమ్మవారి భక్తులు శనివారం నుంచి విరమించనున్నారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఈనెల 25వ తేదీ వరకు జరుగుతుంది. దీనికి సంబంధించి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి ఏడాది ఇంద్రకీలాద్రి దసరా శరన్నవరాత్రుల్లో భక్తులు లక్షల్లో వస్తారు. ఆ తర్వాత తిరిగి భవానీ దీక్షల విరమణకు వస్తారు. దీక్షా కాలాన్ని పూర్తి చేసుకుని ఇరుముడులు కట్టుకుని ఒక్కో అడుగు వేసుకుంటూ భవానీ అమ్మవారి సన్నిధికి చేరుకుంటారు. భవానీదీక్షల విరమణ సందర్భంగా ఇంద్రకీలాద్రిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భవానీలు ఇరుముడులను దించుకున్న తర్వాత హోమగుండంలో వేస్తారు. ఇందుకోసం కనకదుర్గ నగర్‌లో మహామండపం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మూడు హోమ గుండాలను ఏర్పాటు చేశారు. భవానీ దీక్షల విరమణ పూర్తయ్యే వరకు లిఫ్టులను పూర్తిగా నిలుపుదల చేస్తారు. దసరా మాదిరిగానే క్యూలైన్లు వినాయకుడి ఆలయం నుంచి ప్రారంభమవుతాయి. భక్తులందరికి ఈ నాలుగు రోజులు ఉచిత దర్శనం కల్పిస్తున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. భవానీ దీక్షల విరమణ పూర్తయ్యే వరకు అంతరాలయం దర్శనం రద్దు చేశారు. అదేవిధంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు.

తొలి దర్శనం 6.30 గంటలకు

సాధారణ రోజుల్లో తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించేవారు. శనివారం భక్తులకు ఉదయం 6.30గంటలకు తొలి దర్శనం కల్పిస్తారు. ఆ సమయం నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఆ మర్నాడు నుంచి మాత్రం తెల్లవారుజామున మూడు గంటల నుంచి దర్శనానికి భక్తులను పంపుతారు. రాత్రి 11 గంటల వరకు దర్శనం సౌకర్యం కల్పిస్తారు. భవానీ దీక్షలకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిసా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అంచనా వేశారు. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే భవానీలు ఎక్కువగా కాలినడక వస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భవానీలు ముందుగా గిరిప్రదక్షిణ చేస్తారు. తర్వాత అమ్మవారిని దర్శించుకుంటారు. దర్శనం అనంతరం మహామండపం కింద గురుభవానీలతో ఇరుముడులను దింపుకుంటారు. హోమగుండాల్లో పదార్థాలను వేసిన తర్వాత మొక్కుబడులను తీర్చుకుంటారు. తర్వాత స్నానాలు ఆచరించి సొంత ప్రాంతాలకు వెళతారు. ఎక్కువ మంది భవానీలు రాత్రికి విజయవాడకు చేరుకునేలా ప్రణాళికలు చేసుకున్నారు. రాత్రికి గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుని వేకువజామున అమ్మవారి దర్శనం చేసకుంటారు. ఏపీ జిల్లా నుంచి ఎంతమంది భక్తులు వస్తారన్న లెక్కలను పోలీసులు రప్పించుకున్నారు. ఇంద్రకీలాద్రి నుంచి దిగువ ప్రాంతాల నుంచి మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిశీలిస్తారు.



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

భవానీ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయండి

» దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

వన్‌టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ దుర్గగుడి అధికారులను ఆదేశించారు. దుర్గగుడిలో దీక్షల విరమణ ఏర్పాట్లను శుక్రవారం ఆయన ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కనకదుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన హోమగుండాలు, అన్నవితరణ ఏర్పాట్లు, ప్రసాదాల కౌంటర్లు, కేశఖండనశాల, ఘాట్లలో షవర్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇరుముడి స్టాండ్‌లు, పూజాసామాగ్రి విక్రయించే స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భవానీ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వసతులు, ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో దీక్షా విరమణలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

విరమణల విజయవంతానికి డిజిటల్ సేవలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవానీ దీక్షా విరమణలకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అదేవిధంగా ప్రభుత్వ ఏర్పాట్లలో అంతరాయం లేని డిజిటల్ సేవలు అందించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెలికం నెట్‌వర్క్-ఇంటర్నెట్ సేవల ప్రొవైడర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి 25వ తేదీ వరకు దుర్గామల్లేశ్వర దేవస్థానం అధ్వర్యంలో జరగనున్న భవానీ దీక్షా విరమణల కార్యక్రమానికి పటిష్ట కమ్యూనికేషన్ ప్రణాళికను అమలు చేస్తున్నామని, డిజిటల్ సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా టెలికం సంస్థలు కీలక భాగస్వాములు కావాలని సూచించారు. మరింత మెరుగ్గా భక్తులకు సేవలందించేందుకు డ్రోన్లు, యాప్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ తదితరాలు పూర్తిస్థాయి ఫలితాలు ఇవ్వాలంటే సమర్థవంతమైన నెట్‌వర్క్ సేవలు అవసరమన్నారు. టెలికం నెట్‌వర్క్ ప్రొవైడర్లు ఆయా ప్రాంతాల్లో టవర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, ఏపీఎస్ఎఫ్ఎల్, బీఎస్ఎన్ఎల్, రిలయన్స్ జియో తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల జాడ కనిపెట్టే యాప్

ఉత్సవాలలో తప్పిపోయిన చిన్నారుల సమాచారాన్ని తల్లిదండ్రులకు సత్వరం తెలియజెప్పేందుకు వీలుగా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో దుర్గామల్లేశ్వర దేవస్థానం చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. భవానీ దీక్షల విరమణల సమయంలో తప్పిపోయిన చిన్నారుల జాడను తెలుసుకొనేందుకు సీఎంఎస్ యాప్‌ను ఉపయోగించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా చిన్నారుల వివరాలను నమోదు చేసి, చేతికి క్యూ ఆర్ బ్యాండ్ వేస్తారు. పిల్లలు తప్పిపోయిన సందర్భంలో భద్రత, ఉత్సవాల సిబ్బంది లేదా ఎవరైనా సరే ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పిల్లల సమాచారం, తల్లిదండ్రుల వివరాలతో వారిని సంప్రదించడానికి ఆప్షన్లు చూపిస్తుంది. దీంతో చిన్నారులను వారి కుటుంబసభ్యుల చెంతకు చేర్చొచ్చని కలెక్టర్ వివరించారు. ఆన్‌లైన్ వ్యవస్థపై ప్రజలు కూడా అవగాహన పెంపొందించుకోవాలని, ఎక్కడైనా తప్పిపోయిన చిన్నారులు కనిపిస్తే వెంటనే క్యూఆర్ బ్యాండ్‌ను స్కాన్‌చేసి సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేయాలని కలెక్టర్ కోరారు.

సెక్టార్లవారీ బందోబస్తు

'భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులకు సత్వరం దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. శరన్నవరాత్రుల్లో చివరిరోజు ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బందోబస్తు పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. భవానీల కోసం దేవదాయ శాఖ ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. శరన్నవరాత్రుల మాదిరిగానే భవానీ దీక్షలకు సెక్టార్లవారీగా బందోబస్తు నిర్వహిస్తున్నాం' అని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వివరించారు. శనివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం ప్రత్యేకంగా మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతి-విజయవాడ)

? ఎంతమందిని బందోబస్తుకు ఉపయోగిస్తున్నారు.

సీపీ : భవానీ దీక్షల విరమణకు మొత్తం 4,600 మందితో బందోబస్తును ఏర్పాటు చేశాం. శరన్నవరాత్రులకు ఏవిధంగా ఏర్పాట్లు చేశామో ఆ తరహాలోనే ఇప్పుడూ ఏర్పాట్లు చేశాం. కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బంది కాకుండా ఇతర జిల్లాల నుంచి బలగాలను బందోబస్తు విధులకు రప్పిస్తున్నాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పదిమంది ఎస్పీలు, 40 మంది డీఎస్పీలు, 96 మంది ఇన్‌స్పెక్టర్లు, 230 మంది ఎస్ఐలు వచ్చారు. వారు కాకుండా ఏపీఎస్పీ నుంచి ఎనిమిది ప్లటూన్లు, 15 రోప్ పార్టీలు బందోబస్తు విధుల్లో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. బందోబస్తులో సెక్టార్ల విధానం అమలు చేస్తున్నాం. ఇంద్రకీలాద్రి పైనుంచి దిగువ వరకు శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాలకు సంబంధించి మొత్తం 45 సెక్టార్లను ఏర్పాటు చేశాం. అన్ని సెక్టార్లకు అధికారులతో పాటు సిబ్బంది ఉంటారు. ప్రధాన శాఖలైన దేవదాయ, పోలీసు, రెవెన్యూ, వీఎంసీల నుంచి అధికారులు, సిబ్బంది విధినిర్వహణలో ఉంటారు. రెండు షిఫ్టుల్లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ప్రధాన ఆలయం చుట్టూ నాలుగు సెక్టార్లు ఉంటాయి. ఈ సెక్టార్లలో విధులు నిర్వర్తించే సిబ్బందిని డ్యూటీ సమయం కంటే ముందు ఫాలిన్ కావాల్సి ఉంటుంది. ఈ సెక్టార్లలో విధులు నిర్వర్తించే వారికి వేర్వేరు రంగులు ఉన్న గుర్తింపు కార్డులను ఇస్తాం.

? సెక్టార్లు ఎక్కడెక్కడ గుర్తించారు.

సీపీ : మహామండపం, అంతరాలయం, రావి చెట్టు, మహామండపం మెట్లు, శివాలయం వైపు, ఆలయం ప్రాకారం చుట్టుపక్కల ప్రదేశాలను సెక్టార్లుగా విభజించాం. ఇవికాకుండా మౌనమహాముని విగ్రహం, ఓం మలుపు ప్రాంతాలను గుర్తించాం. భవానీ దీక్షల విరమణకు వచ్చే భవానీలు గిరిప్రదక్షిణ కచ్చితంగా చేస్తారు. గిరిప్రదక్షిణ జరిగే ప్రదేశాల్లోనూ సెక్టార్లు ఏర్పాటు చేశాం.

? ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.



సీపీ : నగరంలో ప్రస్తుతం 1,900 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇంద్రకీలాద్రిపై మొత్తం 200 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇవికాకుండా మరికొన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఈ కెమెరాలన్నీ అధికారుల చాంబర్‌లో ఉన్న సర్వర్‌తో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయి. ఇవికాకుండా 20 డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు కమిషనరేట్‌లో ఐదు డ్రోన్లు ఉన్నాయి. ఇతర జిల్లాల నుంచి మరికొన్ని డ్రోన్లను రప్పిస్తున్నాం. అంతేకాకుండా కమిషనరేట్ పరిధిలో కొత్తగా క్లౌడ్ పెట్రోలింగ్‌ను ప్రవేశపెడుతున్నాం. భవానీ దీక్షల విరమణ పూర్తయ్యే వరకు ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఉంటుంది. దసర శరన్నవరాత్రుల్లో చివరి రోజున ఊహించని స్థాయిలో భక్తులు వచ్చారు. ఆ సమయంలో మేం ఉపయోగించిన డ్రోన్లు చాలా ఉపయోగపడ్డాయి. అప్పటికప్పుడు భక్తులను నియంత్రించడానికి హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకున్నాం. ఈసారి భవానీ దీక్షల విరమణ బందోబస్తులో డ్రోన్ టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగిస్తున్నాం.

? ఎంతమంది భవానీలు వస్తారని అంచనా.

సీపీ : రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల నుంచి మొత్తం 5 లక్షల నుంచి 6 లక్షల మంది భవానీలు వస్తారని అంచనా వేశాం. దీక్షల విరమణ పూర్తయ్యే వరకు వచ్చిన భక్తులందరికీ సర్వదర్శనం ఉంటుంది. అంతరాలయం దర్శనాలు ఐదు రోజుల పాటు నిలుపుదల చేస్తాం.

? కనకదుర్గానగర్‌లో పరిస్థితి ఏంటి.

సీపీ : కనకదుర్గానగర్‌లో ఈ ఏడాది కొంచెం ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ప్రతి ఏడాది అమ్మవారిని దర్శించుకున్న భక్తులు శివాలయం వైపున ఉన్న మెట్లమార్గం నుంచి కిందకు దిగేవారు. ఈసారి అక్కడ అన్నదానం కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. మహామండపానికి పక్కన పోటు భవనం నిర్మిస్తున్నారు. కనకదుర్గానగర్‌లో ఈ ఏడాది నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శివాలయం వైపున ఉన్న మెట్లు కొంతవరకు తొలగించారు. దర్శనానంతరం భక్తులు కిందకు వచ్చేందుకు దీనికి పక్క నుంచి 12 అడుగుల వెడల్పుతో తాత్కాలిక మెట్లను శరన్నవరాత్రుల్లో ఏర్పాటు చేశాం. దర్శనమైన భక్తులు బయటకు వచ్చేందుకు మార్గాలను రద్దీని బట్టి పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రస్తుతం పోటు భవనం నిర్మిస్తున్న ప్రదేశంలో హోమగుండాలు ఏర్పాటు చేశారు. అక్కడ బందోబస్తు పటిష్టంగా ఉంటుంది.

పీఎం సూర్య ఘర్‌లో అంగన్వాడీ కేంద్రాలను చేర్చాలి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణప్రాంతాల్లో చిన్నారులకు ప్రాథమిక సౌకర్యాలు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలకమైన అంగన్వాడీ కేంద్రాలను 'పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజ్లీ యోజన' పథకంలో చేర్చాలనే అంశాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం లోక్‌సభలో ప్రస్తావించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రూ.75,021 కోట్ల నిధులు కేటాయించి ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి అమల్లోకి తీసుకువచ్చేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే 2025 నాటికి ప్రభుత్వ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 55,907 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, వాటిల్లో 8,455 కేంద్రాల్లో ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదన్నారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయాల వల్ల అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. దీని ప్రభావం చిన్నారుల హాజరుపై పడటంతో పాటు, వారికి సంరక్షణ సరిగా అందటం లేదని పేర్కొన్నారు. ఈ పథకం కింద అంగన్వాడీ కేంద్రాలను తీసుకువస్తే నిరంతరం సౌర విద్యుత్ అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వానికి విద్యుత్ బిల్లుల వ్యయం తగ్గటంతో పాటు దీర్ఘకాలిక ఆర్థిక, ఇంధన, సుస్థిరతను సాధించవచ్చన్నారు. పిల్లలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

రోగులకు అత్యాధునిక వైద్య సేవలు

» డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఇండో బ్రిటీష్ హాస్పిటల్స్‌లో రోగులకు అత్యాధునిక వైద్య సేవలందిస్తున్నామని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 24 గంటలూ రోగి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు క్లౌడ్ డాక్స్ రమేష్ టెలి ఐసీయూ వ్యవస్థ ద్వారా సెంట్రల్ కమాండ్ సెంటర్ నుంచి ప్రతీక్షణం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. 2008 నుంచి 2020 మధ్య ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 20వేల గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు చెప్పారు. గత రెండేళ్లలో ఇండో బ్రిటీష్ ఆసుపత్రిలో వెయ్యి గుండె చికిత్సలు 99 శాతం సక్సెస్ రేటుతో రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర సరిహద్దు తెలంగాణ జిల్లాల రోగులకు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. యాంజియోప్లాస్టి చికిత్సలో మెడికేటెడ్ స్టెంట్లు, కార్డియో ఎలక్ట్రో ఫిజియాలజిస్టు ఆధ్వర్యంలో రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, పేస్ మేకర్ వంటి చికిత్సలే కాకుండా చిన్నపిల్లల గుండె రంధ్రాల వ్యాధులకు డివైజ్ చికిత్సలు, చిన్నపిల్లల గుండె శస్త్ర చికిత్సా నైపుణులచే టెట్రాలజీ ఆఫ్ ఫాలట్, సెఫ్టల్ డిఫెక్ట్‌కు శస్త్ర చికిత్సలు, బైపాస్, వాల్వ్ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామన్నారు. ఒడిసా రాష్ట్ర ఆరోగ్య పథకం బిజూ స్వాస్థ్య కల్యాణ యోజనలో 40 మంది చిన్న పిల్లలకు విజయవంతంగా వైద్యం అందించినట్టు చెప్పారు. సమావేశంలో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రాజా రమేష్, డాక్టర్ అనూప్, డాక్టర్ షహనాజ్, చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ కత్తుల అనూష, శివప్రసాద్, శ్రీకాంత్, మహాపాత్ర, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ ఛాయ, ధరణీంద్ర, మమత రాయపాటి, నాదెళ్ల గిరిబాబు, డాక్టర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధ నిబంధనలు ఎత్తివేయాలి

» ఉపాధ్యాయుని మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి : యూటీఎఫ్



ఉపాధ్యాయుడి మృతిని నిరసిస్తూ యూటీఎఫ్ నిరసన

గవర్నర్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఏఎంపీ పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిబంధనలు కారణంగా చిత్తూరుజిల్లా తలపులపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల బయాలజీ టీచర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, తక్షణమే అసంబద్ధ, అనాలోచిత నిర్ణయాలు ఎత్తివేయాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. సెల్ఫ్ అసెస్మెంట్-1 పరీక్ష పేపర్లు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గంట ముందు మండల కేంద్రాలలోని పోలీసు స్టేషన్లకు వెళ్లి తెచ్చుకోవాలన్న అధికారుల నిబంధనతో తలపులపల్లి పాఠశాల టీచర్ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఎంజీ రోడ్డులో టీచర్లు ఆందోళన చేపట్టారు. అధికారులు విధించిన అసంబద్ధ నిర్ణయాలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, టీచర్ సిద్ధయ్యశెట్టి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుని కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రత్యేక ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అధికారులు ప్రతిరోజు పోలీసు స్టేషన్‌కు వెళ్లి పేపర్లు తీసుకురావాలనే నిబంధన పెట్టడం వల్లే ఉపాధ్యాయులు 20కి.మీ దూరంలోని మండల కేంద్రాలకు వెళ్లిరావడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని, ఈ కారణంగానే సిద్ధయ్య శెట్టి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులే స్కూల్స్‌కు పేపర్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కెఏస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు బోధన చేసుకునే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మమేకమై..

(5వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. అనంతరం గంగూరులోని వెంకటాద్రి రైస్‌మిల్‌ను సీఎం పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మిల్లులో తేమశాతం లెక్కింపు పరికరాన్ని తనిఖీ చేశారు. నమోదవుతున్న పాయింట్లకు, రైస్‌మిల్లులో నమోదవుతున్న తేమశాతానికి తేడాలు వస్తున్నాయనే అంశంపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. వేబ్రిడ్జి వద్ద కాటా వేసే విధానం, ఎఫ్టీవో జనరేట్ చేయటం, మిల్లుకు ఎంత ధాన్యం వచ్చింది, నగదు చెల్లింపు ఎంత.. తదితర వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్యాకింగ్ చేసే విధానాన్ని కూడా పరిశీలించారు.

ఈడుపుగల్లులోని స్థలాలను 22ఏ నుంచి తొలగిస్తాం

ఈడుపుగల్లు పంచాయతీలోని బీసీ కాలనీలో 176 మందికి ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, వీటిని 22ఏలో చేర్చి ప్రభుత్వ భూమి అని చెబుతున్నారని, ఈ స్థలాలను కచ్చితంగా 22ఏ జాబితా నుంచి తొలగించి చట్టపరంగా పట్టాలు అందజేస్తామని సీఎం తెలిపారు. వీరమాచనేని జేబీసరోజినీ, పర్వతనేని శ్రీకృష్ణ జగన్మోహనరావు, యార్లగడ్డ మాధురి తదితరులు తమ భూములకు సంబంధించి రీ సర్వే జరిగిన సమయంలో భూమి తక్కువగా చూపారని, వాటిని సరిచేయాలని అర్జీలు అందజేశారని, ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి వీరపాండియన్, కమిషనర్ జిలానీ, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, డీఎస్‌వో పార్వతి, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పౌరసరఫరాలశాఖ డీఎం పద్మాదేవి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పిన్నమనేని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెనమలూరు నియోజకవర్గ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లురవీంద్ర, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, వైవీబీ రాజేంద్రప్రసాద్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, వేదవ్యాస్ తదితరులు

మీడియాతో చిట్‌చాట్..

గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాటుచేసిన బసలో సీఎం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఈ ఏడాది ఐదు కోట్ల సంచులు సమకూర్చాల్సి ఉందని, కానీ 3.83 కోట్ల సంచులే అధికారులు సమకూర్చారని, దీంతో సంచుల కొరత ఏర్పడినట్టు తాను గ్రహించానన్నారు. ధాన్యం రవాణాలో జీపీఎస్ పద్ధతిని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 394 డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులు మాత్రమే ఉన్నాయని, దీంతో యంత్రాలతో కోసిన ధాన్యం ఒకేసారి మిల్లులకు వస్తే సామర్థ్యం చాలక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హార్వెస్టర్‌తో రైతులు అధికంగా వరికోతలు కోస్తున్నారని, కోత సమయంలోనే ధాన్యంలో తేమ శాతం తగ్గించేలా నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందో లేదో పరిశీలిస్తామన్నారు. మొబైల్ డ్రయ్యర్లను అందుబాటులోకి తెచ్చి ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు ప్రయత్నిస్తామన్నారు. 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనట్లేదని, గత ఏడాది కృష్ణాజిల్లాలో 3,800 హెక్టార్లలో ఈ రకం సాగుచేస్తే ఈ ఏడాది 31,862 హెక్టార్లలో సాగు చేశారని, ఈ రకం వరి వంగడాలను సాగుచేసే అంశంపై రైతులు పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్‌ల ద్వారా వరిలో పురుగు మందుల పిచికారీని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు.

పట్టిసీమ ద్వారా ముందే సాగునీరందిస్తాం

వాతావరణ పరిస్థితులు, సాగుకు అనుకూలమైన కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్‌లో ముందే వరినాట్లు వేసేందుకు పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణాడెల్టాకు సాగునీటిని అందిస్తామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. తుపాన్లు, భారీవర్షాలు సంభవించినప్పుడు వరి నేలవాలుతోందని, దీంతో దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ఇక నుంచి వరి పైరుకు తెగులు సోకితే సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తే ఏ రకం పురుగుమందు వాడాలో తెలిపే సాంకేతిక పరిజ్ఞానం వచ్చిందన్నారు.



కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

కనకదుర్గమ్మ సేవలో అశోక్ గజపతిరాజు

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు శుక్రవారం దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీస్సులు.. ఈవో కేఎస్ రామారావు, అర్చకులు అమ్మవారం చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

బస్‌స్టేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ఆర్టీసీ హౌస్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) జి.వి.రవివర్మ ఆధ్వర్యంలో సంస్థ ఫైనాన్షియల్ అడ్వయిజర్ ఎన్.సుధాకర్‌రావు పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు చర్చించారు. ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ పొందడానికి నిబంధనల ప్రకారం వేతన వివరాలు పంపించకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు నష్టపోతున్నారని అధికారుల దృష్టికి అసోసియేషన్ నాయకులు తీసుకెళ్లారు. ఏపీఎస్ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్ ఐడీని టీఎస్ఆర్టీసీకి కేటాయించారని, భవిష్యత్తులో ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు నష్టపోతారని యూనియన్ నాయకులు వివరించారు. చర్చలు అసంపూర్తిగా ముగిసినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైశ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఆర్.సుబ్బారావు, ఎస్.రాజేష్‌కుమార్, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎ.రామారావు, కేంద్ర కార్యాలయం కార్యదర్శి ఎన్.వి.కుమార్, ఆర్టీసీ అధికారులు అరుణ, జయశంకర్‌ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సెక్షన్ పరిధిలో జూబ్లీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ గిరిపురం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 12.30 వరకు మధుగార్డెన్ ఏరియా, విగ్నేష్ హాస్పిటల్ ఏరియా, శిఖామణి ఏరియా, బ్లోసం హాస్పటల్ ఏరియా, నెహ్రూనగర్, అంబేద్కర్ వీధి, రామశాస్త్రి వీధి, ప్రజాశక్తినగర్, గిరిపురం, గాస్పెల్ హాల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.60 లక్షలు...ముగ్గురు కాంట్రాక్టర్లు

● అసంపూర్తిగా శాంపిల్ బిల్డింగ్ మరమ్మతులు ● పనుల్లో కొరవడిన నాణ్యత ● నిజాలు నిగ్గు తేల్చాలని స్థానికులు, టీడీపీ నేతల డిమాండ్

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

పేదలు వాడుకునే ఫంక్షన్ హాలే కదా ఎలా చేసినా అడిగేవారుండరు, ఏం చేసినా ప్రశ్నించే వారు అసలుండరు అనే నమ్మకంతో ముగ్గురు కాంట్రాక్టర్లు, రూ.60లక్షలు వ్యయంతో పనులు చేసినా ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ విషయమై నిజాలు నిగ్గు తేల్చాలని స్థానికులు, టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

రాణిగారితోట 17వ డివిజన్‌లో పేదల అవసరాల కోసం ఈ ప్రాంతం ఏర్పడినప్పుడు అప్పటి పాలకులు శాంపిల్ బిల్డింగ్‌ను నిర్మించారు. దీనిని స్థానికంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలు ఫంక్షన్ల కోసం ఉపయోగిస్తున్నారు. అయితే మరమ్మతుల పేరిట గత వైసీపీ ప్రభుత్వంలో రూ.60లక్షల వ్యయంతో ఈ శాంపిల్ బిల్డింగ్ అభివృద్ధి పరిచారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ భవనం చుట్టూ ప్రహరీ ఒక కాంట్రాక్టర్, భవనం అభివృద్ధి ఒక కాంట్రాక్టర్, బయట షెడ్డు మరొక కాంట్రాక్టర్ దాదాపు రూ.60లక్షల వ్యయంతో పను లు చేశారు. ఈ పనులు కూడా నత్తనడకన చేశారు, ఇంత ఖర్చు చేసినా పనుల్లో ఎక్కడా నాణ్యత కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఇంత ఖర్చు చేసిన ఈ భవనం చుట్టూ మెరక పోసి అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఈ ముగ్గురు కాంట్రాక్టర్లు తమ పనుల్లో ఇది భాగం కాదని తప్పించుకున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు చేయాలంటే మరో రూ.12లక్షల వరకు నిధులు అవసరమంటున్నారని, ఇన్ని లక్షలతో ఒక ఖరీదైన మరో కొత్త భవనం నిర్మించవచ్చని స్థానికుల అభిప్రాయ పడుతున్నారు. ఈ భవనంలోకి అడుగు పెట్టగానే అధ్వానంగా ఉన్న పరిసరాలు కనిపిస్తాయి. ముందు భాగంలో లేచిన రాళ్లు, దక్షిణం వైపు పిచ్చి మొక్కలు, పడమర వైపు అధ్వానంగా వంట చేసే ప్రాంతం, తాగునీటి మోటారు వద్ద అపరిశుభ్ర వాతావరణం ఇలా అనేక సమస్యలు కనిపిస్తాయి. ఇంత ఖర్చు చేసినా ఇంకా పనులు ఉండటం, నాణ్యత లేకపోవడం ఏంటని స్థానికులు, టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.


భవనం ముందు భాగం రాళ్లమయం


అధ్వానంగా వంట స్థలం, దక్షిణం వైపు పిచ్చి మొక్కలు

వంటశాల ఎక్కడ

ఇన్ని లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన ఈ భవనంలో కార్యక్రమాలు చేసుకునే వారు వంట చేసే అవకాశం లేకపోవడం శోచనీయం. భవనం వెనుక ఉన్న స్థలం అభివృద్ధి చేస్తే అక్కడ వంట చేయొచ్చు. అయితే ఆ విధంగా కూడా చర్యలు శూన్యం. భవనం సముదాయంలో వాడిన నీరు, వర్షం వస్తే ఆ నీరు గాని బయటకు పోయేందుకు మార్గం లేకపోవడం పనుల చేసిన వారి పనితనానికి, కాసుల కక్కుర్తికి నిదర్శనం అని స్థానికులు విమర్శిస్తున్నారు.



వైసీపీ పాలకుల నిర్వాకమే

రూ.60లక్షలు ఖర్చు చేసినా ఇంకా పనుల ఉండటం, చేసినవి కూడా అధ్వానంగా ఉండటం వైసీపీ పాలకుల నిర్వాకమే. స్థానిక కార్పొరేటర్ ఈ పనులపై బాధ్యత వహించాలి. ఇన్ని లక్షలు ఏ విధంగా ఖర్చు చేశారు. ఇంకా పనుల ఎందుకు ఉన్నాయో ప్రభుత్వం నిజాలు నిగ్గు తేల్చాలి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసువెళ్లి విచారణ చేసి ప్రజలకు నిజాలు చెప్పాలని, మిగిలి ఉన్న పనులు పూర్తి చేయాలని కోరతాం.

- రాయి రంగమ్మ(టీడీపీ డివిజన్ అధ్యక్షురాలు)

పాఠ్య పుస్తకాల పరిధి దాటి చదవండి

ఆదిత్య యూనివర్సిటీ ప్రోవైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ సూచన


జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ ఎస్.రమాశ్రీ, డైరెక్టర్ చింతా అనిల్‌కుమార్ తదితరులు

మొగల్రాజపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచి ఉద్యోగం సాధించాలన్నా, మంచి పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నా విద్యార్థులు పాఠ్య పుస్తకాలు, వాటి పరిధి దాటి వివిధ అంశాలను తెలుసుకోవాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రోవైస్ చాన్సలర్, సూరంపాలెం డాక్టర్ ఎస్.రమాశ్రీ సూచించారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో పీజీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో విభవ 2024 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సర్టిఫికెట్ కోర్సులు చేయాలని, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాజమండ్రికి చెందిన అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నొవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, డైరెక్టర్ చింతా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఓటమి విజయానికి మొదటి మెట్టుగా భావించి ముందుకు వెళ్లిన వాళ్లే విజేతలుగా నిలుస్తారని చెప్పారు. పిక్సిటీ ఎడ్‌ఎస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి. సాయి రాహుల్ వర్మ, కళాశాల డీన్ రాజేష్ జంపాల మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన పీజీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, కోడింగ్ డీకోడింగ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, మిస్టర్ అండ్ మిస్ విభవ, ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టిఎస్ రవి కిరణ్, విభవ కన్వీనర్ బి. రోజ్ ప్రిసిల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల్లో చైతన్యం రావాలి

ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ కడప, విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్ హిమబిందు

మొగల్రాజపురం,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో ప్రతి వస్తువులోనూ ఏదో ఒక విధంగా కల్తీ జరుగుతోందని, వినియోగదారులను మోసం చేస్తున్నారని అలా మోసపోకుండా ఉండాలంటే వినియోగదారుల్లో చైతన్యం రావాలని ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ కడప, విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్ వి. హిమబిందు పిలుపునిచ్చారు. శుక్రవారం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో వినియోగదారులుగా మహిళలు- రక్షణ అనే అంశంపై అవగాహనా కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలను తెలుసుకుంటే మోసోయినపుడు ఎలా ఎదుర్కోవాలో, రక్షణ ఎలా పొందాలో, పరిహారం ఎలా పొందాలో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తరుణీ తరంగాలు ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎన్. విద్యాఖన్నా మాట్లాడుతూ కొన్న వస్తువులో కాని, పొందిన సేవలో కాని లోపాలు ఉంటే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలని చాలా మందికి తెలియదన్నారు.ఈ కార్యక్రమంలో తరుణీ తరంగాలు సభ్యులు, జనశిక్షణా సంస్థాన్ సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హిమబిందు, వేదికపై విద్యాఖన్నా తదితరులు


సదస్సులో జాయింట్ కంట్రోలర్ సుధాకర్, డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్య, తదితరులు

భారతీనగర్: ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని కన్స్యూమర్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.నవీన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంగ్ల విభాగపు ఇన్‌చార్జి రోస్‌లైన్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో ఏలూరుకు చెందిన తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్ మాట్లాడుతూ ప్యాకేజీలపైన అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని, వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఎ.కృష్ణచైతన్య మాట్లాడుతూ వివిధ రకాల కొలతలు, తూనికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగపు ఇన్‌చార్జి సిహెచ్ కొండలరావు, అధ్యాపకులు డాక్టర్ కే.శ్యాంబాబు, డాక్టర్ బ్రహ్మయ్య, లక్ష్మీభారతి, కీర్తన, ఝాన్సీరాణి, రజియా సుల్తానా, శైలజ, రూప, స్నేహలత, పార్వతి, ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదేళ్ల జైలు

విజయవాడలీగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, రూ. 15 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఫిర్యాది నున్న పోలీసు స్టేషన్ పరిధిలోని పాయకాపురంలో తన కుటుంబంతో కలిసి జీవి స్తోంది. ఫిర్యాది కుమార్తె 6వ తరగతి చదువు తోంది. పాఠశాల యాజమాన్యం జోజినగర్‌కు చెందిన భానుచంద్ర అనే వ్యక్తి ద్వారా పిల్లలకు రైటింగ్ శిక్షణ ఇప్పించేవారు. ఆ శిక్షణకు ఫిర్యాది కుమార్తె వెళ్తుండేది. 2016 నవంబరు 3న రైటింగ్‌లో పరీక్ష నిర్వహించారు. ఆ సమయంలో భానుచంద్ర సదరు బాలికను రెండో ఫ్లోర్‌లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలిక తల్లికి చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏడుగురు సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ, జరిమానాలో రూ.10 వేలతో పాటు రూ.50 వేలను బాలికకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని ఆదేశించారు.

మోడరన్ సూపర్ మార్కెట్‌లో వార్షికోత్సవ ఆఫర్లు

లబ్బీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఎన్నో సూపర్ మార్కెట్ లు వస్తూ ఉంటాయని అయితే చిరకాలంగా కస్టమర్ల అభిమానం చూరగొని నిలబడ్డ ఏకైక మార్కెట్ మోడరన్ సూపర్ మార్కెట్ అని ఎండీ ఫయాజ్ తెలిపారు. బెంజిసర్కిల్ సమీపంలో ఉన్న గ్రాండ్ మోడరన్ సూపర్ మార్కెట్ 24వ వార్షికోత్సవం సందర్భంగా రూ. 500 కొనుగోలుపై రూ.25 నుంచి రూ.5000 విలువగల బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం శుక్రవారం ప్రారంభమైందని ఈ నెల 23 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సూపర్ మార్కెట్ రంగంలో 29 ఏళ్లుగా ఉన్నామని, క్వాలిటీలో అగ్రగామిగా ఉంటూ వినియోగదారులకు సేవలందించడంలో అందరికన్నా ముందున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా అన్ని రకాల ప్రొడక్ట్‌లు, బేకరి ఐటమ్స్ అందుబాటులో ఉంచామని తెలిపారు. అన్ని రకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్ ఇతర సరుకులపై డిస్కౌంట్ లభిస్తుందని, పై అంతస్తులో ఫుడ్‌కోర్ట్ కూడా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు.


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయండి

కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం బృందావన కాలనీ, ఆయుష్ హాస్పటల్ పరిసర ప్రాంతాలను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగర పరిధిలోని ఖాళీ స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, అందుకు అనుగుణంగా స్థలాలను గుర్తించి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులతోపాటు పిల్లలకు ఆహ్లాదాన్ని అందించేలా ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొకవల్, చీఫ్ సిటీప్లానర్, జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీప్లానర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

ప్రముఖ వైద్యుడు జి. సమరం


గోరా సైన్స్ హబ్ గురించి వివరిస్తున్న డాక్టర్ సమరం

పటమట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ దృష్టితో ఆలోచించినప్పుడే సమ సమాజం సాధ్యపడుతుందని ప్రముఖ వైద్యులు జి సమరం పేర్కొన్నారు. శనివారం పలువురు నాస్తిక కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష శోధనలు సాగిస్తున్న మనిషి ఆలోచనలు ఇంకా మూఢ నమ్మకాల్లో మునిగి ఉండటానికి దేవుడు, మత విశ్వాసాలు కారణం అని పేర్కొన్నారు. దేవుడు లేడని మనిషి శాసనకర్త అని శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడే మానవాభివృద్ధి పరుగులు తీస్తుందని ఆయన తెలిపారు. అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీలో సాధించిన, సాధిస్తోన్న అద్భుత ఆవిష్కరణల నమూనాలను ప్రదర్శించిన గోరా టెక్నో ఎగ్జిబిషన్, మహాత్మాగాంధీ జీవిత చరిత్ర చిత్రాలు, స్వాతంత్ర్య సమరాల సంక్షిప్త వివరాలతో కూడిన బాపు దర్శన్, ప్రముఖ నాస్తికులు గోరా చేపట్టిన అభ్యుదయ వివరాలు గల గోరా ఎగ్జిబిషన్‌ను అందరూ సందర్శించారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి, డాక్టర్ సాధిక, పలువురు సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.


కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న సభ్యులు

చిన్న పరిశ్రమలు ఎన్ఎస్ఐసీ రిజిస్ట్రేషన్‌కు అర్హులు

జేఆర్‌డీ టాటా ఐలా 18వ వార్షిక సమావేశం

ఆటోనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న పరిశ్రమలు ఎన్ఎస్ఐసీ రిజిస్ట్రేషన్‌కు అర్హులని, ప్రభుత్వ కొనుగోళ్లలో భాగస్వామ్యం కోసం సింగిల్ పాయింట్ రిజిస్ట్రేషన్ స్కీమ్ కింద్ ఎంఎస్ఈలు నమోదు చేసుకోవాలని ఎన్ఎస్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆర్.జే.ఎస్.వి రామారావు అన్నారు. శుక్రవారం జేఆర్‌డీ టాటా ఐలా ఆఫీసులో జేఆర్‌డీ టాటా ఐలా సర్వీస్ సొసైటీ 18వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రామారావు మాట్లాడుతూ ఎన్ఎస్ఐసీ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం తాడిగడప మున్సిపల్ అభివృద్ధి కోసం జేఆర్‌డీ టాటా ఐలా నిధుల నుంచి రూ.10,34,523ల చెక్కును మున్సిపల్ కమిషనర్ పి. భవానీప్రసాద్‌కు జేఆర్‌డీ టాటా ఐలా సర్వీస్ సొసైటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, జేఆర్‌డీ టాటా ఐలా కమిషనర్ డి.వి.ఎస్.ఎస్ జ్యోత్స్న, తాతినేని వినోద్ బాబు, సెక్రటరీ తాటిశెట్టి శ్రీనివాసరావు, సర్వీస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


సహన హౌస్ టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ముగిసిన నలంద క్రీడా వార్షికోత్సవం

గవర్నర్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నలంద విద్యానికేతన్ 27వ క్రీడా వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఏపీ గవర్నమెంట్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ అకడమిక్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు క్రీడాఅవార్డులు అందించారు. హౌస్‌ల వారీగా విజేతలైన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మొమెంటోలు ప్రదానం చేశారు. ఓవరాల్ విజేతగా సహన హౌస్ విద్యార్థులు నిలిచారు. విద్యార్థుల క్లాసికల్, వెస్ట్రన్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ, ఉపాధ్యాయులు,సిబ్బంది హాజరయ్యారు.

సాయి మేధాలో సెమీక్రిస్మస్ వేడుకలు

లబ్బీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గాయత్రీనగర్‌లోని సాయి మేధా కోచింగ్ సెంటర్‌లో శుక్రవారం సెమీక్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సంతానం పాల్గొన్ని క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పండుగల ఔన్నత్యాన్ని తెలిపే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ సెంటర్ సీఆర్డీయే కార్యాలయం వద్ద కంప్యాక్టర్ వాహనాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, కమిషనర్ ధ్యానచంద్ర

నగరంలో చెత్త తొలగింపునకు

కంప్యాక్టర్ వాహనం

- పనితీరు బాగుంటే అన్ని మునిసిపాలిటీల్లోనూ వినియోగం: మంత్రి పొంగూరు నారాయణ

చిట్టినగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతను మరింత మెరుగుపర్చేందుకు అత్యాధునిక టెక్నాలజీతో రూపొందిన కంప్యాక్టర్ వాహనాలు ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం లెనిన్ సెంటర్ సీఆర్డీయే కార్యాలయం వద్ద నగరంలో చెత్త తొలగింపునకు నూతన కంప్యాక్టర్ వాహనాన్ని కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ వాహనం వినియోగించి నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో 14 టన్నుల చెత్తను తరలించే ఈ వాహనాన్ని ప్రయోగాత్మకంగా వినియోగించి, వాహనం పనితీరుపై పూర్తి సమాచారం తెలుసుకున్నాక పనితీరు బాగుంటే రాష్ట్రంలోనే అన్ని మున్సిపాలిటీల్లో చెత్త తరలింపునకు వాహనాలు వినియోగిద్దామని అధికారులకు మంత్రి సూచించారు. చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్ సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇన్‌చార్జి వెహికల్ డిపో ఏసుపాదం పాల్గొన్నారు.



గ్రీవెన్స్ డేలో రైతుల సమస్యలు వింటున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

సమస్యల పరిష్కారంలో అలసత్వమొద్దు

- అధికారులకు సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం

కృష్ణలంక, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులు, రైతుకూలీలు గ్రీవెన్స్‌డేలో విన్నవించిన సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వద్దని, సత్వరమే పరిష్కరించాలని అధికారులను సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. సీఆర్డీయేలోని వివిధ విభాగాల అధికారులు సమస్యల్లో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, జి.రవీంద్ర, ఎ.జి.చిన్నికృష్ణ, పి.పద్మావతి, కె.ఎస్.భాగ్యరేఖ, బి.హుస్సేన్ సాహెబ్, కె.స్వర్ణమేరి, బి.సాయిశ్రీనివాస్‌నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి.రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



శబ్దబ్రహ్మ చిన్నయసూరి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వెలుదండ నిత్యానందరావు

సామాజిక వికాసానికి చిన్నయసూరి కృషి

గవర్నర్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నీతి చంద్రిక ద్వారా పరవస్తు చిన్నయసూరి సామాజిక వికాసానికి కృషి చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చిన్నయసూరి జయంతిని పురస్కరించుకుని పరవస్తు చిన్నయసూరి సాహితీపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శబ్దబ్రహ్మ చిన్నయసూరి గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు చిన్నయసూరి సాహితీపీఠం అధ్యక్షుడు టి.శోభనాద్రి అధ్యక్షత వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. తెలుగు పండిట్ కేశవమతం అనిల్‌కుమార్ సూరి గ్రంథ సమీక్ష నిర్వహించారు. గ్రంథ రచయితలు ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, చిన్నయసూరి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ శేషగిరిరావు, పోలవరపు కోటేశ్వరరావు, కళాపీఠం అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి

క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్నాచౌక్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమొక్రటిక్ అసోసియేషన్ రూపొందించిన 2025 క్యాలెండర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.జోసెఫ్ కిషోర్, అప్పికట్ల, ఉపాధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, కోశాధికారి టి.దుర్గాప్రసాద్, రాష్ట్ర ఉమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అనూష, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెనుగొండ లక్ష్మీనారాయణకు అరసం అభినందన

పటమట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా అరసం ఎన్టీఆర్ జిల్లా సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. సాహితీవేత్త, సాహితీ చరిత్రకారుడు రెండు లక్షణాలను కలబోసుకుని కళ్లముందు నిలబడే ప్రశాంత రూపం పెనుగొండల లక్ష్మీనారాయణది అని వారు ప్రశంసించారు. అరసం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్, సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కొప్పర్తి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షుడు కొండపల్లి మాధవరావులు పెనుగొండకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.



రమేశ్ ఆస్పత్రి జంక్షన్‌లో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు

రమేశ్ ఆస్పత్రి

జంక్షన్ జామ్

నగరంలోని రమేశ్ ఆస్పత్రి జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ నియంత్రణకు తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో వాహనాలు అస్తవ్యస్తంగా ప్రయాణించాయి. గురునానక్ కాలనీవైపు నుంచి, ప్రభుత్వాస్పత్రి, బెంజ్‌సర్కిల్ వైపు నుంచి వాహనాలు ఎక్కడికక్కడే భారీగా నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు అల్లాడిపోయారు. -(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వాస్పత్రి వైపు నుంచి రమేశ్ ఆస్పత్రి జంక్షన్ వైపు భారీగా నిలిచిపోయిన వాహనాలు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీపీ ఎస్వీ రాజశేఖరబాబు

రైలు టికెట్ చూసి

దోపిడీకి స్కెచ్

- పోలీసు అవతారం ఎత్తిన నిందితులు
- 'ప్రభాస్' వద్ద దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు అరెస్టు..రూ.25.27లక్షల రికవరీ

బుక్ చేసిన రైల్వే టికెట్‌ను చూసిన వెంటనే దోపిడీకి స్కెచ్ వేశాడు. తన ఒక్కడి వల్ల కాదని భావించి వ్యభిచారగృహ నిర్వాహకురాలితో కలిసి మ్యాప్ వేశాడు. దోపిడీకి పోలీసు పేరును ఉపయోగించుకున్నాడు. ఈ గ్యాంగ్ మొత్తం కలిసి బంగారం షాపులో పనిచేసే గుమస్తా నుంచి రూ.25.27 లక్షలను కాజేసింది. సీసీ కెమెరాల ద్వారా సీసీఎస్ పోలీసులు కేసును ఛేదించారు. వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వరరావుతో కలిసి శుక్రవారం వెల్లడించారు.

విజయవాడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ సీతారామపురానికి చెందిన చేగు పార్థసారధి జగ్గయ్యపేటలో మేనమామ వద్ద ఎక్కువగా ఉంటాడు. ఆయన ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్‌ను నిర్వహిస్తున్నాడు. జగ్గయ్యపేటలో బంగారం షాపులో గుమస్తాగా పనిచేస్తున్న వడ్డే రామకృష్ణ ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు రైల్వే టిక్కెట్లను సారధి మేనమామ వద్ద బుక్ చేయించుకుంటాడు. ఈవిధంగా రామకృష్ణతో పార్థసారధికి పరిచయం ఏర్పడింది. ఈనెల 11వ తేదీన విజయవాడ నుంచి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో చెన్నైకి వెళ్లడానికి రామకృష్ణ ఇక్కడ టికెట్‌ను బుక్ చేయించుకున్నాడు. ఆ సమయంలో పార్థసారధి అక్కడే ఉన్నాడు. రామకృష్ణ బంగారం కొనుగోలు చేయడానికి ఇతర రాష్ట్రాలకు వెళ్తాడని పార్థసారధికి అవగాహన ఉంది. రామకృష్ణ వద్ద డబ్బులు భారీగా ఉంటాయని ఊహించి దాన్ని కాజేయడానికి అక్కడికక్కడే ప్రణాళిక రూపొందిచాడు.

వ్యభిచార గృహం నిర్వాహకురాలితో కలిసి పన్నాగం

విషయాన్ని విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు భానునగర్‌లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ప్రత్తిపాటి శాంతికి పార్థసారధి తెలియజేశాడు. శాంతి ఇంట్లో కూర్చుని దోపిడీకి స్కెచ్ వేసుకున్నారు. శాంతి తన వ్యభిచార గృహానికి వచ్చే వించిపేటకు చెందిన పటాన్ సుభాని ఖాన్, ఇబ్రహీంపట్నం దుర్గకాలనీకి చెందిన గుళ్లూరు వంశీకృష్ణంరాజు, పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ హజారుద్దీన్ అలియాస్ చోటులను పురమాయించింది. సుభాని ఖాన్, వంశీకృష్ణంరాజు పోలీసుల్లా వ్యవహరించాలని సూచించింది. ఈనెల 11న రామకృష్ణ జగ్గయ్యపేట నుంచి విజయవాడకు వచ్చాడు. గవర్నరుపేట జైహింద్ కాంప్లెక్స్‌లోకి వెళ్లి వ్యాపారి నుంచి డబ్బులు తీసుకున్నాడు. జగ్గయ్యపేట నుంచి రామకృష్ణను పార్థసారధి అనుసరిస్తున్నాడు. రామకృష్ణ రైల్వేస్టేషన్‌కు వెళ్లే సరికి రైలు కదిలిపోయింది. దీంతో ఆయన మంగళగిరికి రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి కారును పురమాయించుకుందామని బయటకు వచ్చాడు. విషయాన్ని సుభానిఖాన్, వంశీకృష్ణంరాజుకు పార్థసారధి సమాచారమిచ్చాడు. వాళ్లిద్దరూ పోలీసుల మాదిరిగా ఖాకీ ప్యాంటు, తెలుపు టీర్ట్, బూట్లు ధరించి రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి కారులో ఎక్కించుకుని ప్రభాస్ కాలేజీ వరకు తీసుకొచ్చారు. తాము పోలీసులమని చెప్పి రామకృష్ణను బెదిరించారు. ఇన్‌స్పెక్టర్ తీసురమ్మన్నారని, కారులో నుంచి కదలొద్దని చెప్పారు. ఇలా కొద్దిసేపు బెదిరించిన తర్వాత వంశీకృష్ణంరాజు కారులో కూర్చుని, స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఉన్నారో లేదో చూసి రమ్మని సుభానిఖాన్‌ను పంపించాడు. అతడు ఆ వీధిలో కొంతదూరం వరకు వెళ్లి వచ్చి ఇన్‌స్పెక్టర్ తీసురమ్మన్నారని చెప్పాడు. స్టేషన్‌కు రావాలని చెప్పి కారులో ఉన్న బ్యాగ్‌ను వంశీకృష్ణంరాజు తీసుకున్నాడు. బయట నుంచి హజారుద్దీన్ గమనిస్తున్నాడు. డబ్బుల బ్యాగ్‌ను తీసుకున్న తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. బ్యాగ్‌లో ఉన్న రూ.25.57లక్షలను పంచుకోవడానికి ఈ మొత్తాన్ని శాంతి ఇంట్లో భద్రపరిచారు. ఈ ఘటనతో రామకృష్ణ అక్కడే బీపీ పెరిగి కళ్లు తిరిగిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పేసరికి వారు షాక్ అయ్యారు. అతడి నుంచి ఫిర్యాదును స్వీకరించి సీన్‌ను రీ కనస్ట్రక్షన్ చేశారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రభాస్ కాలేజీ వరకు మార్గంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పటాన్ సుభానిఖాన్, వంశీకృష్ణంరాజు ముఖాలు స్పష్టంగా కనిపించాయి. తర్వాత మరికొంత సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేయగా పార్థసారధి ఆపరేషన్ ముందు నుంచి పూర్తయ్యే వరకు వారితో ఫోన్లలో సంభాషణలు చేసినట్టు నిర్ధారణ అయింది. నిందితుల్లో పార్థసారధి, సుభానిఖాన్, శాంతి, హజారుద్దీన్‌లను శుక్రవారం అరెస్టు చేశారు. శాంతి ఇంట్లో ఉన్న రూ.25.27లక్షలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు వంశీకృష్ణంరాజు పరారీలో ఉన్నాడు. షేక్ హజారుద్దీన్‌పై మెదక్ జిల్లా పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, రామ్‌కుమార్, పి.శ్రీనివాస్, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు

ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు సత్కారం

విజయవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ప్రభుత్వం నైట్ అవుట్ అలవెన్సులను మంజూరు చేసింది. ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రేమతో ప్రభుత్వానికి నివేదించి సమస్యను పరిష్కరించినందుకు శుక్రవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ అభినందించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఆర్.సుబ్బారావు, శ్రీనివాసరాజు, ఎస్.రాజేష్‌కుమార్, ఎ.రామారావు తదితరులు ఎండీ ద్వారకా తిరుమలరావును సత్కరించారు. 2017 పీఆర్సీ బకాయిల చెల్లింపు, ఆర్‌పీఎస్ బకాయిల చెల్లింపు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా చొరవ చూపాలని కోరారు.

ఉప్పొంగిన అభిమానం

గంగూరు (కంకిపాడు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చూసేందుకు విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలేసింది. గంగూరులోని రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించేందుకు తమ కళాశాల మీదుగా సీఎం చంద్రబాబునాయుడు వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉప్పొంగిన అభిమానంతో పెద్ద సంఖ్యలో కళాశాల బయటకు వచ్చారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సీఎం చంద్రబాబునాయుడు వాహనం నుంచి కిందకు దిగి విద్యార్థులకు అభివాదం చేశారు. ఆయనను ఫొటోలు తీసేందుకు విద్యార్థులు ఎగబడ్డారు.



ఏపీ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్ - 2024 కార్యక్రమంలో గోల్డ్, సిల్వర్ అవార్డులను స్వీకరిస్తున్న రైల్వే అధికారులు

విజయవాడ రైల్వే డివిజన్‌కు ఇంధన పొదుపు పురస్కారాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ రైల్వే డివిజన్ రెండు రాష్ట్రస్థాయి ఇంధన పొదుపు పురస్కారాలను సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్- 2024 లో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్ సత్యనారాయణపురంలోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీటీఎస్) గోల్డ్ అవార్డును సాధించింది. విజయవాడ రైల్వే హాస్పిటల్ సిల్వర్ అవార్డును సాధించింది. అవార్డులను రైల్వే అధికారులు శుక్రవారం అందుకున్నారు. ఇంధన పొదుపుకోసం సత్యనారాయణపురంలోని ఈటీటీఎస్ కేంద్రంలో సోలార్ ట్రీ ఏర్పాటు చేశారు. 45 కిలోవాట్ పవర్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈటీటీఎస్ భవనాన్ని నూరు శాతం ఇంధన సమర్థతగా మార్చివేశారు. భవనంలో ఫైవ్ స్టార్ విద్యుత్ ఉపకరణాలు, ఎల్ఈడీ దీపాలు, స్టార్ రేటింగ్ పంపులు, బీఎల్‌డీసీ ఫ్యాన్లు ఏర్పాటుచేశారు. భవనంలోని తరగతి గదులలో ఇన్వర్టర్లతో కూడిన ఎయిర్ కండీషన్లను వినియోగిస్తున్నారు. రైల్వే హాస్పిటల్‌లోనూ ఇంధన పొదుపు విధానాలు అవలంబిస్తున్నారు. 10 కిలోవాట్ పవర్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లు, స్టార్ రేటింగ్ విద్యుత్ ఉపకరణాలు వంటివి ఏర్పాటు చేశారు. ఇంధన పొదుపులో పాటిస్తున్న అత్యున్నత విధానాల కారణంగా ఈ రెండు కూడా గోల్డ్, సిల్వర్ అవార్డులను సాధించాయి.

జూడో పోటీలకు రండి

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి జూడో ప్రతినిధుల ఆహ్వానం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్, క్యాడెట్, సబ్ జూనియర్ బాల, బాలికలు, పురుషులు, మహిళల జూడో పోటీలకు హాజరు కావాలని క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, వీసీ ఎండీ గిరీషాకు ఏపీ జూడో సంఘం ఆహ్వానాలు అందించింది. ఓ హోటల్‌లో మంత్రిని జూడో ప్రతినిధులు గురువారం రాత్రి కలిశారు. 500 మంది జూడో ప్లేయర్స్, 50 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటున్నారని సీఈవో నామిశెట్టి వెంకట్ తెలిపారు. ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు గణేశ సుబ్బారావు, కార్యదర్శి ఎన్.పవన్‌సందీప్, జి.సాంబశివరావు పాల్గొన్నారు.

జాతీయ, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు సిద్ధం



కేంద్ర మంత్రి మాండవ్యకు ఏపీ ప్రాజెక్టులపై వినతిపత్రం ఇస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ క్రీడలు, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర క్రీడామంత్రి మాండవ్యకు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు మాండవ్య, కింజరపు రామ్మోహన్‌నాయుడును శాప్ ఛైర్మన్ వేర్వేరుగా కలిశారు. 'అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా సౌకర్యాలను రాష్ట్రంలో నెలకొల్పాలి. రూ.237 కోట్లతో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్సు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ఖేలో ఇండియా ద్వారా మంజూరు చేయాలి. ఏపీకి మంజూరు చేసిన 26 జిల్లాస్థాయి ఖేలో ఇండియా సెంటర్లతో పాటు అదనంగా మరో 26 మంజూరు చేయాలి. కొవిడ్‌కు ముందు నిలిపేసిన క్రీడాకారుల రైల్వే రాయితీలను పునఃప్రారంభించాలి.' అని మాండవ్యను రవినాయుడు కోరారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు స్కేటర్ జెస్సీరాజ్



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025కు చిన్న వయస్సులోనే ప్రపంచ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న నగరానికి చెందిన అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్(14) ఎంపికైంది. ఈనెల 26న రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆమె ఈ అవార్డును అందుకోనుంది. పటమట ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతోంది.

రిజర్వేషన్ల చట్టబద్ధతపై పునఃసమీక్షించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

ఘంటసాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల చట్టబద్ధతపై సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం పునఃసమీక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె జగదీష్ స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అగ్రకుల పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట 10 శాతం రిజర్వేషన్లు కల్పించటానికి పార్లమెంట్‌లో 103వ రాజ్యాంగ సవరణ చేసి, చట్టం చేయడం రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు 9 మంది న్యాయమూర్తులను మించిన విస్తృత ధర్మాసనం ద్వారా విచారించాలని కోరారు. రిజర్వేషన్ల చట్టబద్ధతను పునఃసమీక్షించి, అణగారినవర్గాలకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్

ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శంకరరావు

రైల్వేస్టేషన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సమావేశంలో సీహెచ్ శంకరరావును దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోనల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా సరోజినిరెడ్డిని ఎన్నుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శిగా రవీంద్ర, విజయవాడ డివిజన్ కార్యదర్శిగా లీల, గుంతకల్లు డివిజన్ సెక్రటరీగా విజయకుమార్, గుంటూరు డివిజన్ సెక్రటరీగా ప్రసాద్, హైదరాబాద్ డివిజనల్ సెక్రటరీగా కృష్ణ, వర్క్‌షాపు డివిజనల్ సెక్రటరీగా బుచ్చిరెడ్డి, నాందేడ్ డివిజనల్ సెక్రటరీగా మణికుమార్‌ను ఎన్నుకున్నారు. 8వ వేతన సంఘం కోరుతూ తీర్మానం చేశారు.

క్రీడా యాప్‌లో సవరణలు చేయండి

- శాప్ ఎండీకి కేపీరావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పారదర్శకతకు శాప్ క్రీడా యాప్‌ను తీసుకురావడం మంచి పరిణామమని, ఇందులో సవరణలు చేసి క్రీడాకారులకు మరింత ఉపయుక్తంగా తీర్చిదిద్దాలని శాప్ వీసీ ఎండీ గిరీషాను ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ కేపీ రావు ఓ లేఖలో శుక్రవారం కోరారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో నకిలీ సర్టిఫికెట్ల అభ్యర్థులకు చెక్ పెట్టడానికి జిల్లాస్థాయి ఎంపిక కమిటీలో ఇద్దరు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, డీఎస్‌ఏ నామినీ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి, స్పోర్ట్సు అసోసియేషన్ నామినీ కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేస్తే 80 శాతం అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని రావు సూచించారు. రాష్ట్రస్థాయిలోనే కమిటీలు వేయాలని ఆయన అభ్యర్థించారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్‌కు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కాలికట్ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 28 వరకు నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ టీమ్ శుక్రవారం పయనమైందని వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి తెలిపారు. టీమ్ సభ్యులు ఎం.జశ్వంత్, ఎస్.వివేక్, జేవీ రామాంజనేయులు, ఎండీ జమిల్ అక్తర్, డి.హేమంత్‌సాయి, ఎం.రకమందార్‌సాయి, క్రిస్టీ ఏ మాథ్యూ, అహ్మద్ షీజ్‌కా, కె.భావిష్, ఎన్.క్రాంతికుమార్, కె.నీరజ్‌చంద్ర, కె.జాషువా, టి.మోసెస్ పీటర్, ఎస్.సుధీర్, బి.జిబిన్, ఎ.చరణ్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నర్సింహ, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి అభినందించారని తెలిపారు.

ఏడు రకాల అద్భుత అన్నాలు

అన్నం అనగానే మనకు తెల్లటి వరి అన్నం గుర్తుకొస్తుంది. కానీ మన ప్రాచీన గ్రంథాలలో దీనిని 'కేవలాన్నం' అంటారు. అంటే ఏ ఇతర పదార్థాలు కలపని అన్నం అని అర్థం. కేవలాన్నంలో ఇతర పదార్థాలను కలిపితే అవి అద్భుత అన్నాలు అవుతాయంటాడు భోజన కుతూహలం గ్రంథ రచయిత రఘునాథ సూరి. ఆ అన్నాలేమిటో తెలుసుకుందాం.



పరమాన్నం

'తండుల త్రిగుణం దుగ్ధం దుగ్ధార్ధం జీవనీయకమ్
తదర్ధం! గుడచూర్ణంతు పరమాన్న మితి స్మృతమ్'

బియ్యానికి మూడు రెట్లు చిక్కని పాలు, పాలలో సగం నీళ్లు, ఆ నీళ్లకు సగం బెల్లంపొడి ఈ కొలతలలో తీసుకుని వండినది పరమాన్నం.

హరిద్రాన్నం

"సంస్కృతం మధితం గవ్యం తండులానాం చతుర్గుణం ఈషత్ హరిద్రయా యుక్తం
మరీచా జాజి సంయుతమ్ఖ హరిద్రాన్నం"

అంటే పసుపు అన్నం అని! ఇది పులిహోర కాదు ఒక రకం క్షీరాన్నమే! దీని తయారీకి బాగా శుద్ధి చేసి చిలికిన పాలను.. అవి నాలుగోవంతు అయ్యేదాకా మరిగించాలి. అప్పుడు బియ్యానికి నాలుగు రెట్లు ఎక్కువ ఈ పాలను పోసి.. దానిలో పసుపు, మిరియాలపొడి, జాజికాయపొడి వేయాలి. దీనిని నెయ్యి, బెల్లం నంజుకుంటూ తింటారు.

దధ్యాన్నం

"మధురామ్లేన గోదధ్నా శుద్ధాన్నంతు విమిశ్రితంఖ
శాంశ్చ నిర్బిజ్యానిపీడ్య షోడాభఃక్షాళయేద్ బుద్ధాఃఖ
నిర్బిజ్య"

అన్నాన్ని వండటానికి తీసుకునే బియ్యాన్ని నీళ్లు పోసి చేతితో పిసుకుతూ.. కడగాలి. ఇలా 8 సార్లు కడగాలి. ఈ బియ్యం ఉడుకుతున్నప్పుడు దానిలో మిరియాలపొడి, అల్లం ముక్కలు, సైంధవ లవణం వేసి ఉడికించాలి. అన్నం వేడి తగ్గిన తర్వాత దానిలో శుద్ధమైన పెరుగు వేసి కలపాలి. పెరుగు మన శరీరానికి అవసరమైన మంచి సూక్ష్మక్రిములను అందిస్తుంది.

కృశరాన్నం

బియ్యంలో సగం పెసరపప్పు కలిపి వండిన పులగం లేదా కటుపొంగలినే కృశరాన్నం అని కూడా అంటారు. దీనిని నేతితో వండుతారు.

గుడోదనం

పాలలో సగం కొలతలో బెల్లం తీసుకుని అదే పాలలో కరిగించి పరమాన్నం వండుకోవాలి. ఈ పరమాన్నంలో నెయ్యి, చక్రకేళి పండ్ల గుజ్జు కూడా కలుపుతారు. పరమాన్నంలో కంటే ఎక్కువ బెల్లం.. అదనంగా నెయ్యి, అరటిపళ్లు కలుస్తాయి.

ముద్గాన్నం

మూడు భాగాలు బియ్యం, ఒక భాగం పెసరపప్పు కలిపి తగినంత ఉప్పు వేసేది ముద్గాన్నం. ఇందులో రుచికి ఒక చెంచాడు నెయ్యి వేసుకుని తింటారంతే!

భూతోదనం

'హృదయాధిప' అనే గ్రంథంలో పెరుగు, పసుపు, వేగించి విసిరిన పెసరపిండి, చక్కగా ఉడికిన అన్నం, కొద్దిగా ఆవపిండి కలిపిన అన్నాన్ని భూతోదన అంటారని భోజన కుతూహలం పేర్కొంది. ఉడికించిన కూరగాయ ముక్కలు కూడా ఇందులో కలుపుకుంటే ఇది అద్భుతమైన ఆహారం అవుతుంది.

• గంగరాజు అరుణాదేవి

అవాంఛిత రోమాలతో ఇబ్బందా?

కొంతమంది మహిళలు అవాంఛిత రోమాలతో సతమతమవుతూ ఉంటారు. హార్మోన్ల అసమతౌల్యం వల్ల లేదా వంశపారంపర్యంగా ఈ సమస్య ఎదురవుతుంటుంది. దీంతో మహిళలు వ్యాక్సింగ్, థ్రెడింగ్ పద్ధతులు అనుసరిస్తూ ఉంటారు. వీటివల్ల విపరీతమైన నొప్పిని భరించాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇంట్లో దొరికే వస్తువులతో కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

చక్కెర-నిమ్మరసం: ఒక గిన్నెలో రెండు చెంచాల చక్కెర వేసి వేడి చేస్తే చిక్కని ద్రవం ఏర్పడుతుంది. దీనిలో ఒక చెంచా నిమ్మరసం కలిపి ఈ మిశ్రమాన్ని అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. అయిదు నిమిషాలు ఆరాక దానిమీద మెత్తని వస్త్రాన్ని పెట్టి గట్టిగా ఒత్తాలి. తరవాత వస్త్రాన్ని వెంట్రుకలు పెరుగుతున్న దిశకు వ్యతిరేకంగా లాగాలి. వెంట్రుకలన్నీ గుడ్డతోపాటే ఊడి వచ్చేస్తాయి.

ఓట్స్-అరటిపండ్లు: మిక్సీ గిన్నెలో అర కప్పు ఓట్స్ వేసి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని చిన్న గిన్నెలోకి తీసుకుని అరటి పండు గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, కాళ్లు, చేతులకు పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే అవాంఛిత రోమాలు క్రమంగా తొలగిపోయి మరల పెరగవు.



వంటిల్లు



క్రిస్మస్, కొత్త సంవత్సరం వచ్చేస్తున్నాయి. ఇంటికి ఎవరో ఒకరు వస్తూ ఉంటారు. అతిథులు వచ్చిన ప్రతిసారీ ఇడ్లీ, దోశలు మాత్రమే పెడితే ఏంబాగుంటుంది! అందుకే అందరూ ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన చాట్‌లను ఎలా తయారుచేయాలో చూద్దాం.

కిర్రెక్కించే చాట్‌లు

చిలకడదుంప చాట్



కావాల్సిన పదార్థాలు:

ఉడకబెట్టి వేయించిన చిలకడదుంప ముక్కలు: ఒక కప్పు, చింతపండు రసం: నాలుగు చెంచాలు, నిమ్మరసం- ఒక చెంచా, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత, దానిమ్మ గింజలు- నాలుగు స్పూన్లు, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను

తయారీ విధానం

- చిలకడదుంపను బాగా కడిగి తొక్క తీసేయాలి. దానిని ముక్కలుగా తరగాలి. వాటిని కుక్కర్‌లో ఉడకబెట్టవచ్చు. లేదా నెయ్యి వేసి వేయించవచ్చు.
- ఒక గిన్నెలో చిలకడదుంప ముక్కలు, చింతపండు రసం, నిమ్మరసం, చాట్‌మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత దానిమ్మ గింజలు, కొత్తిమీర పైన చల్లాలి.

జాగ్రత్తలు

- చిలకడదుంపలను ఎక్కువ ఉడకబెడితే ముద్దగా అయిపోతాయి. అందువల్ల తక్కువగానే ఉడకబెట్టాలి.
- కొందరు ఉడకబెట్టిన తర్వాత నెయ్యి వేసి వేయిస్తారు. అలా చేసినా రుచికరంగానే ఉంటుంది.

పాలకూర పకోడీ చాట్

కావాల్సిన పదార్థాలు

తరిగిన పాలకూర: ఒక కప్పు, శనగపిండి- అరకప్పు, నూనె- ఒక కప్పు, ఉప్పు- తగినంత, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు చెంచాలు, జీలకర్ర పొడి- ఒక చెంచా

తయారీ విధానం

- పాలకూరను బాగా కడిగి దానిలో శనగపిండి, ఉప్పు వేసి కలపాలి.
- ఒక మూకుడులో నూనెను తీసుకొని, పాలకూర మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేయించాలి. బయటకు తీసి ప్లేటులో ఉంచాలి.
- ఒక గిన్నెలో పాలకూర పకోడీలు వేయాలి. దానిపై పెరుగు, చింతపండు రసం, ఉప్పు, జీలకర్ర పొడి వేయాలి.

జాగ్రత్తలు

- పకోడీలపై పెరుగు, ఇతర పదార్థాలు వేసిన తర్వాత బాగా కలపకూడదు. దీనివల్ల పకోడీలు మెత్తపడిపోతాయి.
- పాలకూరలో శనగపిండిని కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు చిలకరించాలి. అంతే తప్ప శనగపిండిలో పాలకూరను వేసి నీళ్లతో కలపకూడదు.

ఈ చాట్‌లన్నింటికీ చాట్ మసాలా అవసరమవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో రకరకాల బ్రాండ్ల చాట్‌మసాలాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏ చాట్ మసాలానైనా వాడుకోవచ్చు.

ఆలూటిక్కీ చాట్

కావాల్సిన పదార్థాలు :

బంగాళదుంప ముక్కలు- రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, పచ్చి బఠానీలు- పావుకప్పు, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు స్పూనులు, గ్రీన్ చట్నీ (కొత్తిమీర, పుదీనా, పుట్నాల పప్పు, నిమ్మరసంల మిశ్రమం)- రెండు చెంచాలు, కారప్పూస- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- బంగాళదుంపలను తొక్క తీసి బాగా ఉడికించాలి. పచ్చి బఠానీలను కూడా ఉడికించాలి. ఇవి రెండూ ఉడికి చల్లారిన తర్వాత ఒక గిన్నెలో బంగాళదుంపలు, పచ్చి బఠానీలు, ఉప్పు, కార్న్‌ఫ్లోర్ వేసి ముద్దగా చేయాలి.
- బంగాళదుంపల మిశ్రమాన్ని చిన్న ముద్దలుగా చేసి అరచేతిలో గుండ్రంగా ఒత్తాలి. వీటినే టిక్కీలంటారు.
- ఒక పెనంపై నూనె వేసి వేడి చేయాలి. టిక్కీలను సన్నని సెగపై కాల్చాలి.
- ఇలా కాల్చిన టిక్కీలను ఒక గిన్నెలో తీసుకొని దానిలో చింతపండు రసం, గ్రీన్ చట్నీ, కారపూస, చాట్ మసాలా, ఉప్పులను వేయాలి.

జాగ్రత్తలు

- టిక్కీల కోసం కార్న్‌ఫ్లోర్ అందుబాటులో లేకపోతే బియ్యపు పిండిని వేయవచ్చు.
- టిక్కీలను బాగా కరకరలాడేలా కాల్చకూడదు. కొద్దిగా మెత్తగా ఉంటేనే బావుంటుంది.



ఆరోగ్యమే అసలు రహస్యం




సెలబ్ ఫిట్

వెండితెరపై అలరిస్తున్న మరో వారసురాలు... అలనాటి తార పూజా బేడీ కూతురు... అలయా ఇబ్రహీమ్ ఫర్నిచర్‌వాలా. ఉరఫ్ అలయా ఎఫ్‌గా సుపరిచితురాలు. చేసింది కొద్ది సినిమాలే అయినా విలక్షణ నటిగా పేరు తెచ్చుకొంది. అభినయంతో పాటు నాజూకైన రూపంతోనూ ప్రత్యేకతను సంతరించుకున్న ఈ భామ... ఇన్‌స్టాలో తరచూ ఫిట్‌నెస్ వీడియోలు పెట్టి... ఆరోగ్యవంతమైన జీవన విధానం దిశగా అభిమానులను ప్రోత్సహిస్తోంది.

హాస్యభరిత చిత్రం 'జవానీ జానేమన్'తో బాలీవుడ్‌లోకి ప్రవేశించింది అలయ. ఆమె తల్లి పూజా బేడీ కథానాయికగా పలు చిత్రాల్లో అలరించారు. ప్రముఖ నటుడు కబీర్ బేడీ ఆమెకు తాత. ఫర్హాన్ ఇబ్రహీమ్ ఫర్నిచర్‌వాలాతో వివాహం తరువాత పూజా బేడీ అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడే అలయ జన్మించింది. పరిశ్రమలోకి రాకముందు ఆమె ముంబయి 'జమునాబాయి నర్సీ స్కూల్'లో చదివింది. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో... అలయకు చిన్నప్పటి నుంచే నటి కావాలనే కోరిక బలపడింది. దానికోసమే 'న్యూయార్క్ ఫిలిమ్ అయాడమీ'కి వెళ్లి నటనలో డిప్లమా చేసింది. ఆ క్రమంలోనే తెరపై తన పేరును అలయ ఎఫ్‌గా మార్చుకుంది. కథక్ నాట్యంలో కూడా శిక్షణ తీసుకున్న అలయ... 2011లో అమ్మతో కలిసి ఓ రియాలిటీ షోలో పాల్గొంది. 2020లో ఆమె తొలి చిత్రం 'జవానీ జానేమన్' విడుదలైంది. సైఫ్ అలీఖాన్ హీరో. చక్కని నటనతో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. మొదటి సినిమానే అయినా కెమెరా ముందు అలయ ఎంతో సహజంగా కనిపించిందనేది విశ్లేషకుల మాట. 'బెస్ట్ ఫిమేల్ డెబ్యూ' ఫిలిమ్‌ఫేర్ అవార్డు కూడా దక్కించుకుంది. ఇక అక్కడి నుంచి వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. 'ఫ్రెడ్డీ, యూటర్న్'తో పాటు ఇటీవల విడుదలైన మల్టీస్టారర్ 'బడేమియా చోటేమియా'లో టైగర్‌షరాఫ్‌కు జోడీగా కీలక పాత్ర పోషించింది. పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా జీవిత చరిత్ర ఆధారంగా తీసిన 'శ్రీకాంత్'లో హీరో రాజ్‌కుమార్‌రావుతో పోటీపడి నటించింది.

ఐదేళ్ల కెరీర్‌లో ఆరు చిత్రాల్లోనే నటించినా... తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నైకా, లెన్స్‌కార్ట్ వంటి బడా బ్రాండ్‌లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. అటు సినిమాలు, ఇటు ప్రకటనలతో రెండు చేతులా సంపాదిస్తోంది ఈ అందాల తార. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు ఇరవై లక్షలమంది ఆమెను ఫాలో అవుతున్నారు. ప్రతి వీడియోకూ లైకులు కనీసం లక్ష దాటతాయి. ఆమె పోస్టు చేసేవాటిల్లో ఎక్కువగా తన ప్రాజెక్టులు, బ్రాండ్‌లతో పాటు ఫిట్‌నెస్ వీడియోలు ఉంటాయి. అక్కడ అప్పుడప్పుడూ అభిమానులకు కొన్ని ఫిట్‌నెస్ సవాళ్లు కూడా విసురుతుంటుంది. కెరీర్‌కు ఎంతటి ప్రాధాన్యమిస్తుందో... ఆరోగ్యవంతమైన జీవన విధానానికి కూడా అంతే ప్రాధాన్యమిస్తుంది. అదే తన విజయ రహస్యమని, అందుకే తన జీవితంలో వ్యాయామాలు, ఆహార నియమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తానని చెబుతుంది అలయ.



వ్యాయామాలు ఇలా...

అలయ వ్యాయామాల విషయంలో అస్సలు రాజీపడదు. ఆమె రోజువారీ వర్కవుట్స్ చాలా కఠినంగా ఉంటాయి. ఎప్పటికప్పుడు తనకు తాను కొత్త లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని చేరుకొనేందుకు కఠోరంగా శ్రమిస్తుంటుంది. వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ పూజా ధియా అమిన్ పర్యవేక్షణలో క్లిష్టమైన యోగాసనాలు కూడా సాధన చేస్తుంది. ఒకవేళ జిమ్‌కు వెళ్లడం కుదరకపోతే ఇంట్లోనే సుదీర్ఘ ఏరోబిక్స్ సెషన్‌తో పాటు స్కిప్పింగ్‌తో అదనపు క్యాలరీలు కరిగిస్తుంది.

- ఉదయం లేవగానే ముందుగా రన్నింగ్, జాగింగ్‌తో కూడిన కార్డియో సెషన్
- తరువాత పావుగంట కిక్‌బాక్సింగ్ దీనివల్ల మెదడు చురుగ్గా పని చేస్తుందనేది అలయ మాట.
- సరైన శరీరాకృతి, శరీర దారుఢ్యం కోసం వెయిట్ ట్రెయినింగ్‌తో పాటు స్క్వాట్స్, సూపర్‌మ్యాన్ స్ట్రెచ్, లంగెస్, ప్లాంక్స్, క్రంచెస్ తదితర వ్యాయామాలు.
- అప్పుడప్పుడూ బంతితో ట్రైనింగ్. అంటే బంతిపై కూర్చొని వ్యాయామాలు చేయడం. దీనివల్ల బ్యాలెన్స్ బాగా కుదురుతుంది. అయితే ఇలాంటి వ్యాయామాలు నిపుణుల సమక్షంలోనే చేయాలి.
- అలయ 90 నిమిషాల తన వర్కవుట్ సెషన్‌ను రెండుగా విభజించింది. మొదటి సెషన్ ఇండోర్‌లో. అంటే జిమ్‌లో చేసేవి. రెండో సెషన్ ప్రకృతి ఒడిలో.
- అలయ వర్కవుట్స్‌లో మానసిక వ్యాయామం కూడా ఉంటుంది. రోజూ ధ్యానంతో పాటు ఏదో ఒక పుస్తకంలో పది పేజీలు చదువుతుంది. దీనివల్ల విజ్ఞానమే కాకుండా, సృజనాత్మక శక్తి కూడా పెరుగుతుందని అలయ చెబుతోంది. అంతేకాదు... తన ఆలోచనలన్నిటినీ ఒక కాగితం మీద పెడుతుంది. తన లక్ష్యాలను ఎంతవరకు చేరుకుందో ఏరోజుకారోజు బేరీజు వేసుకొంటుంది.

ఇదీ ఆహారం...

ఆహారం విషయంలోనూ అలయ ఎంతో శ్రద్ధ తీసుకొంటుంది. శరీరం డీహైడ్రేట్ కాకుండా రోజుకు నాలుగు లీటర్ల నీళ్లు తాగుతుంది. ఇంటి వంటకే ప్రాధాన్యమిస్తుంది. పోషక విలువలు సమతులంగా ఉండేందుకు మెనూలో రకరకాల సలాడ్స్‌ను జోడించింది.

- ఉదయం ఒక బౌల్ ఓట్‌మీల్‌తో మొదలవుతుంది. పిండి, పీచుపదార్థాలు ఇందులో పుష్కలం. మంచి శక్తినిస్తుంది. తాజా పండ్లకు అలయ అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అరటిపండు, బెర్రీస్, యాపిల్ తదితర పండ్లు ఆమె మెనూలో ఉంటాయి. వాటితోపాటు ఆమ్లెట్ లేదా బాయిల్డ్ ఎగ్‌తో బ్రేక్‌ఫాస్ట్. తరచూ గ్రీన్ టీ తాగుతుంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్స్ అధికం.
- మధ్యాహ్న భోజనంలో పాలకూర సూప్, కర్బూర, క్వినోవా పులావ్.
- రాత్రి పడుకొనే ముందు ఓట్‌మిల్క్, నాలుగు బాదంపప్పులు, రెండు అక్రోట్లు, చెంచాడు తేనె, దాల్చినచెక్క,

మేకప్

కలలు కనే కళ్ల కోసం..

ముఖంలో టక్కున ఆకట్టుకునేవి కళ్లే! కాబట్టి కళ్ల మెరుపులు చిందేలా ఐమేకప్ వేసుకోవాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి.

ఐ షాడో ఇలా...

ముదురు నుంచి లేత రంగుల వరకూ రకరకాల రంగుల ప్యాలెట్‌ను ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా మన కళ్లకు మరింత బాగా నప్పే రంగులు ఉండేలా చూసుకోవాలి.

రంగుల మీద పట్టు

ప్యాలెట్‌ను తెరిచి, ఏవి తేలిక రంగులు, ఏవి మధ్యస్థ రంగులు, ఏవి ముదురు రంగులో గుర్తించాలి. వీటిలో ఏ రంగులను ఉపయోగిస్తే, ఉబ్బెత్తుగా కనిపించేలా చేయవచ్చో, ఏ రంగులను ఉపయోగిస్తే, లోతుగా కనిపించేలా చేయవచ్చో తెలుసుకోవాలి. పై కను రెప్ప మధ్యలో ఉబ్బెత్తుగా కనిపించేలా తేలిక రంగు అద్దుకోవాలి. కొలకుల దగ్గర ముదురు రంగు ఐషాడో వేసుకోవాలి.

ఇలా అద్దుకోవాలి

- తేలిక రంగులను హైలైట్ కోసం ఉపయోగించాలి. కంటి కొలకుల దగ్గర, కంటి ఎగువ ఎముక దగ్గర ఈ రంగులను వాడుకోవాలి.
- మధ్యస్థ రంగులను కంటి ప్రాథమిక ఆకారాన్ని ప్రస్ఫుటం చేయడం కోసం వాడుకోవాలి. అలాగే తేలి



కపాటి ప్రదేశాలను ముదురు రంగు ప్రదేశాల్లో కలిసిపోయేలా చేయడం కోసం కూడా ఈ రంగులు ఉపయోగపడతాయి. ఈ రంగులను కనురెప్పల మధ్యలో, ముడతల దగ్గర వాడుకోవాలి.

- కంటి ఆకర్షణ కోసం, కాంటూరింగ్ కోసం ముదురు రంగులు ఉపయోగపడతాయి. కంటికి మరింత తీవ్రతను తెచ్చిపెట్టడం కోసం కూడా ముదురు ఐ షాడోలను వాడుకోవచ్చు. కనురెప్పల చివర్లలో, ముడతల దగ్గర ఈ రంగులను అప్లై చేసుకోవాలి.
- **బ్లెండింగ్:** ముదురు రంగును లేత రంగులోకి కలపాలన్నా, లేత రంగును ముదురు రంగులోకి కలపాలన్నా బ్లెండింగ్ బ్రష్‌ను వృత్తాకారంలో కదిలిస్తూ బ్లెండ్ చేసుకోవాలి.

ఆరోగ్యదాయిని ఆప్రికాట్

ఆప్రికాట్ తినడానికి రుచికరంగా ఉంటుంది. దీనితో తయారు చేసే తీపి పదార్థాలను పిల్లలు ఇష్టంగా తింటూ ఉంటారు. రెండు ఆప్రికాట్ పండ్లను రాత్రి నీళ్లలో నానబెట్టి రోజూ ఉదయాన్నే తినడంవల్ల అనారోగ్యం దరిచేరదు.

మలబద్ధకానికి: ఆప్రికాట్‌లో పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. రోజూ ఈ పండు తినడంవల్ల మలబద్ధకం దూరమవుతుంది. దీనిలోని కెరోటినాయిడ్స్ పెద్ద పేగు, చిన్న పేగుల్లో క్యాన్సర్ రాకుండా చేస్తాయి. జీర్ణాశయంలో సమస్యలను నివారించి జీర్ణక్రియకు సహకరిస్తాయి.

కంటిచూపుకి: ఈ పండులో ఉండే ఎ విటమిన్ కంటి సమస్యలను నివారిస్తుంది. రోజూ ఉదయాన్నే ఈ పండు తినడంవల్ల ఫ్రీ రాడికల్స్ నుంచి రెటీనాకు రక్షణ లభిస్తుంది. కళ్ల నుంచి నీరు కారడం, కళ్లలో పొరలు పెరగడం వంటి సమస్యలు తలెత్తవు.

గుండెకు: ఆప్రికాట్‌లోని పీచు పదార్థం రక్తంలో చేరిన కొలెస్ట్రాల్‌ను కరిగించి శరీరమంతా రక్తప్రసరణ జరిగేలా చూస్తుంది. దీనివల్ల గుండె జబ్బులు రావు. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచి మధుమేహం రాకుండా కాపాడతాయి.



ఎముకలకు: తరచూ ఆప్రికాట్‌ను ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, మాంగనీస్, ఫాస్ఫరస్ లాంటి ఖనిజ లవణాలు అంది ఎముకలు దృఢంగా మారతాయి. కండరాలు పట్టేయడం, కీళ్లనొప్పులు వంటి సమస్యలను నివారిస్తాయి.

వాపులకు: ఆప్రికాట్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను నియంత్రణలో ఉంచుతాయి. వెన్ను నొప్పి, మెడనొప్పి, కడుపులో మంట, అరికాలి మంటలు, తిమ్మిర్లు, మోకాళ్ల సమస్యలను నివారిస్తాయి.

చర్మానికి: ఆప్రికాట్‌ను తరచూ తింటూ ఉంటే చర్మం తేమతో నిండి కాంతివంతంగా మారుతుంది. దీనిలోని సి, ఎ, కె విటమిన్లు; ఫైటో న్యూట్రియెంట్స్ చర్మానికి పోషణను అందిస్తాయి. మొటిమలు, మచ్చలు రాకుండా చేస్తాయి.

స్పోర్ట్స్

అర్జున్‌కు వీసా కష్టాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు గ్రాండ్ మాస్టర్ ఇరిగేసి అర్జున్ వీసా సమస్యలు ఎదుర్కొంటున్నాడు. న్యూయార్క్‌లో వారం రోజుల్లో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. అయితే, తనకు ఇప్పటి వరకు వీసా రాలేదని అర్జున్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. గతవారం యూఎస్ ఎంబసీలో తన పాస్‌పోర్టును స్టాంపింగ్ కోసం ఇవ్వగా, ఇంతవరకు తిరిగి ఇవ్వలేదని ఆ పోస్ట్‌లో పేర్కొన్నాడు. పోటీలకు సమయం సమీపిస్తున్నందున తన వీసా సమస్యను సత్వరమే పరిష్కరించాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, క్రీడాశాఖ మంత్రి మాండవీయలను అర్జున్ కోరాడు. ఈనెల 26 నుంచి జరిగే ఈ మెగా టోర్నీలో వరల్డ్ నెంబర్‌వన్ కార్ల్‌సన్‌తో పాటు, కరువానా, నెపోమ్నియాచి లాంటి టాప్‌స్టార్లతో అర్జున్ తలపడనున్నాడు.

12న బీసీసీఐ కార్యదర్శి ఎన్నిక

ముంబై: బీసీసీఐ ప్రత్యేక సాధారణ సమావేశం (ఎస్‌జీఎం) వచ్చేనెల 12న ఇక్కడ జరగనుంది. ఈ సమావేశంలో..బీసీసీఐ కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఈమేరకు అన్ని రాష్ట్ర సంఘాలకు నోటిఫికేషన్ పంపినట్టు బీసీసీఐ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. కార్యదర్శి జై షా ఐసీసీ చీఫ్‌గా, కోశాధికారి ఆషిష్ షెలార్ మహారాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆ రెండు పదవులు ఖాళీ అయిన సంగతి తెలిసిందే.

ఆయుషి అదరహో



ఫైనల్లో యువ భారత్

- శ్రీలంకపై గెలుపు
- బంగ్లాతో తుదిపోరు రేపు

అండర్-19 ఆసియా కప్

సింగపూర్: టోర్నీలో అప్రతిహత విజయాలతో జోరు కొనసాగిస్తున్న భారత జట్టు అండర్-19 మహిళల టీ20 ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. టీనేజ్ లెఫ్టామ్ స్పిన్నర్ ఆయుషి శుక్లా (4/10) తిప్పేసిన వేళ చివరి సూపర్-4 మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లతో శ్రీలంకను చిత్తు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో..తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 98/9 స్కోరే చేసింది. కెప్టెన్ మనుది ననయకర (33), సముదు నిసంసల (21) మాత్రమే రాణించారు. మరో స్పిన్నర్ పరునిక సిసోడియా 2 వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనను భారత్ 14.5 ఓవర్లలో 102/6 స్కోరుతో ముగించింది. త్రిష (32), కమలిని (28) సత్తా చాటారు. ఆయుషి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌తో మన అమ్మాయిలు అమీతుమీ తేల్చుకోనున్నారు.



స్పిన్‌కు విలవిల: టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక..ఆయుషి, పరునిక స్పిన్ బౌలింగ్‌కు ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఇద్దరు బ్యాటర్లే రెండంకెల స్కోరు చేశారు. శ్రీలంక ఓపెనర్లు సంజన (9), హస్నిక (2) కేవలం 12 బంతులే ఆడగలిగారు. ననయకర, నిసంసల ఐదో వికెట్‌కు చేసిన 22 పరుగులే లంక జట్టులో అత్యధిక భాగస్వామ్యం కావడం గమనార్హం. వీరిద్దరి చలువతో లంక మెరుగైన స్కోరుకు చేస్తుందనిపించింది. కానీ నిసంసల రనౌటవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 98/9 (మనుది 33, నిసంసల 21, ఆయుషి శుక్లా 4/10, పరునిక 2/27).
భారత్: 14.5 ఓవర్లలో 102/6 (త్రిష 32, కమలిని 28, మిథిల నాటౌట్ 17, ప్రబోద 3/16, షషిణి 2/18).

త్రిష మళ్లీ..: స్వల్ప ఛేదనలో భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ఈశ్వరి (0) మూడో బంతికే రనౌటైంది. సనిక (4) కూడా విఫలమవడంతో భారత్ 5/2తో ఇక్కట్లలో పడింది. అయితే బంగ్లాతో గతమ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో అదరగొట్టిన తెలుగు బ్యాటర్ త్రిష, మరో ఓపెనర్ కమలినితో కలిసి పరిస్థితి చక్కదిద్దింది. ఈ జోడీ రెండో వికెట్‌కు 63రన్స్ జోడించడంతో భారత్ సులువుగా లక్ష్యాన్ని చేరింది. మరో సూపర్-4 పోరులో బంగ్లాదేశ్ 9 వికెట్లతో నేపాల్‌ను ఓడించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 11ఓవర్లకు కుదించారు. తొలుత నేపాల్ 11 ఓవర్లలో 54/8 స్కోరు చేసింది. అనంతరం బంగ్లా9.5 ఓవర్లలో 58/1 స్కోరు చేసి గెలిచింది.

జాతీయ ఆర్చరీ విజేత ధీరజ్



జంషెడ్‌పూర్: తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర సీనియర్ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో విజయవాడకు చెందిన ధీరజ్ 6-2తో దివ్యాంశ్ చౌదరి (హరియాణా)ను ఓడించి జాతీయ టైటిల్ నెగ్గాడు. మహిళల రికర్వ్ విభాగంలో వెటరన్ స్టార్ దీపికా కుమారి (జార్ఖండ్) 6-2తో అంకిత (కోల్‌కతా)పై గెలిచి జాతీయ చాంపియన్‌గా అవతరించింది.

ముకేష్‌కు స్వర్ణం.. సందేశ్‌కు రజతం



ముకేష్



సందేశ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు షూటర్లు నేలవల్లి ముకేష్, సందేశ్ రెడ్డి పతకాలు కొల్లగొట్టారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 25 మీటర్ల పిస్టల్ జూనియర్ విభాగంలో గుంటూరు షూటర్ ముకేష్ 588 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణంతో మెరిశాడు. ఇదే వేదికగా జరిగిన పారా షూటింగ్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో హైదరాబాద్ షూటర్ సందేశ్ రెడ్డి 336 పాయింట్లు స్కోరు చేసి రజతం దక్కించుకున్నాడు.

జహీర్..ఈ బాలిక బౌలింగ్ చూశావా?



వీడియో పోస్ట్ చేసిన సచిన్

ముంబై: రాజస్థాన్‌కు చెందిన సుశీల మీనా బౌలింగ్‌కు దిగ్గజ బ్యాటర్ సచిన్ ఫిదా అయ్యాడు. 12 ఏళ్ల ఈ ఏడమ చేతి బౌలర్..అచ్చు భారత జట్టు మాజీ పేసర్ జహీర్‌ఖాన్‌లా బౌలింగ్ చేస్తోంది. ఆ బాలిక బౌలింగ్ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన టెండూల్కర్ 'చూసేందుకు ఎంతో మనోహరంగా ఉంది ఆమె బౌలింగ్. సుశీల మీనా బౌలింగ్‌ను చూస్తే జహీర్‌ఖాన్ గుర్తొస్తున్నాడు. జహీర్..ఈ వీడియో నువ్వు కూడా తిలకించావా?' అని రాశాడు.

టైటాన్స్‌ను గెలిపించిన పవన్

పుణె: కెప్టెన్ పవన్ సెహ్రావత్ చెలరేగడంతో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 48-36తో పుణెరి పల్టన్‌పై గెలిచింది. టైటాన్స్ సారథి పవన్ సెహ్రావత్ 15 పాయింట్లు సాధించి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. చివరి మ్యాచ్‌లో గెలిచిన టైటాన్స్‌కు ప్లేఆఫ్స్ బెర్త్ ఇంకా ఖరారు కాలేదు. మిగతా మ్యాచ్‌ల గెలుపోటములపై టైటాన్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఇక, మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 31-28తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

మెల్‌బోర్న్‌లో నీతో ఉంటా..

కోహ్లీతో అశ్విన్



చెన్నై: క్రికెటర్లుగా అశ్విన్, కోహ్లీలది 14 ఏళ్ల అనుబంధం. అందుకేనేమో రెండురోజుల కిందట అశ్విన్ హఠాత్తుగా ఆటకు వీడ్కోలు చెప్పడంతో విరాట్ ఎంతో ఉద్వేగానికి లోనయ్యాడు. 'నీతో ఆడిన సంవత్సరాలు నేను ఎంతో ఆస్వాదించా' అని ఆ సందర్భంగా కోహ్లీ ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఇక..రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించిన వెంటనే అశ్విన్ స్వస్థలం చెన్నై వచ్చేసిన సంగతి తెలిసిందే. తాజాగా..శుక్రవారం విరాట్ స్పందనకు అశ్విన్ బదులిస్తూ 'మెల్‌బోర్న్‌లో నీతో ఉంటా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. అయితే ఈనెల 26 నుంచి జరిగే బాక్సింగ్ డే టెస్ట్‌కు వ్యాఖ్యాతగా అశ్విన్ అక్కడకు వెళ్లనున్నాడా.. అనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తంజేశారు. మరికొందరేమో.. 2022 టీ20 వరల్డ్ కప్‌లో మెల్‌బోర్న్‌లో పాకిస్థాన్‌పై భారత జట్టు సాధించిన అద్భుత విజయాన్ని తాజా పోస్ట్‌లో అశ్విన్ గుర్తు చేశాడంటున్నారు. ఆ మ్యాచ్‌లో 160 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ చివరి బంతికి 2 పరుగులు చేయాల్సిన దశలో అశ్విన్ క్రీజ్‌లోకి వచ్చాడు. ఆ బంతిని పాక్ స్పిన్నర్ నవాజ్ వైడ్‌గా వేశాడు. తదుపరి బంతిని తెలివిగా ఫీల్డర్ మధ్యలోకి కొట్టిన అశ్విన్ మరో పరుగు తీయడంతో భారత్ గెలుపు ఖాయమైంది. ఆ మ్యాచ్‌లో కోహ్లీ (82 నాటౌట్) అర్ధసెంచరీతో సత్తా చాటాడు.

విజయ్ హజారే వన్డే టోర్నీలో నేడు

హైదరాబాద్ X నాగాలాండ్

ఆంధ్ర X రైల్వేస్

తనకు తానే శత్రువు

- జట్టులో అతడున్నా లేనట్టే..
- పృథ్వీ షాపై ఎంసీఏ



ముంబై: యువ క్రికెటర్ పృథ్వీ షా ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో విఫలమవడంతో హజారే ట్రోఫీకి అతడిని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) పక్కనబెట్టింది. ఇక ఐపీఎల్ వేలంలో అతడిని ఏ జట్టూ కొనుగోలు చేయలేదు. అయితే దీనంతటికీ పృథ్వీ స్వయంకృతాపరాధమే అని ఎంసీఏ తేల్చింది. 'పృథ్వీషాకు ఎవరూ శత్రువులు లేరు. తనకు తానే శత్రువు. ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టులో అతను ఉన్నా కూడా 10 మందితోనే ఆడామనుకోవాలి. ఎందుకంటే షా మైదానంలో ఉన్నా లేనట్టే. అతడి దగ్గరికి బంతి వచ్చినా కూడా అతికష్టంగా దాన్ని అందుకోవడం కనిపించింది. బ్యాటింగ్ సమయంలోనూ బంతిని ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. ప్రాక్టీస్ సెషన్లకు డుమ్మా కొట్టేవాడు. రాత్రుళ్లు బయట తిరిగి ఉదయం 6 గంటలకు హోటల్ చేరేవాడు. సీనియర్లు కూడా అతడి ప్రవర్తన నచ్చక ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సెలెక్టర్లు ప్రభావితం చెందుతారనుకోవడం తప్పు' అని ఎంసీఏ అధికారి ఒకరు ఘాటుగా స్పందించాడు. హజారే ట్రోఫీకి ఎంపికవకపోవడంతో పృథ్వీ.. 'ఎన్ని పరుగులు చేసినా, సెలెక్టర్లకు నమ్మకం కలుగలేదా?' అని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నించడం తెలిసిందే.

టీనేజర్ కొన్‌స్టాస్‌కు చోటు

భారత్‌తో చివరి రెండు టెస్టులకు ఆసీస్ జట్టు



మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరిగే చివరి రెండు టెస్టులకు ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ జాబితాలో 19 ఏళ్ల టీనేజ్ సంచలనం సామ్ కొన్‌స్టాస్‌కు చోటు దక్కింది. దీంతో 71 ఏళ్ల తర్వాత ఆసీస్ టెస్టు జట్టులో బెర్త్ దక్కించుకున్న అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. 1953లో ఇయాన్ క్రెగ్ 17 ఏళ్ల వయస్సులో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడాడు. ఒకవేళ బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా అరంగేట్రం చేస్తే.. కమిన్స్ (2011లో 18 ఏళ్ల వయస్సులో) తర్వాత ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా నిలుస్తాడు. భారత్ 'ఎ'పై సామ్ అజేయంగా 73 రన్స్ చేయడంతో పాటు, పీఎం ఎలెవన్ జట్టు తరఫున సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇక తొలి రెండు టెస్టుల్లో విఫలమైన ఓపెనర్ మెక్‌స్వీనేపై వేటు పడింది. గాయపడిన పేసర్ హాజెల్‌వుడ్ స్థానంలో జే రిచర్డ్‌సన్ జట్టులోకి వచ్చాడు. కమిన్స్‌కు డిప్యూటీలుగా స్మిత్, హెడ్ వ్యవహరిస్తారు.

ఆస్ట్రేలియా జట్టు: కమిన్స్ (కెప్టెన్), హెడ్, ఖవాజా, స్మిత్, లబుషేన్, క్యారీ, ఎబాట్, బోలాండ్, ఇన్‌గ్లిస్, కొన్‌స్టాస్, లియోన్, మార్ష్, రిచర్డ్‌సన్, స్టార్క్, వెబ్‌స్టర్.



భారత టెస్టు జట్టు తొలిసారిగా ఆస్ట్రేలియాలో 1947/48లో పర్యటించింది. లాలా అమర్‌నాథ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన నాటి భారత జట్టు ఫొటోను శుక్రవారం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లోని లైబ్రరీలో ప్రదర్శించారు.

పాక్‌దే సిరీస్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ 81 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో ఇప్పటికే తొలి మ్యాచ్‌ను నెగ్గి పాక్.. మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే దక్కించుకుంది. గురువారం రాత్రి జరిగిన ఈ పోరులో ముందుగా పాక్ 49.5 ఓవర్లలో 329 రన్స్‌కు ఆలౌటైంది. రిజ్వాన్ (80), బాబర్ (73), గులామ్ (63) అర్ధసెంచరీలు సాధించారు. ఎంపాకకు నాలుగు, జాన్సెన్‌కు మూడు వికెట్లు లభించాయి. భారీ ఛేదనలో సఫారీలు 43.1 ఓవర్లలో 248 పరుగులకే కుప్పకూలారు. క్లాసెన్ (97) తృటిలో శతకం కోల్పోయాడు. షహీన్‌షాకు నాలుగు, నసీమ్ షాకు మూడు వికెట్లు దక్కాయి.

బిజినెస్

రూ.18.43 లక్షల కోట్లు హుష్ కాకి

మార్కెట్‌పై బిగిసిన బేర్ పట్టు.. 5 సెషన్లలో 4,100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: మార్కెట్లలో అమెరికన్ ఫెడ్ సృష్టించిన కల్లోలం ఆగలేదు. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల ప్రభావంతో వరుసగా ఐదో రోజు కూడా స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలు నమోదు చేశాయి. రిస్క్ తీసుకునేందుకు విముఖంగా ఉన్న ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలు సాగించారు. దీనికి తోడు ఎఫ్‌పీఐల నిధుల తరలింపు సైతం యధేచ్ఛగా కొనసాగింది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 1,176.46 పాయింట్లు దిగజారి 78,041.59 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1343.46 పాయింట్ల నష్టంతో 77,874.59 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. నిఫ్టీ 364.20 పాయింట్ల నష్టంతో 23,587.50 వద్ద క్లోజైంది. రెండేళ్ల కాల పరిమితిలో ఒక వారంలో ఈక్విటీ మార్కెట్‌కు ఏర్పడిన భారీ నష్టం ఇదే. బీఎస్ఈలో లిస్టయిన షేర్లలో 2,950 షేర్లు నష్టాల్లో ముగియగా 1,045 షేర్లు మాత్రం లాభపడ్డాయి. ఐదు రోజుల వరుస నష్టాల కారణంగా సెన్సెక్స్ 4,091.53 పాయింట్లు నష్టపోగా నిఫ్టీ 1,181 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ సంపద రూ. 18,43,121.27 కోట్లు తుడిచి పెట్టుకుపోయి రూ.4,40,99,217.32 కోట్లకు (5.18 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

- సెన్సెక్స్‌లోని 30 షేర్లలో జేఎస్ డబ్ల్యూ స్టీల్, నెస్లే, టైటాన్ మినహా మిగతా 27 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.43 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 2.11 శాతం నష్టపోయాయి.
- అన్ని రంగాల వారీ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. రియల్టీ ఇండెక్స్ భారీగా 4.07 శాతం నష్టపోయింది. పవర్ (3.55%), యంత్రపరికరాలు (3.02%), ఇండస్ట్రియల్స్ (2.67%), ఐటీ (2.51%), కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ (2.32%), సర్వీసెస్ (2.29%) నష్టపోయాయి.
- ఫెడ్ చీఫ్ వడ్డీ రేట్లపై ప్రకటించిన కఠిన వైఖరితో పాటు అమెరికా అధ్యక్షుడుగా పగ్గాలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ తాను అనుసరించనున్న ఆర్థిక, వాణిజ్య విధానాలపై ప్రకటించిన అభిప్రాయాల ఫలితంగా డాలర్ నిరంతరం బలపడుతూ రావడం కూడా మార్కెట్‌ను కుంగదీస్తోందని విశ్లేషకులంటున్నారు. దీంతో విదేశీ ఇన్వెస్టర్లు స్థానిక మార్కెట్ నుంచి వైదొలగి డాలర్ ఆస్తుల్లో తమ సొమ్ము ఇన్వెస్ట్ చేస్తున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు గురువారం రూ.4224.92 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు.



తగ్గిన ఫారెక్స్ నిల్వలు

డిసెంబరు 13వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 198.8 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 65,286.9 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి. రూపాయి ఆటుపోట్లను తగ్గించేందుకు ఆర్‌బీఐ మార్కెట్‌లో జోక్యం చేసుకుంటుండడంతో గత కొద్ది వారాలుగా విదేశీ మారక నిల్వలు తగ్గుతూ వస్తున్నాయి. సెప్టెంబరులో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు 112.1 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 6805.6 కోట్ల డాలర్లకు చేరాయి.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ రూ.40 కోట్ల సేకరణ

పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తున్న హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్.. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ విధానంలో అమన్సా ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ నుంచి రూ.40 కోట్లు ప్రీ ఐపీఓ ఫండింగ్‌గా సమీకరించింది. ఒక్కో షేరు రూ.140 ధరపై అమన్సాకు 28.57 లక్షల ఈక్విటీ షేర్లు జారీ చేసింది. ఫార్మా, కెమికల్ పరిశ్రమలకు స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాలు తయారుచేసే స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ ఐపీఓకి అక్టోబరులో సెబీ అనుమతి లభించింది.

గ్రాన్యూల్స్ ఇండియాలో ఫిడెలిటీ వాటా విక్రయం

గ్రాన్యూల్స్ ఇండియాలో ఫైనాన్షియల్ సేవల సంస్థ ఫిడెలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ 1.32 శాతం వాటాను రూ.191 కోట్లకు విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ వాటాలను విక్రయించింది. తన అనుబంధ విభాగాలైన ఫిడెలిటీ ఇండియా ఫండ్, డెన్‌డాన ఇన్వెస్ట్ మారిషస్, ఫిడెలిటీ ఫండ్స్- ఇండియా ఫోకస్ ఫండ్.. గ్రాన్యూల్స్ ఇండియాలో 1.32 శాతానికి సమానమైన 32 లక్షల షేర్లను విక్రయించాయి. సగటున ఒక్కో షేరును రూ.596కి ఈ సంస్థలు విక్రయించాయి.

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ టెక్నాలజీ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ వాన్‌గార్డ్.. భారత్‌లో తొలి టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ సెంటర్ అందుబాటులోకి వస్తుందని తెలిపింది. అయితే ఈ కేంద్రానికి సంబంధించిన పెట్టుబడులు, ఎంతమంది ఉద్యోగులను నియమించుకుంటుందనే విషయాలను మాత్రం వాన్‌గార్డ్ వెల్లడించలేదు. వాన్‌గార్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డివిజన్ అధికారిగా ఉన్న వెంకటేష్ నటరాజన్ మాత్రం హైదరాబాద్ కేంద్రం అధిపతిగా వ్యవహరించనున్నారని కంపెనీ తెలిపింది. 1975లో కార్యకలాపాలు ప్రారంభించిన వాన్‌గార్డ్ ప్రపంచవ్యాప్తంగా 5 కోట్లకు పైగా క్లయింట్లకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్, సలహా సేవలు అందిస్తోంది.

ఎంటార్ టెక్‌కు రూ.226 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ విభాగాల్లో రూ.226 కోట్ల విలువైన ఆర్డర్లను అందుకున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఎంటార్ టెక్నాలజీస్ వెల్లడించింది. క్లీన్ ఎనర్జీ విభాగంలో బ్లూమ్ ఎనర్జీ నుంచి రూ.191 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకోగా రఫేల్, ఐఎంఐ సిస్టమ్స్, ఐఏఐ సహా ఏరోస్పేస్ రంగంలోని పేరొందిన కంపెనీల నుంచి రూ.35 కోట్ల విలువైన ఆర్డర్లను అందుకున్నట్లు తెలిపింది. ఏడాది కాలంలో ఈ ఆర్డర్లను పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొంది. రానున్న రోజుల్లో ఈ విభాగాల నుంచి మరిన్ని ఆర్డర్లను అందుకోవచ్చని భావిస్తున్నట్లు ఎంటార్ టెక్నాలజీస్ తెలిపింది.

పెరిగిన కొబ్బరి కనీస మద్దతు ధర

న్యూఢిల్లీ: వచ్చే 2025 సీజన్‌కు కొబ్బరి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను కేంద్ర ప్రభుత్వం రూ.12,100కు పెంచింది. ఈ సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.422 ఎక్కువ. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కొత్త ఎంఎస్‌పీ ప్రకారం క్వింటా ఎండు కొబ్బరి చిప్పల (మిల్లింగ్ కోప్రా) ధరను రూ.11,160 నుంచి రూ.11,582కు, కురిడీల (బాల్ కోప్రా) ధరను రూ.12,000 నుంచి రూ.12,100కు పెంచినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఈ నిర్ణయంతో కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లోని కొబ్బరి రైతులకు మేలు జరగనుంది.

గూగుల్‌లో మరిన్ని ఉద్యోగాల కోత

న్యూయార్క్: అమెరికా టెక్ కంపెనీల్లో కొలువుల కోత కొనసాగుతోంది. అంతర్జాతీయ సెర్చ్ ఇంజన్ దిగ్గజం 'గూగుల్' తన ఉన్నతోద్యోగుల్లో 10 శాతం మందిని ఇంటికి పంపిస్తోంది. వీరంతా మేనేజర్లు, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ల స్థాయిలో ఉన్న ఉన్నతోద్యోగులని సమాచారం. గూగుల్ కంపెనీ ఉద్యోగాల్లో కోత పెట్టడం ఈ సంవత్సరం ఇది మూడోసారి. ఈ ఏడాది జనవరి, జూన్‌లోనూ కంపెనీ అనేక వందల మందిని ఇంటికి పంపించింది. ఓపెన్ ఏఐ నుంచి ఎదురవుతున్న పోటీని దృష్టిలో ఉంచుకుని గూగుల్ ఈ చర్య తీసుకున్నట్టు భావిస్తున్నారు.

వాక్‌మేట్ ప్రచారకర్తగా సంజు శ్యాంసన్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): పాదరక్షల తయారీ సంస్థ వాక్‌మేట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్.. అంతర్జాతీయ క్రికెటర్ సంజు శ్యాంసన్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది. ఒకప్పుడు దేశీయ కంపెనీగా ఉన్న వాక్‌మేట్ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లోకి తన కార్యకలాపాలను విస్తరించిందని సంస్థ డైరెక్టర్ రోషన్ బాస్టియన్ వెల్లడించారు. సంజు శ్యాంసన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకోవటంతో వాక్‌మేట్ వినియోగదారులకు మరింత చేరువ కానుందని ఆయన పేర్కొన్నారు. పాదాలకు స్వాంతన చేకూర్చే విధంగా కంపెనీ ఎర్గోనామిక్ ఇన్‌సోల్ టెక్నాలజీతో కూడిన పాదరక్షలను తీసుకువచ్చిందని రోషన్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అనువైన పాదరక్షలను తీసుకురావటంలో వాక్‌మేట్ కీలకంగా ఉందన్నారు.

బజాజ్ చేతక్ ఈ-స్కూటర్ కొత్త వెర్షన్



న్యూఢిల్లీ: చేతక్ బ్రాండ్ విద్యుత్ స్కూటర్‌లో "35 సిరీస్"ను బజాజ్ ఆటో శుక్రవారం విడుదల చేసింది. ఇది మూడు వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది. వీటిలో 3501, 3502 వేరియెంట్ల ధర (బెంగళూరు ఎక్స్‌షోరూమ్) రూ.1.27 లక్షలు, 1.20 లక్షలు ఉంటుంది. మూడో వెర్షన్ 350 వేరియెంట్ ధర తదుపరి ప్రకటించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. వీటిలో 3501 డెలివరీ డిసెంబరు చివరిలోను, 3502 డెలివరీ జనవరిలోను ప్రారంభమవుతుందని తెలిపింది.

హోండా కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: కంపెనీకి చెందిన వివిధ కార్ల ధరలు 2 శాతం వరకు పెంచనున్నట్టు హోండా కార్స్ ఇండియా ప్రకటించింది. జనవరి నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. పెరిగిన ముడి సరుకు ధరల ప్రభావం తగ్గించుకునేందుకు ధరల పెంపు తప్పలేదని పేర్కొంది. ఈ కంపెనీ అమేజ్, సిటీ, ఎలివేట్ కార్లను మార్కెట్లో విక్రయిస్తోంది.

భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో మారుతి ఎలక్ట్రిక్ విటారా ఆవిష్కరణ



న్యూఢిల్లీ: కంపెనీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారాను ప్రవేశపెట్టడంతో పాటు సమాంతరంగా చార్జింగ్ స్టేషన్లు, హోమ్ చార్జింగ్ సొల్యూషన్లు అందుబాటులోకి తెస్తామని దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ప్రకటించింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరించనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇది ప్రపంచ మార్కెట్ల కోసం భారత్‌లో తయారైన గ్లోబల్ మోడల్ అని పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహించాలంటే కస్టమర్లకు బ్యాటరీ విద్యుత్ వాహన యాజమాన్యాన్ని సరళం చేయాలన్నది తమ అభిప్రాయమని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు. సరైన చార్జింగ్ మౌలిక వసతులు లేకపోవడమే ఈవీ వినియోగానికి పెద్ద అవరోధమని ఆయన అన్నారు. అధిక శాతం కస్టమర్లకు ఈవీలు అందుబాటులో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నది తమ ఆలోచన అని చెప్పారు.

ఎస్ఎంఈల లిస్టింగ్ మరింత కఠినం

న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎస్ఎంఈ) షేర్ల లిస్టింగ్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మరింత కఠినం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చే ఎస్ఎంఈ కంపెనీ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించే నాటికి తప్పనిసరిగా గత మూడేళ్లలో వరుసగా రెండేళ్ల పాటు కనీసం రూ.కోటి స్థూల లాభాలు ఆర్జిస్తూ ఉండాలి. అలాగే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రమోటర్లు, లేదా ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు విక్రయించే షేర్లు.. మొత్తం ఇష్యూలో 20 శాతం మించకూడదు. వీటికి తోడు ప్రమోటర్లు లేదా వారి గ్రూప్ కంపెనీలు లేదా వారికి సంబంధించిన సంస్థల రుణాలు చెల్లించేందుకు జారీ చేసే ఎస్ఎంఈల ఐపీఓలను అనుమతించరు. సెబీ ఈ ప్రతిపాదనలకు సూత్రప్రాయ ఆమోద ముద్ర వేసిన మరుసటి రోజే ఎన్ఎస్ఈ, వాటి అమలుకు చర్యలు తీసుకోవడం విశేషం. ఈ నెల 19 నుంచే ఈ కొత్త లిస్టింగ్ నిబంధనలు అమల్లోకి వచ్చినట్లు ఎన్ఎస్ఈ తెలిపింది. రిటైల్ మదుపరుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్టు ఎన్ఎస్ఈ తెలిపింది.

- ఇంటర్నేషనల్ జెమ్మాలాజికల్ ఇన్‌స్టిట్యూట్ షేర్లు లిస్టింగ్ రోజున 13% లాభపడ్డాయి. శుక్రవారం ఇష్యూ ధర రూ.417పై బీఎస్ఈలో 21% లాభంతో రూ.504.85 వద్ద లిస్టింగైన ఈ షేరు ఇంట్రాడేలో రూ.525 స్థాయిని తాకి చివరకు 12.74% లాభంతో రూ.470.15వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▲	70,400 ▲	98,000 ▼
విజయవాడ	78,000 ▼	71,500 ▼	90,000 ▼
విశాఖపట్నం	75,940 ▼	69,610 ▼	86,770 ▼
రాజమండ్రి	76,800 ▼	70,400 ▼	88,200 ▼
ప్రొద్దుటూరు	78,150 ▼	72,410 ▼	88,800 ▲
ముంబై	75,377 ▼	69,045 ▼	85,133 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ

హైదరాబాద్	570	విజయవాడ	600
వరంగల్	572	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600

డజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	102
కరీంనగర్	91	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	85
కర్నూలు	91	నెల్లూరు	85
విశాఖపట్నం	108	అనంతపురం	85
గోదావరి	99		

30 వరకు కేటీఆర్‌ను

అరెస్ట్ చేయొద్దు

- ఫార్ములా-ఈ రేసు కేసులో హైకోర్టు ఆదేశం
- క్వాష్ పిటిషన్‌పై విచారణ 27కు వాయిదా



హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏ1గా ఉన్న తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయరాదంది. కేసును యథావిధిగా దర్యాప్తు చేసుకోవచ్చంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కౌంటర్ దాఖలు చేయాలంటూ ఏసీబీకి, మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్‌కు నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ పిటిషన్ జస్టిస్ ఎస్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట శుక్రవారం విచారణకు వచ్చింది. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఉదయం 10.30 గంటలకు కేటీఆర్ తరపు న్యాయవాదులు ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు కోరారు. లంచ్ మోషన్ రూపంలో అత్యవసర విచారణకు ధర్మాసనం అనుమతించింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం కేటీఆర్ తరపున వాదనలు ప్రారంభించారు. కేవలం రాజకీయ, వ్యక్తిగత కుట్ర కారణంగానే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు, దేశంలోనే ఫార్ములా-ఈ రేస్ నిర్వహించిన తొలి నగరంగా నిలిపేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేసింది. అందులో భాగంగానే మూడు పక్షాల మధ్య మొదటి ఒప్పందం జరిగింది. 9వ సీజన్ తర్వాత 10వ సీజన్ నిర్వహించే నాటికి స్పాన్సర్ వెనక్కి తగ్గడంతో రూ.కోట్లు వెచ్చించి చేసిన ఏర్పాట్లు వృథా కారాదని, ఫార్ములా రేస్ నిర్వహించిన అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ గుర్తింపు పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే స్పాన్సర్‌గా ముందుకొచ్చి రెండో ఒప్పందం చేసుకుంది. పిటిషనర్ వ్యక్తిగతంగా లబ్ధి పొందినట్లు, నిధులు దుర్వినియోగం చేసినట్లు ఎక్కడా లేదు. ఏమైనా విభేదాలు ఉంటే ఒప్పందంలో ఆర్బిట్రేషన్ క్లాజ్ ఉంది. కాబట్టి ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు ఎఫ్ఐఆర్‌లో లేదు. ప్రభుత్వానికి అంత చిత్తశుద్ధి ఉంటే ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థను ఎందుకు నిందితుల జాబితాలో చేర్చలేదు? ఆ సంస్థ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టులో కేసు వేసింది. ఇది ఒక చట్టబద్ధమైన ఒప్పందం. దీనికి సంబంధించి వ్యక్తులకు క్రిమినల్ లయబిలిటీ అంటగట్టడం సరికాదు. రాజకీయ కుట్రతో నమోదైన కేసులో పిటిషనర్ అరెస్ట్ సహా అన్ని ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వాలి' అని పేర్కొన్నారు.

కేటీఆర్ పాత్ర ఏంటనేది దర్యాప్తులో తేల్చుతాం: ఏజీ

అసలు జరగని ఒప్పందానికి ముందే చెల్లింపులు చేశారని.. ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా, రెగ్యులేటరీ అనుమతులు లేకుండా చెల్లింపులు చేశారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం, ఏసీబీ తరఫున హాజరైన అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 'ప్రాథమిక దర్యాప్తు జరగలేదని పిటిషనర్ చేస్తున్న ఆరోపణ తప్పు. అక్టోబరు 18న ప్రభుత్వం ఫిర్యాదు చేస్తే, దర్యాప్తు అధికారి ప్రాథమిక దర్యాప్తు చేసిన తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రాథమిక కేసు లేదని ఆరోపిస్తున్నారు. అదీ నిజం కాదు. విదేశీ సంస్థకు చెల్లింపులు చేయడంలో తీవ్రమైన ఉల్లంఘనలు జరిగాయి. స్పాన్సర్ వెళ్లిపోయిన తర్వాత రెండో ఒప్పందం జరగడానికి ముందే చెల్లింపులు చేశారు. దీన్నిబట్టి పిటిషనర్‌కు దురుద్దేశం ఉన్నట్లే. రూ.55 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. డబ్బును విదేశీ మారకంలో చెల్లించారు. ఎవరు నిందితులు? కేటీఆర్ పాత్ర ఏంటి? ఎవరు లబ్ధిదారులు? అనేది దర్యాప్తులో తేలుతుంది. అన్ని విషయాలు చార్జిషీట్‌లో ఉంటాయి. చెల్లింపుల్లో తీవ్రమైన ఉల్లంఘనలు, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా జరిగినట్లు ఎఫ్ఐఆర్ నిరూపిస్తోంది. గవర్నర్ అనుమతి సైతం ఉంది. ఈ దశలో జోక్యం చేసుకోవడం వల్ల దర్యాప్తుకు తీవ్ర విఘాతం కలుగుతుంది' అని ఏజీ పేర్కొన్నారు.

కేటీఆర్‌పై ఈడీ కేసు

- పీఎంఎల్ఏ, ఫెమా చట్టం కింద నమోదు
- ఒకటి రెండు రోజుల్లో నోటీసులు

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా కేసు నమోదు చేసింది. కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ అధికారులు కేసు పెట్టారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ), విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద కేటీఆర్ తదితరులపై ఈడీ అధికారులు 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్)' నమోదు చేశారు. ఇప్పటికే ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు పత్రాలను, పురపాలక శాఖ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ప్రతులను తమకు పంపించాలని ఏసీబీకి ఈడీ అధికారులు శుక్రవారం లేఖ రాశారు. ఏసీబీ కేసు ఫైల్ సాయంత్రానికి ఈడీ కార్యాలయానికి చేరింది. దీంతో ఈసీఐఆర్ నమోదు చేశారు. ఇందులోనూ కేటీఆర్‌ను ఏ1గా పేర్కొన్నారు. అర్వింద్‌కుమార్‌ను ఏ2గా, బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా చూపారు. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు సుమారు రూ.46 కోట్లను డాలర్ల రూపంలో పంపడంపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించనుంది. కాగా, విచారణకు హాజరు కావాలంటూ కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డికి ఈడీ అధికారులు ఒకటి రెండు రోజుల్లో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఈ కేసుపైనా కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

అమరావతికి ఆరేళ్లు నిధులు!

రాజధానికి 13,592 కోట్ల రుణం

- ప్రపంచ బ్యాంకు నుంచి 6,796 కోట్లు
- ఆసియా అభివృద్ధి బ్యాంకు 6,796 కోట్లు
- ఆరేళ్లపాటు విడతల వారీగా నిధుల రాక
- రుణ షెడ్యూల్‌ను ఇచ్చిన ప్రపంచ బ్యాంకు
- సీఆర్‌డీఏ కమిషనర్‌కు చేరిన షెడ్యూల్
- జనవరిలో తొలి విడతగా రూ.348 కోట్లు
- లక్ష్యాలు నిర్దేశించిన ప్రపంచ బ్యాంకు
- వీటికి అనుగుణంగా సర్కారు ప్రణాళికలు
- రాజధాని టెండరు నిబంధనల పరిశీలన
- పనులనూ పర్యవేక్షించనున్న ప్రపంచ బ్యాంకు



విజయవాడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధి రథ చక్రాలు పరుగులు పెట్టనున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సొమ్ములు భారీ మొత్తంలో అందనున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)లు ఏకంగా రూ.13,592 కోట్ల(1600 మిలియన్ డాలర్లు) పైచిలుకు మొత్తాన్ని రుణంగా అందించేందుకు సిద్ధమయ్యాయి. దీనిలో ప్రపంచ బ్యాంకు రూ.6,796 కోట్లు, ఏడీబీ మరో రూ.6,796 కోట్లు ఇవ్వనున్నాయి. ఈ మొత్తాన్ని ఆరేళ్లలో విడతలవారీగా అందించేందుకు బ్యాంకులు సిద్ధమయ్యాయి. దీనికి సంబంధించి ప్రపంచ బ్యాంకు శుక్రవారం రుణ షెడ్యూల్‌ను విడుదల చేయడంతోపాటు కొన్ని లక్ష్యాలను కూడా నిర్దేశించింది. ఈ మొత్తం నిధులను అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధి ప్రాజెక్టులకు వెచ్చించాలని స్పష్టం చేసింది. తొలి విడత రుణం కింద రూ.348.33 కోట్లను జనవరి నెలాఖరు నాటికి సీఆర్‌డీఏకు అందించనున్నారు. ప్రపంచబ్యాంకు ఇచ్చే రుణాన్ని ఆరేళ్ల కాల పరిమితితో(2025-31) ఇవ్వటానికి అంగీకరించినట్టు ఆ సంస్థ రీజనల్ డైరెక్టర్ మార్టిన్ రైజర్, సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌కు రాసిన లేఖలో స్పష్టం చేశారు.

ఈ రుణానికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ఆయన పంపించారు. ఈ మొత్తాన్ని ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్(ఐబీఆర్‌డీ) విభాగం ద్వారా ప్రపంచబ్యాంకు అందిస్తోంది. మరోవైపు ఏడీబీ కూడా రూ.6,796 కోట్లను ఇంతే కాలపరిమితితో ఇచ్చేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. అయితే, ఎప్పుడెప్పుడు ఎంతెంత రుణం ఇస్తుందన్న సమాచారం తెలియాల్సి ఉంది. [illegible] రుణం డిసెంబరు 19, 2024 నుంచి అమలులోకి రానుంది. తాము ఇచ్చే రుణాన్ని ఫలితం ఆధారిత రుణం(ఆర్‌బీఎల్) విధానంలో ఇస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు కొన్ని లక్ష్యాలను కూడా పేర్కొంది. ఆ లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాల్సి ఉంటుంది. ఈ ఫలితాల సాధనను బట్టి తదుపరి రుణ మొత్తాన్ని ఇవ్వనున్నారు. కాగా, రుణానికి సంబంధించిన కొన్ని షరతులు కూడా ఉన్నాయి. వాటిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రపంచబ్యాంకు నిర్దేశించిన లక్ష్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వీయ లక్ష్యాలను నిర్దేశించుకుంది. వీటిని అతిత్వరగా సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇదిలా వుంటే.. అమరావతి నిర్మాణంలో భాగంగా సీఆర్‌డీఏ త్వరలో పిలవనున్న టెండర్ల ప్రక్రియను ప్రపంచ బ్యాంకు బృందం కూడా పరిశీలించింది. టెండర్ల నిబంధనలను సైతం ఈ బృందం అధ్యయనం చేసింది. టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటి నుంచి క్షేత్ర స్థాయిలో పనుల వరకు అన్నింటినీ ప్రపంచ బ్యాంకు బృందం పర్యవేక్షించనుంది.

ప్రపంచ బ్యాంకు రుణం అందేది ఇలా!

సంవత్సరం	అప్పు (రూ.కోట్లు)	డాలర్లు (మిలియన్)
2025-26	348.36	41
2026-27	849.68	100
2027-28	1,121.45	132
2028-29	1,571.74	185
2029-30	1,852.11	218
2030-31	1,053.50	128

ఇవీ ప్రపంచ బ్యాంకు లక్ష్యాలు

- సమర్థవంతమైన పౌర సేవలు. స్థానిక పరిపాలన.
- భూ పర్యవేక్షణ-ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట.
- మెరుగైన కొత్త ఉద్యోగాలను కల్పించటం.
- సుస్థిర రవాణా వ్యవస్థలను నెలకొల్పడం.

రాష్ట్ర ప్రభుత్వ స్వీయ లక్ష్యాలు ఇవీ..

- అమరావతిలో 2050 నాటికి 35 లక్షల మంది ప్రజలకు వసతి కల్పించేలా మౌలిక సదుపాయాలు.
- మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలో గృహాల నిర్మాణం.
- ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణకు నవీ ముంబై మోడల్ అనుసరణ.
- రాజధాని నగరాన్ని 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మించేలా మాస్టర్ ప్లాన్.
- వచ్చే ఐదేళ్లలో అమరావతిలో 50 వేల ఉద్యోగాల కల్పన.

రాష్ట్ర సర్కారు నుంచి కూడా

అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా 3,644 అమెరికన్ మిలియన్ డాలర్లు(రూ.30,957.67 కోట్లు) ఖర్చు అవుతుందని ప్రపంచ బ్యాంకు, ఏడీబీలకు నివేదించింది. ఈ మొత్తంలో ఆపరేషనల్ కాస్ట్ 1,784 మిలియన్ డాలర్లుగా నిర్ణయించింది. దీనిలో 1600 మిలియన్ డాలర్లను ఇచ్చేందుకు సంస్థలు సిద్ధమయ్యాయి. మిగిలిన 184 అమెరికన్ మిలియన్ డాలర్ల(రూ.1563.15 కోట్లు)ను సీఆర్‌డీ ఏ, ఏడీసీలు భరించాల్సి ఉంటుంది. వీటికి అంత ఆర్థిక పరిపుష్టి లేదు కాబట్టి ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కేటాయించాల్సి ఉంటుంది.

ఎల్పీజీ ట్యాంకర్ మంటల్లో 11 మంది మృతి

- 41 మందికి తీవ్రగాయాలు.. పలువురి పరిస్థితి విషమం.. పలు వాహనాలు దగ్ధం
- రాజస్థాన్‌లో జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

జైపూర్, డిసెంబరు 20 : రాజస్థాన్‌లో జైపూర్-అజ్మీర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. మంటల్లో చిక్కుకున్న ఎల్పీజీ ట్యాంకర్ వల్ల పలు వాహనాలకు ఆ మంటలు వ్యాపించి అవన్నీ దగ్ధం అవడమే కాక వాటిలో ఉన్న వారిలో 11 మంది మృత్యువాత పడ్డారు. మరో 41 మంది తీవ్ర గాయాలపాలవగా వారిలో సగం మంది పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు ఇంకా పూర్తిగా వెలుగు రాని సమయంలో ఎల్పీజీ ట్యాంకర్ మరో ట్రక్కును ఢీకొనడంతో దాని అవుట్‌లెట్ నాజిల్ పాడై గ్యాస్ లీకయ్యింది. లీకయిన గ్యాస్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఎల్పీజీ ట్యాంకర్ వెనుక ఉన్న పలు వాహనాలు మంటల్లో చిక్కుకున్నాయి. అలాగే జాతీయ రహదారిలో ముందు నుంచి వస్తోన్న వాహనాలూ మంటల్లో చిక్కుకోవడమేగాక ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. వాటిలో ఉన్న వారికి తప్పించుకొనే అవకాశం లేకుండాపోయింది. మంటల్లో చిక్కుకున్న వారు హాహా కారాలు చేస్తూ తమ వాహనాలు వదిలి అక్కడి నుంచి తప్పించుకొనే ప్రయత్నం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 25కుపైగా అంబులెన్సుల్లో జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ ఆస్పత్రికి తరలించారు. 20 అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నారు. జాతీయ రహదారిపై దాదాపు 300 మీటర్ల వరకు మంటల్లో చిక్కుకున్న వాహనాలు ఉండడంతో ట్రాఫిక్ స్తంభించింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సవాయ్ మాన్ సింగ్ ఆస్పత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జైపూర్ కలెక్టర్ జితేంద్ర సోని మాట్లాడుతూ.. ఈ ఘటనలో 41 మంది తీవ్రంగా గాయపడ్డారని, వారిని ఆస్పత్రికి తరలించినట్లు ప్రకటించారు. దాదాపు 40 వాహనాలు మంటల్లో చిక్కుకున్నాయని చెప్పారు. మంటలు అదుపులోకి వచ్చాయని తెలిపారు. కాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజస్థాన్ గవర్నర్ హరిభావు బగాడే ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ.. మృతులకు సంతాపం ప్రకటించారు. రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం మృతి చెందిన వారి కుటుంబాలకి రూ. 5 లక్షల సహాయం, గాయపడిన వారికి రూ. లక్ష సహాయం ప్రకటించింది. ప్రధాని మోదీ మృతి చెందిన వారికి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

నవ్య | చిత్రజ్యోతి

స్టైలిష్ లుక్‌లో సోహైల్‌ఖాన్



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఎన్‌కేఆర్ 21' (వర్కింగ్ టైటిల్). ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. కల్యాణ్‌రామ్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ సోదరుడు సోహైల్ ఖాన్ ఈ చిత్రంతో నటుడిగా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఈవిల్లోర్ అనే విలన్ పాత్రలో ఆయన కల్యాణ్‌రామ్‌తో తలపడనున్నారు. శుక్రవారం సోహైల్ ఖాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. నల్లటి దుస్తుల్లో స్టైలిష్ లుక్‌లో సోహైల్‌ఖాన్ కనిపించారు. ఈ చిత్రంలో విజయశాంతి, సాయీ మంజ్రేకర్, శ్రీకాంత్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: రామ్ ప్రసాద్.

భావోద్వేగానికి గురయ్యా



'ఎన్నో గొప్ప చిత్రాలను, గట్టి పోటీని తట్టుకుని అవార్డుని దక్కించుకున్నందుకు నాకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. అభిమానుల ప్రేమకు భావోద్వేగానికి గురయ్యా' అని ఆనందం వ్యక్తం చేశారు నటి సాయిపల్లవి. చెన్నైలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'అమరన్' చిత్రానికి ఉత్తమ నటిగా సాయిపల్లవి, 'మహారాజ' చిత్రానికి ఉత్తమ నటుడిగా విజయ్ సేతుపతి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా సాయిపల్లవి స్పందిస్తూ 'ముకుంద్ కుటుంబ సభ్యుల వల్లే ఇది సాధ్యమైంది. ఈ కథను ప్రపంచానికి చెప్పడానికి వాళ్లు అంగీకరించడం వల్లనే 'అమరన్' చిత్రాన్ని రూపొందించగలిగాం' అని వివరించారు. కాగా, 'మహారాజ'ను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు విజయ్ సేతుపతి.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



యుగంధర్ ముని దర్శకత్వంలో ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'శంబాల'. అర్చన అయ్యర్ కథానాయిక. భారీ బడ్జెట్‌తో రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. ఎవరూ టచ్ చేయని పాయింట్, కథతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొందిన యుగంధర్ ముని ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామ్ మద్దూరి సంగీతాన్ని అందిస్తున్నారు. శ్వాసిక, రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

వస్తుండాయి పీలింగ్స్

అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావా.. ఉహూ అంటావా' పాటతో నూతన గాయని ఇంద్రావతి చౌహాన్‌ని పరిచయం చేసిన సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ 'పుష్ప 2' సినిమాతో మరో కొత్త గాయనికి అవకాశం ఇచ్చారు. ఈ సినిమాలోని 'వస్తుండాయి పీలింగ్స్' అనే పాట పాడిన గాయని పేరు దాస లక్ష్మి. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం గన్నోర గ్రామానికి చెందిన ఈ జానపద గాయని చిన్నప్పటి నుంచి తల్లి జయశీల పాడే మరాఠీ కీర్తనలు, మరాఠీ పాటలు అనుకరిస్తూ తెలుగులో ఫోక్ సాంగ్స్ పాడుతుండేది. ఆమె ప్రతిభను గమనించిన ఆ



గ్రామానికి చెందిన కళాకారుడు దిగంబర్ పాటలలో మెళకువలను నేర్పించారు. అవకాశం దొరినప్పుడల్లా రకరకాల ప్రోగ్రామ్స్‌లో పాటలు పాడిన దాస లక్ష్మి యూట్యూబ్ వల్ల ఎంతో పాపులర్ అయింది. ఆమె పాడిన దాదాపు 700కి పైగా జానపద గీతాలు యూ ట్యూబ్ ద్వారా సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. టాలెంట్ ఉన్న కొత్తవారికి అవకాశాలు ఇచ్చే దర్శకుడు సుకుమార్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ 'పుష్ప 2' లో దాస లక్ష్మికి అవకాశం ఇచ్చారు. ఆమె పాడిన 'వస్తుండాయి పీలింగ్స్' పాట వైరల్ కావడంతో దాస లక్ష్మి పేరు తెలుగు రాష్ట్రాల్లో మారుమోగుతోంది. నిర్మల్ జిల్లా జానపద గాయకురాలికి ఇలా సినిమాలో పాట పాడే అవకాశం రావడం.. అది హిట్ కావడంతో లక్ష్మిని జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

ముథోల్ (ఆంధ్రజ్యోతి)

నా పాత్ర ప్రేక్షకులను మెప్పిస్తుంది

- ఐశ్వర్య శర్మ



ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఐశ్వర్యశర్మ మీడియాతో పంచుకున్నారు. 'నటనలో శిక్షణ తీసుకున్నాక కొన్ని వాణిజ్య ప్రకటనల్లో నటించాను. నటిగా 'డ్రింకర్ సాయి' నాకు తొలి చిత్రం. నేను చేసిన బాగీ పాత్రకు ప్రేక్షకులంతా కనెక్ట్ అవుతారు. ఇందులో వైద్య విద్యార్థినిగా కనిపిస్తాను. రెగ్యులర్ హీరోయిన్ రోల్స్‌కు భిన్నంగా నా పాత్ర ఉంటుంది. ట్రైలర్ చూసి కొంతమంది 'అర్జున్‌రెడ్డి' సినిమాతో పోలిక తెచ్చారు కానీ మా 'డ్రింకర్ సాయి' కథ పూర్తి భిన్నంగా ఉంటుంది. కథా బలమున్న చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నందుకు ఆనందంగా ఉంది. తెలుగు అమ్మాయిని కాకపోవడంతో సెట్‌లో సంభాషణలు పలికేందుకు కొంత ఇబ్బందిపడ్డాను. హీరో ధర్మ, దర్శకుడు కిరణ్ నాకు సాయం చేశారు. నా నటన సహజంగా ఉండేలా చూసుకునేందుకు చాలా శ్రమించాను. 'డ్రింకర్ సాయి' చిత్రంతో ఒక మంచి ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. అలాగే మంచి సందేశం కూడా ఈ సినిమాలో ఉంది' అని అన్నారు.

తండ్రి తీర్పు సిద్ధం



కుటుంబ విలువలు, తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మించారు. ఈ చిత్రంతో వివారెడ్డి హీరోగా పరిచయమవుతున్నాడు. శుక్రవారం చిత్ర బృందం విడుదల తేదీని ప్రకటించింది. ఈ నెల 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఒక మంచి కుటుంబ కథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నందుకు ఆనందంగా ఉంది. తల్లితండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న కొడుకులకు కనువిప్పు కలిగించేలా మా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈచిత్రానికి సంగీతం: మధు బాపు శాస్త్రి. సినిమాటోగ్రఫీ: సురేశ్ చెటిపల్లి

కొత్తగా..

గ్రామీణ ప్రేమకథ



చంద్రహాస్ కథానాయకుడిగా సంపత్ రుద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. గెడాచందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మిస్తున్నారు. మేఘనా ముఖర్జీ కథానాయిక. అర్జున్ మహీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు వి.వి వినాయక్ చేతుల మీదుగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రహాస్ మాట్లాడుతూ 'తెలంగాణలోని రుద్రారం అనే ఊరి నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథను ఈ సినిమాలో చూపించబోతున్నాం. ధ్రువన్ సంగీతం అద్భుతంగా అలరిస్తుంది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు.

ఉద్యమ నేపథ్యం



తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'దక్కన్ సర్కార్'. కళా శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. చాణక్య, కియా రెడ్డి, మౌనిక హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. చిత్రబృందం టీజర్ విడుదల చేసి, పోస్టర్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కళా శ్రీనివాస్ మాట్లాడుతూ "దక్కన్ సర్కార్ ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని వెండితెరపైన ఆవిష్కరించే ప్రయత్నం చేశాం. పోరాటాలకు విరామం ఉండదని ఈ సినిమా ద్వారా చెప్పబోతున్నాం. త్వరలో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తాం' అని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నారెడ్డి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ చెట్లు వేరే చోట నాటాల్సిందే

- అభివృద్ధి పనులకు అడ్డొస్తున్నాయని కొట్టేయడం సరికాదు
- ఈ విషయంపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేయండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలు, రహదారుల నిర్మాణం, విద్యుత్ లైన్లు ఏర్పాటు సమయంలో చెట్లను కొట్టి పడేయకుండా వాటిని వేరే చోట నాటే (ట్రాన్స్‌లోకేట్) విషయంలో అధ్యయనం చేసేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. చెట్లను వేరే చోట నాటేందుకు అవసరమైన యంత్రాలు అందుబాటులో లేవని చెప్పొద్దని స్పష్టం చేసింది. ఖర్చయినా సరే చెట్లను వేరే చోట నాటేందుకు ఓ విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని పేర్కొంది. విచారణను మార్చి 12కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. అభివృద్ధి పనులకు అడ్డొస్తున్నాయని నరికివేస్తున్న చెట్లను మరోచోట తిరిగి నాటేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గుంటూరుకు చెందిన వైద్య విద్యార్థి అస్మద్ మహ్మద్ షేక్ షా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది బషీర్ అహ్మద్ వాదనలు వినిపించారు. విచక్షణారహితంగా చెట్ల కొట్టివేయడం వల్ల పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటుందన్నారు. వాటిని వేరే చోట నాటేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందన్నారు.

వారి జీపీఎఫ్‌పై నిర్ణయం తీసుకోండి

- ఆర్థిక, ఇంధన శాఖల ముఖ్యకార్యదర్శులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోర్టుకు వచ్చిన విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపు చేసే విషయంలో నిబంధనలకు లోబడి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శులను హైకోర్టు ఆదేశించింది. జీపీఎఫ్ వర్తింపచేయాలా, ఈపీఎఫ్ స్కీం అమలుచేయాలా అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఏ స్కీం అమలు చేయాలనే విషయంలో ప్రభుత్వాన్ని ఆదేశించలేమని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. తమకు జీపీఎఫ్ అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న, రిటైరైన ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీరి తరఫున న్యాయవాది పీటా రామన్ వాదనలు వినిపించారు.

మారుమూల పశుపోషకులకూ సేవలందాలి

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల పశుపోషకులకు కూడా పశు సంవర్థక శాఖ సేవలు అందేలా చూడాలని ఆ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పశుసంవర్థకశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్ణీత వేళలో పశువులకు టీకాలు వేయాలని, గోకులంపథకం కింద ఉపాధి నిధులతో షెడ్లు నిర్మించాలని, బహువార్షిక పశు గ్రాసాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆ శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

ఏపీ తీరంలో 29.2 శాతం కోత

- కాకినాడ, కృష్ణా, నెల్లూరు, విశాఖల్లో ఎక్కువ
- వాతావరణంలో మార్పుల ప్రభావంతో పెరుగుతున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సముద్ర తీరం తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. సీజన్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు కోతకు గురవుతూనే ఉంది. గత మూడు దశాబ్దాల్లో ఇచ్ఛాపురం నుంచి తడ వరకూ గల 1011.7 కిలోమీటర్ల సుదూర తీరంలో 29.72 శాతం మేర కోతకు గురైంది. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సముద్ర అధ్యయన నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో తీరప్రాంత కోతపై నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ 1991 నుంచి 2021 వరకూ చేసిన అధ్యయనం వివరాలను కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం ఏపీలో 1101.7 కి.మీ. తీరంలో 29.72 శాతం కోతకు గురైంది. అత్యధికంగా 98.65 కి.మీ. (9.75 శాతం), మధ్యస్థంగా 64.75 కి.మీ. (6.4 శాతం), తక్కువగా 137.29 కి.మీ. (13.57 శాతం) తీరం కోతకు గురైంది. కాకినాడ, కృష్ణా, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువగా, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మధ్యస్థంగా తీరం తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. దాదాపు 42శాతం తీరంలో ఇసుకమేటలు వేశాయి. కళింగపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం రేవులకు దిగువ భాగంలో ఇసుక మేటలు ఎక్కువగా ఉన్నాయి. పోర్టుల నిర్మాణంలో భాగంగా 8.79 కి.మీ. మేర తీరంలో రక్షణ గోడలు నిర్మించారని కేంద్రం పార్లమెంటులో నివేదించింది.

తీర ప్రాంత రక్షణకు చర్యలు అవసరం

మూడు దశాబ్దాలుగా వాతావరణంలో అనూహ్య మార్పులు వచ్చాయి. వేడి పెరగడం, సుదీర్ఘ వేసవి, వర్షాల్లో అసమతుల్యం, కార్బన్ డయాక్సైడ్ పెరగడం, ప్లాస్టిక్ వినియోగం, నదులు,వాగుల ద్వారా వ్యర్థాలు సముద్రంలో కలవడం, రసాయన పరిశ్రమలు వ్యర్థాలను శుద్ధి చేయకుండా నేరుగా నదులు, సముద్రంలోకి వదిలేయడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇంకా అభివృద్ధి పేరిట పోర్టులు, తీరంలో రిసార్టులు, హోటళ్లు పెరుగుతున్నాయి. మరోవైపు మడ అడవులను ఇష్టానుసారంగా కొట్టేస్తున్నారు. వీటన్నింటికీ తోడు తుపాన్ల తీవ్రత పెరిగింది. ఈనేపథ్యంలో సముద్రం, తీరం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని విశాఖపట్నంలో ప్రాంతీయ సముద్ర అధ్యయన విజ్ఞాన కేంద్రం చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ పేర్కొన్నారు. కాకినాడ పరిసరాలు ఎక్కువగా ప్రభావానికి గురవుతున్నాయన్నారు. విశాఖ ఆర్కే బీచ్‌రోడ్డు ఎప్పటికప్పుడు కోతకు గురవుతుందన్నారు. తాజాగా నాలుగు రోజుల నుంచి బీచ్ రోడ్డు వైపు అలలు వస్తున్నాయన్నారు. శుక్రవారం ఆర్కే బీచ్‌కు దక్షిణ వైపు రక్షణ గోడ కూలిపోయిందన్నారు. తీర రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



విశాఖ ఆర్కే బీచ్‌లో గోకుల్ పార్కు వద్ద శుక్రవారం అలల ధాటికి కోతకు గురై కూలిన గోడ

ఉప్పాడలో అలల బీభత్సం.. కూలిన 30 ఇళ్లు

కొత్తపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సముద్ర తీరంలో రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. వీటి ప్రభావంతో సుమారు 30 మంది మత్స్యకారుల ఇళ్లు కూలిపోయాయి. ఉప్పాడ సూరాడపేటలో కెరటాల ఉధృతికి అంగన్‌వాడీ భవనం కుప్పకూలింది.

పార్శిల్‌లో మృతదేహం డెలివరీ

- పశ్చిమ గోదావరి జిల్లా యండగండిలో కలకలం
- ఇంటి నిర్మాణ సామగ్రి పంపిస్తున్నామంటూ ఫోన్
- ఆటోలో వచ్చిన చెక్క పెట్టె... అందులో మృతదేహం

ఉండి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'మీరు అడిగిన విధంగా మీ ఇంటి నిర్మాణానికి ఇప్పటికే టైల్స్, పెయింటింగ్ డబ్బాలు పంపించాం. మరి కొంత ఇంటి సామగ్రిని పంపిస్తున్నాం' అంటూ ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. చెప్పిన విధంగానే ఆటోలో ఓ చెక్క పెట్టె వచ్చింది. ఆ పెట్టెను ఆమె తెరవగా తీవ్రమైన దుర్వాసనతో కుళ్లిపోయిన ఓ మృతదేహం కనిపించింది. దానిని చూడగానే ఆమె కేకలు వేస్తూ పరుగులు తీశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండి గ్రామంలో జరిగిందీ ఘటన. ఆ మృతదేహం ఎవరిది? దానిని ఎవరు పంపించారు? ఇక్కడికే ఎందుకు పంపించారు? తదితర విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు యండగండికి చెందిన ముదునూరి రంగరాజుకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. పెద్ద కుమార్తె తులసిని నిడదవోలుకు చెందిన శ్రీనివాసరాజుకు ఇచ్చి పెళ్లి చేశారు. భర్తతో విభేదాల కారణంగా ఆమె కుమార్తెను తీసుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చేశారు. భీమవరంలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఆమె ఉద్యోగం సంపాదించి పాలకోడేరు మండలం గరగపర్రులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. యండగండిలో తులసికి జగనన్న కాలనీలో స్థలం వచ్చింది. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఇల్లు కట్టుకునేందుకు సాయం చేయాలని రాజమహేంద్రవరంలోని క్షత్రియ సేవా సమితికి దరఖాస్తు పెట్టుకున్నట్టు చెబుతున్నారు. దీంతో ఇంటికి అవసరమైన టైల్స్ పెయింటింగ్ డబ్బాలు రెండు విడతలుగా వచ్చాయి. ఇదే విషయాన్ని ఆమె వాట్సప్‌కు సమాచారం ఇచ్చారు. గురువారం తులసికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. మరింత సామగ్రిని పంపిస్తున్నట్టు అవతలి వ్యక్తులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ఒక చెక్క పెట్టెను ఆటోలో తీసుకువచ్చి ఇంటి వద్ద దించారు. చెక్క పెట్టెను తెరిచే ప్రయత్నం చేయగా, దానికి తాళం వేసి ఉంది. తాళం చెవితోపాటు ఒక లేఖను పెట్టెకు ఉన్న కవర్‌లో పెట్టారు. 'మీరు కోటీ 30 లక్షలు చెల్లించాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు' అని ఆ లేఖలో రాసి ఉంది. పెట్టె తెరవగానే దుర్వాసన గుప్పుమంది. లోపల పేపర్లు కప్పి ఉన్నాయి. వాటిని తొలగించి చూడగా, కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. తండ్రీకూతురు కేకలు వేస్తూ గ్రామంలోకి పరుగులు తీశారు. స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. పోలీసులు భారీ సంఖ్యలో గ్రామంలో మోహరించారు. 45 ఏళ్ల వయసున్న మగ వ్యక్తి మృతదేహంగా తేల్చారు. శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ నయీం అద్నాన్ అస్మి, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐలు నజీరుల్లా, మంతెన రవివర్మ, నాగరాజులతోపాటు పోలీసులు గ్రామంలో తనిఖీలు చేపట్టారు. రంగరాజు, తులసిని పోలీసు స్టేషన్‌లోనే ఉంచి విచారిస్తున్నారు. వారితో ఎవరినీ కలవనీయడం లేదు. ఫోన్‌లోనూ మాట్లాడనీయడం లేదు.



పార్శిల్‌లో వచ్చిన మృతదేహం

మరోవైపు పార్శిల్ తెచ్చిన ఆటోవాలాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పెట్టె ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఎవరు ఇచ్చారు? ఇక్కడికి తీసుకెళ్లమని ఎవరు చెప్పారు? తదితర వివరాలు రాబడుతున్నారు. అలాగే, రంగరాజు చిన్న కుమార్తె భర్త.. మొగల్తూరుకు చెందిన సిద్దార్థవర్మను పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకున్నట్లు తెలిసింది. అక్కడ నుంచి జిల్లాకు తీసుకొస్తున్నట్లు సమాచారం. పోలీసు బృందాలు భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. వరసపెట్టి అందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుంటుండడంతో అసలు ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. పోలీసులు వివరాలు చెప్పడం లేదు.

క్షత్రియ సేవా సమితి ఖండన..

క్షత్రియ సేవా సమితి నుంచి మృతదేహం పార్శిల్ వచ్చినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదంటూ రాజమండ్రికి చెందిన క్షత్రియ సేవా సమితి ఖండించింది. రాజమండ్రిలో క్షత్రియ సేవా సమితి తప్ప క్షత్రియ పరిషత్ అనేది లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. తమ సమితిలో సభ్యులుగా ఉన్న వారికి మాత్రమే ఆర్థికంగా సహాయం చేస్తామని, ఇతర ప్రాంతాల వారికి చేయబోమని వివరించింది. యండగండి ఘటనతో తమకు సంబంధం లేదని పేర్కొంది.



శిక్షణ పూర్తి చేసుకున్న రిజిస్ట్రార్లు, న్యాయవాదులతో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ ఎస్.జయసూర్య

మధ్యవర్తిత్వంపై హైకోర్టులో ముగిసిన శిక్షణ

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ విధానంలో వివాదాల పరిష్కారంపై హైకోర్టులో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ కమిటీ(ఎంసీపీసీ) మార్గదర్శకంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఈ నెల 16 నుంచి 20 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. హైకోర్టు రిజిస్ట్రార్లు, న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత, ఎగ్జిక్యూటివ్, 22 మంది హైకోర్టు న్యాయవాదులు శిక్షణకు హాజరయ్యారు. ఎంసీపీసీ కమిటీ సభ్యులు అనూజా సక్సేనా, సురేందర్ సింగ్ ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందినవారు పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారానికి తోడ్పడతారని ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత తెలిపారు.

సంక్షేమ కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

పలు సంక్షేమ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో కార్పొరేషన్‌కు 13 నుంచి 15 మందిని అనధికార డైరెక్టర్లుగా నియమించింది. ఆయా కార్పొరేషన్లకు ఇటీవలే ఛైర్మన్లను నియమించారు. వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సీఆర్ రాజన్, వాల్మీకి/బోయ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా కపత్రాల సుశీలమ్మ, కురుబ/కురుమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా దేవేంద్రప్ప, అగ్నికుల క్షత్రియ ఛైర్మన్‌గా చిలకలపూడి పాపారావు, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా పాలవలస యశస్వి, గవర కార్పొరేషన్ ఛైర్మన్‌గా మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పీవీజీ కుమార్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కుడిపూడి సత్తిబాబు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఆర్.సదాశివ, కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా రోణంకి కృష్ణం నాయుడు ఇటీవల నియమితులయ్యారు.



ఢిల్లీలో సదరన్ హోటల్స్ యజమాని ఆళ్లపాటి కృష్ణమోహన్‌తో కలిసి 'జాయిన్ టీడీపీ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కాలుష్యం తగ్గితేనే వాతావరణం మెరుగు

- రెవెన్యూ, విపత్తులశాఖ స్పెషల్ సీఎస్ సిసోడియా

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడకు ముప్పు పొంచి ఉందని, కాలుష్యం తగ్గితేనే వాతావరణం మెరుగుపడే అవకాశం ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అన్నారు. శుక్రవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా 'క్లైమేట్ ఫర్ ది స్టేట్ ఆఫ్ ఏపీ' పుస్తకాన్ని, 'ఐఎండీ అమరావతి' పేరుతో బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఐఎండీ డీజీ మహాపాత్ర, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. సిసోడియా ప్రసంగిస్తూ, 'తుపాన్లు వంటి విపత్తులను ముందుగానే గుర్తించి ఐఎండీ జారీ చేస్తున్న ముందస్తు హెచ్చరికలతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నిరోధించడానికి వీలవుతోంది. అయితే, మారిన వాతావరణ పరిస్థితులకు మానవ తప్పిదాలే కారణంగా కనిపిస్తోంది. వాతావరణం, పర్యావరణ పరిరక్షణ గురించి ఆలోచించకపోతే.. మానవ మనుగడ తల్లకిందులవుతుంది. వ్యక్తిగతంగా త్యాగాలు చేయకపోతే.. సామూహికంగా నష్టపోవాల్సి వస్తుంది' అని అన్నారు. ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర ప్రసంగిస్తూ, 'వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా రంగాల మనుగడైనా ఎక్కువగా వాతావరణంపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ప్రాణ ఆస్తుల నష్టం జరగకుండా వాతావరణ మార్పులను గమనించి, ఎప్పటికప్పుడు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విశ్లేషణాత్మకంగా, ఉత్తమ సమాచార సేవలు అందించడానికి ఐఎండీ కృషి చేస్తోంది' అని తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ రమేష్ శ్రీకొండ, చెన్నై ఆర్ఎంసీ సైంటిస్ట్ ఎస్. బాలచంద్రన్, ఐఎండీ అమరావతి సెంటర్ డైరెక్టర్ ఎస్ స్టెల్లా, ఇతర అధికారులు ప్రసంగించారు.

టెక్నాలజీతో మెరుగైన పౌర సేవలు

- ఏపీటీఎస్ ఛైర్మన్‌గా మన్నవ మోహనకృష్ణ బాధ్యతలు

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు మెరుగైన పాలన అందించవచ్చని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (ఏపీటీఎస్) ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. ఏపీటీఎస్ ఛైర్మన్‌గా శుక్రవారం ఆయన విజయవాడ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే సంస్థ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఏపీటీఎస్ ద్వారా అందిస్తున్న సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరికరాలను ప్రభుత్వ సంస్థలకు మరింత ఎక్కువగా సరఫరా చేయడం ద్వారా సంస్థకు అధిక ఆదాయాన్ని తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. సైబర్ అటాక్ నుంచి రక్షించుకునేందుకు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏఐని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఐటీని విస్తరించాలన్న సంకల్పంతో మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని, దేశీయ, విదేశీ ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వచ్చేలా కృషి చేస్తున్నారని ప్రశంసిస్తున్నారు.

నేటి నుంచి ఈ-ఆఫీస్ తాత్కాలికంగా నిలిపివేత

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిపాలనలో ఫైళ్ల కదలికలకు వాడుతున్న ఈ-ఆఫీసును 8 రోజులపాటు నిలిపి వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ ఆదేశాల మేరకు ఈ- ఆఫీస్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందని సాధారణ పరిపాలనశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 21 తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 28 వ తేదీ ఉదయం 11 గంటల వరకు నిలిపివేసి, అప్‌గ్రెడేషన్ చేయనున్నట్లు తెలిపింది. అన్నిశాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, ఈ 8 రోజులపాటు ఈ-ఆఫీస్‌కు ప్రత్యామ్నాయం చూసుకోవాలని ఆదేశించింది.

నదుల అనుసంధానానికి నిధులివ్వండి

- కరువు పీడిత జిల్లాలకు సహకరించండి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వినతి

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వార్షిక బడ్జెట్ రూపకల్పనపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి సంబంధించిన ప్రాధాన్యాలు, ఏయే ప్రాజెక్టులకు ఎన్ని నిధులు అవసరం అనే విషయాలను రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ ప్రతిపాదనల సమావేశానికి కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రంలో గోదావరి నది నుంచి ఏటా 2 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోంది. మరో వైపు అనంతపురం జిల్లాలో దేశంలోనే అతితక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణా, పెన్నా, వంశధార నదులను అనుసంధానించి వర్షాలు లేక అల్లాడుతున్న సీమ జిల్లాల ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. రాజస్థాన్‌లో 11 నదులను అనుసంధానించడానికి సాయం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది. ఈ క్రమంలో ఏపీలోనూ నదుల అనుసంధానానికి సహకరించాలి. రానున్న కేంద్ర బడ్జెట్‌లో నదుల అనుసంధాన ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి" అని పయ్యావుల కేశవ్ కోరారు.

90 శాతం మీరే భరించాలి!

"2024-25 కేంద్ర బడ్జెట్‌లో బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి కేంద్రం పూర్వోదయ ప్రాజెక్టును ప్రకటించింది. సాధారణంగా ఏపీకి ప్రకృతి విపత్తులు ఎక్కువ. కోస్తా ప్రాంతం తుఫాన్లతో, రాయలసీమ ప్రాంతం కరువుతో విలవిలలాడిపోతుంటాయి. దీనికి తోడు రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరగడంతో పారిశ్రామిక రంగం కుదేలైంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు, పెట్టుబడులు ఆకర్షించడానికి, పారిశ్రామిక రంగానికి ఊతమివ్వడానికి కేంద్రం ఆర్థిక తోడ్పాటును అందించాలి. దీనికిగాను పూర్వోదయ ప్రాజెక్టులో ఉన్న ఏపీకి కేంద్ర ప్రాయోజిత పథకాలకు అన్నింటికీ 90 శాతం నిధులు ఇవ్వాలి. అదేవిధంగా పీపీపీ ప్రాజెక్టులన్నింటికీ కేంద్రమే వయబులిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) భరించాలి. రోడ్లను అభివృద్ధి చేసేందుకు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సాయం చేయాలి. విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టు నిర్మాణంలో కూడా వీజీఎఫ్‌ను కేంద్రమే భరించాల"ని పయ్యావుల విన్నవించారు.



ఢిల్లీలో 2025-26 కేంద్ర వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

రూ.100 కోట్ల చొప్పున ఇవ్వండి

కరువు వల్ల ఎడారిగా మారిపోతున్న జిల్లాలకు జల్‌జీవన్ మిషన్, ఇతర ఇరిగేషన్ పథకాల ద్వారా కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిష్పత్తిలో నిధులు అందించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కోరారు. కృత్రిమ మేధ(ఏఐ), ఏవియేషన్ యూనివర్సిటీ, పునరుత్పాదక శక్తి వనరులపై పరిశోధనలు చేసే విశ్వ విద్యాలయాలకు ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.100 కోట్ల చొప్పున కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విన్నవించారు. అదేవిధంగా రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు గ్రాంట్ ఇవ్వాలని కోరారు. చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున వారిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి 5 టెక్స్‌టైల్ పార్కులను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేశవ్ విన్నవించారు.

గోదావరి జలాల్లో మా లోటు 500 టీఎంసీలు పూడ్చాకే!

- గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రానికి స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పోలవరం కాలువ నుంచే అనుసంధానం చేయండి
- జాతీయ జలాభివృద్ధి సంస్థకు ఏపీ లేఖ

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాల్లో ఆంధ్రప్రదేశ్ లోటు 500 టీఎంసీలు పూడ్చాకే గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై ముందుకు వెళ్లాలని కేంద్రానికి రాష్ట్ర జల వనరుల శాఖ స్పష్టం చేసింది. నదుల అనుసంధానంపై గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సాంకేతిక లోపం తలెత్తడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర జల వనరుల శాఖ తన వాదనను వినిపించే అవకాశం లేకుండాపోయింది. దీంతో ఏపీ అభిప్రాయాన్ని లిఖిత పూర్వకంగా రెండు రోజుల్లో తెలియజేయాలని జాతీయ జలాభివృద్ధి సంస్థ కోరగా, రాష్ట్ర జల వనుల శాఖ శుక్రవారం తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ కేంద్ర జలాభివృద్ధి సంస్థకు లేఖ రాసింది. గోదావరి జలాలు దాదాపు 350 టీఎంసీల లోటు ఉన్నట్టు కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) స్పష్టం చేసిందని ఆ లేఖలో గుర్తు చేసింది. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాలు మరింత అవసరం ఉందని స్పష్టం చేసింది.

మా లోటు లెక్కించాకే..

ఏపీకి గోదావరి జలాల లోటు ఎంతో లెక్కించాకే.. గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియకు వెళ్లాలని కేంద్రానికి రాష్ట్రం స్పష్టం చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో వాడుకోని గోదావరి జలాలు 147 టీఎంసీలు ఉన్నాయని, వాటిని గోదావరి- కావేరి జలాల అనుసంధానానికి ఉపయోగిస్తామంటే ఎలా అని ప్రశ్నించింది. గోదావరి-కావేరి అనుసంధానంతో తెలంగాణకు అదనంగా దాదాపు 80 టీఎంసీలు, కర్ణాటకకు మరో 20 టీఎంసీల దాకా లబ్ధి చేకూరుతుందని ఏపీ చెబుతోంది. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో సంబంధం లేని బెడ్తి-వర్దా-తుంగభద్ర అనుసంధానం చేస్తే ఏపీకి కృష్ణాజలాలు అదనంగా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసింది. ఇదే సమయంలో రాష్ట్రంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకానికీ, పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా నదుల అనుసంధానానికి కూడా ఆమోదముద్ర వేయాలని కోరింది. పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచే గోదావరి-కావేరి అనుసంధానం చేయాలని స్పష్టం చేసింది. అలా చేస్తేనే రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని తెలిపింది. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా కావేరికి జలాలను తరలించే ప్రక్రియకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నాగార్జున సాగర్ నుంచి జలాలు తరలిస్తామంటే అంగీకరించబోమని తేల్చిచెప్పింది.

ఏకపక్షంగా వెళ్తామంటే అంగీకరించం..

దిగువ రాష్ట్రంగా ఏపీకి ప్రత్యేక హక్కులు ఉంటాయని, అందువల్ల పోలవరం కుడి ప్రధానకాలువ నుంచి గోదావరి జలాలను కావేరికి తరలించే ప్రక్రియను చేపట్టాల్సిందేనని, ఇచ్చంపల్లి నుంచి లేదా తుపాకులగూడెం నుంచి గోదావరి జలాలను కావేరికి అనుసంధానం చేయడం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం ఉండదని ఏపీ స్పష్టం చేసింది. గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియను చేపట్టాలంటే రాష్ట్రానికి ప్రత్యేకంగా ప్రయోజనం ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది.



ఇంధన పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ శాఖకు అందిన పురస్కారాలతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

ఇంధన పొదుపులో ఈ ఏడాదీ మనమే టాప్

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా ఇంధన పొదుపులో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్లు పొదుపు చేసినట్లేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో సోలార్ పరికరాల వినియోగం పెరగాలన్నారు. విజన్ 2047లో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అవార్డును దక్కేందుకు కృషి చేసిన రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియెన్సీ లిమిటెడ్ (ఏపీఈఈఎస్ఎల్) సీఈవో, ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి బీఏవీపీ కుమారరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు, ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చేకూరి, సీపీడీసీఎల్ ఎండీ రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపులో అవార్డులు సాధించిన వారికి విజయనంద్ జ్ఞాపికలు బహూకరించారు.

చెత్త ఏరుకొనే వారితో ఇంటింటి చెత్త సేకరణ

- పుణెలో అమలు తీరును పరిశీలించిన పట్టాభి బృందం

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెత్త ఏరుకొనే వారితోనే ఇంటింటా చెత్త సేకరించే పద్ధతిని పుణె మున్సిపల్ కార్పొరేషన్ అమలు చేస్తోంది. రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం బృందం శుక్రవారం ఆ నగరంలో పర్యటించి ఈ విధానాన్ని పరిశీలించింది. ఆ వివరాలను పట్టాభి మీడియాకు వివరించారు. మహారాష్ట్రలోని పుణెలో చెత్త ఏరుకొనే 8 వేల మందితో అధికారులు సొసైటీని ఏర్పాటుచేసి..చెత్త ఏరిస్తున్నారు. చెత్త సేకరించే సమయంలో ప్లాస్టిక్ కవర్లు తదితర రీ సైక్లింగ్‌కు పనికొచ్చే వస్తువులను చెత్త ఏరుకొనేవారు తమవద్దే ఉంచుకొని సొసైటీద్వారా విక్రయిస్తున్నారు"అని తెలిపారు.

కబ్జా చేస్తే ఖబడ్దార్


విజయవాడ సమీపంలోని గంగూరులో రైతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి నాదెండ్ల మనోహర్

"మీ తాత,తండ్రుల కష్టార్జితం మీకే దక్కాలి. భూములు కబ్జాకు గురికాకుండా కొత్త చట్టం తెచ్చాం. భూకబ్జాలు, మోసాలు, బెదిరింపులు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయి. సెంటు భూమి కబ్జా చేసినా తాట తీస్తాం. జాగ్రత్తగా ఉండాల్సిందే. గత ప్రభుత్వంలో తప్పుడు సర్వేలు జరిగాయని లక్షల మంది ఫిర్యాదు చేశారు. దానివల్ల సెంటు, రెండు సెంట్లు పోయాయని బాధితులు చెబుతున్నారు. భూమి గురించి వచ్చే ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తాం"

\- ముఖ్యమంత్రి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లులు చెల్లించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కృష్ణాజిల్లా ఈడుపుగల్లులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులోను, పెనమలూరు మండలం గంగూరులో రైతులతో భేటీలోను ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం భూకబ్జాలతో మొదలుపెట్టి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని చంద్రబాబు మండిపడ్డారు. "భూమి విషయంలో ప్రజలు సున్నితంగా ఆలోచిస్తారు. అయినా.. గత ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలపై రాజముద్ర కాకుండా జగన్ ఫొటో ముద్రించింది. సరిహద్దు రాళ్లపైనా ఆయన బొమ్మ వేశారు. మన భూమి పత్రాలపై ఆయన బొమ్మ ఏంటి? వ్యవస్థలను నిర్వీర్యం చేసేశారు. వాటి పరిస్థితి చూస్తూ, నిద్రలేని రాత్రులను గడపాల్సి వస్తోంది" అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రశాంతంగా నవ్వుతూ జీవించే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. "గత ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులు పాలుచేసిన ఘటనలపై నావద్దకు ఇప్పటివరకూ లక్షా యాభై ఏడువేల అర్జీలు వచ్చాయి. భూములపైనే ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూకబ్జాలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా ఉన్నాయి. 22ఏ పేరుతో చాలామంది భూములు లాక్కున్నారు. బాధితులు కోల్పోయిన భూములన్నీ తిరిగి వారికి దక్కేలా చేస్తాం. హైదరాబాద్ మాదిరిగా కాకుండా మన రాష్ట్రంలో భూములకు స్పష్టమైన రికార్డులను బ్రిటిష్ పాలకులు తయారుచేశారు. కానీ, వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో రికార్డులను తారుమారు చేసి ప్రజలను ఇబ్బందుల పాల్జేశారు" అని చంద్రబాబు తెలిపారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే....

ఫిర్యాదు లేదంటే బాగా పనిచేసినట్టు!

"రెవెన్యూ సదస్సుల్లో ఈ పది రోజుల్లోనే 95,263 దరఖాస్తులు వచ్చాయి. మూడు లక్షల మంది పాల్గొన్నారు. భూమి కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో తేడాలు పరిష్కరిస్తాం. వారసుల పేర్లు సరిగా ఉండేలా చూసి, అన్నీ సరిచేసే రైతుకు పట్టాదారు పాస్‌బుక్ ఇస్తాం. పాసుపుస్తకంపై క్యూ ఆర్ కోడ్, జియో ట్యాగింగ్‌తో భూమి వివరాలు తెలుసుకునే అవకాశం కల్పిస్తాం. భూమికి సంబంధించిన ఫిర్యాదులు రాలేదంటే అధికారులు సక్రమంగా పనిచేసినట్టు! ఒకవేళ ఫిర్యాదుల పరిష్కారం కాకుంటే ఆ సమస్య పరిష్కారం కాలేదని స్పష్టంగా చెప్పాలి.. ఎలా పరిష్కరించాలో మార్గాలు అన్వేషించాలి"

అన్నదాతను అగ్రస్థానంలో నిలుపుతాం: 'ఎక్స్'లో సీఎం

"మన బలం వ్యవసాయం. దాన్ని మరింత బలోపేతం చేస్తాం. అన్ని రకాలుగా అండగా ఉంటాం. ఆధునిక వ్యవసాయాన్ని రాష్ట్రంలో ప్రోత్సహించడం ద్వారా అన్నదాతను అగ్రస్థానంలో నిలుపుతాం. సాంకేతికతను చేరువ చేసి, రైతులకు సాగు ఖర్చులు తగ్గిస్తాం. గంగూరులో రైతులతో మాట్లాడాను. ధాన్యం సేకరణ విధానంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నాను. మరింత లబ్ధి చేకూర్చడానికి ఏం చేయాలనే దానిపై వారి అభిప్రాయాలు తీసుకున్నాను. ఖరీఫ్‌లోఇప్పటివరకు 19,90,945 టన్నుల ధాన్యసేకరించాం. 3 లక్షల మంది రైతులకు రూ.4,584 కోట్లను 48 గంటల్లోనే చెల్లించాం. మాది రైతు అనుకూల ప్రభుత్వం" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

చివరి సమస్య పరిష్కారమయ్యే వరకూ సదస్సులు కొనసాగుతాయి : అనగాని

భూసమస్యలు మొత్తం పరిష్కారమయ్యే వరకూ రెవెన్యూ సదస్సులు కొనసాగిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో భూములను ఆక్రమించుకుని దందాలు కొనసాగించారనీ, ఇటీవల ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులలో 65 శాతం రెవెన్యూ విభాగానికి సంబంధించినవేనన్నారు. 15 శాతం శాంతిభద్రతలకు సంబంధించినవన్నారు. కూటమి ప్రభుత్వం గతంలో రీ సర్వే జరిగిన భూములన్నింటినీ మళ్లీ సర్వే చేయిస్తుందనీ, ప్రతి అర్జీదారునికీ న్యాయం చేస్తామనీ, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.


రైతు సేవా కేంద్రంలో తేమ శాతం తీస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ధాన్యం సేకరణలో తప్పులు జరగొద్దు

"రైతు కష్టాన్ని దోచుకుంటే సహించేది లేదు. ధాన్యం సేకరణలో ఎక్కడా తప్పు జరగడానికి వీల్లేదు. మేం అధికారంలోకి వచ్చాక రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 24 గంటల్లోనే అకౌంట్లో డబ్బులు జమ అవుతున్నాయి. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగితే రైతులకు శ్రమ తగ్గడంతో పాటు ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఉంటుంది. పెట్టుబడి తగ్గించి రైతులను అప్పుల ఊబి నుంచి బయటకు తీసుకొచ్చి ఉపశమనం కలిగించడంతో పాటు ఆదాయం పెంచాలన్నదే మా సంకల్పం. గత ప్రభుత్వ వైఫల్యాలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఐదేళ్ల పాటు కాలువల్లో పూడిక తీత పనులు చేయలేదు. రైతులకు వరంగా మారిన పట్టిసీమను నాడు నిర్వీర్యం చేశారు. ధాన్యం సేకరణ చేసిన డబ్బులు కూడా రైతులకు జమ చేయలేదు" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గంగూరు రైతు సేవా కేంద్రాన్ని, రైసుమిల్లును పరిశీలించారు. సంచుల కొరత తీవ్రంగా ఉన్నట్టు ఆయన గుర్తించారు. అనంతరం రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడి బాగా వచ్చిందని చంద్రబాబుకు రైతులు తెలిపారు. అనంతరం వెంకటాద్రి ఆయిల్ రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను చంద్రబాబు పరిశీలించారు. తేమ శాతం లెక్కించే విధానాన్ని స్వయంగా చూశారు. రైతు సేవా కేంద్రం నుంచి మిల్లుకు వస్తున్న ధాన్యం తేమశాతంలో వ్యత్యాసం వస్తుందన్న ఫిర్యాదులపై ఆరా తీశారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, వాసంశెట్టి సుభాశ్, మంత్రి కొల్లు రవీంద్ర, పెనమలూరు శాసనసభ్యుడు బోడె ప్రసాద్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి వీర పాండ్యన్, ఆ శాఖ కమిషనర్ జిలానీ, రెవెన్యూశాఖ కమిషనర్ సిసోడియా, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు చేస్తా

'ధాన్యం కొనుగోలులో రైతులు కొంతమేర ఇబ్బందులు పడుతున్నారనీ, ఈ ఇబ్బందులను తొలగించేందుకు తానే నేరుగా గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని చంద్రబాబు అన్నారు. ధాన్యం కొనుగోలులో అధికారుల పనితీరు బాగా లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం పండించిన రైతు... మిల్లులో ధాన్యం విక్రయించే విషయంలోనూ శ్రద్ధ వహించాల్సిందేననీ, దళారులకు అమ్మితే తక్కువ ధర లభిస్తుందని తెలిపారు. పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్ చేస్తే వారిపై పీడీ యాక్టు ద్వారా కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. వరదల కారణంగా పంటనష్ట పరిహారం తీసుకున్న రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయటంలేదని విలేకరులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ప్రాజెక్టు కమిటీల చైర్మన్ పదవులపై కసరత్తు

- టీడీపీలో అంతర్గతంగా పెరిగిన పోటీ
- మంత్రులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- అన్ని జిల్లాల్లోనూ ఏకాభిప్రాయం: పల్లా.. నేడు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు పైస్థాయిలో ఉండే ప్రాజెక్టు కమిటీల చైర్మన్ పదవులపై తెలుగుదేశం పార్టీ అంతర్గతంగా కసరత్తు నిర్వహించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఒకవిడత పార్టీ కేంద్ర కార్యాలయంలో కూర్చుని చర్చించారు. తర్వాత అన్ని జిల్లాల మంత్రులతో పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపికకు సూచనలు చేశారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 58 ప్రాజెక్టు కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. వీటికి దిగువ స్థాయిలో ఉన్న ప్రాథమిక నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ స్థాయి సంఘాల ఎన్నికలు ఇప్పటికే పూర్తయ్యాయి. వీటికి ఎగువన ఉన్న ప్రాజెక్టు కమిటీలకు ఇప్పుడు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రాజెక్టు కమిటీలు కొన్నిచోట్ల జిల్లాల సరిహద్దులు దాటి రెండేసి జిల్లాలకు ఒకటి చొప్పున ఉన్నాయి. మరి కొన్ని జిల్లాల్లో మూడు నాలుగు నియోజకవర్గాలకు కలిపి ఉన్నాయి. ఇవి పెద్ద పదవులు కావడంతో టీడీపీలో పోటీ పెరిగింది. పైగా దిగువ స్థాయి కమిటీలన్నీ కూటమి పార్టీలకే దక్కడంతో ప్రాజెక్టు కమిటీ పదవుల ఏకగ్రీవ ఎన్నిక ఖాయమైంది. ఎన్నికైన వారి పదవీకాలం ఐదేళ్లు. పోటీ తీవ్రంగా ఉన్న మూడునాలుగు చోట్ల చెరి సగం కాలానికి పంచుకొనేలా కూడా ఒప్పందాలు కుదురుతున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు చెరొక పార్టీకి ఇస్తున్నారు. నియోజకవర్గ నేతలకు ఈ పదవులు దక్కడానికి ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తుండటంతో వారి మధ్య అంతర్గత పోటీ నెలకొంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో పోటీ ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. కొన్ని చోట్ల మిత్రపక్షాలకు కూడా చోటిస్తూ కసరత్తు నిర్వహించారు. వీలైనంత వరకూ సామాజిక సమతూకం, ప్రాంతీయ కోణాలు చూసి ఎంపిక చేశారు. ఒకటి రెండు చోట్ల ప్రతిపాదిత అభ్యర్థులపై ఫిర్యాదులు రావడంతో వారిని మార్చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో ఒక అభ్యర్థిపై రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు ఉండటంతో అతన్ని పక్కన పెట్టాలని చంద్రబాబు ఆదేశించారు. అన్ని జిల్లాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై ఏకాభిప్రాయం వచ్చిందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

ఫైబర్ నెట్‌ను ప్రక్షాళన చేస్తా: చైర్మన్ జీవీ రెడ్డి

- సెట్ టాప్ బాక్సులు అందుబాటులోకి తేవాలన్న ఆపరేటర్లు


ఆపరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ రెడ్డి

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివాలా దశలో ఉన్న ఏపీ ఫైబర్ నెట్‌ను ప్రక్షాళన చేసి అభివృద్ధి పథంలోకి తీసుకువస్తానని, ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని చైర్మన్ జీవీ రెడ్డి చెప్పారు. గుంటూరులో శుక్రవారం కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఫోన్ (ట్రిపుల్ ప్లే) సర్వీసును నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీఫైబర్ నెట్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. అయితే, వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏపీ ఫైబర్ నెట్‌ను సర్వనాశనం చేశారని ఆరోపించారు. వైసీపీ ఏపీ ఫైబర్ నెట్‌ను తన జేబు సంస్థగా వాడుకుందని, అడ్డగోలు నియామకాలు చేపట్టారని, ఆఖరికి రాంగోపాల్‌వర్మ వ్యూహం సినిమాకు రూ.2.15 కోట్లు ఫైబర్ నెట్ సంస్థ నుంచే దోచి పెట్టారని దుయ్యబట్టారు. ఆదాయం సమకూర్చే సంస్థను నష్టాల్లోకి నెట్టారన్నారు. సంస్థపై ఈరోజు రూ.1262 కోట్ల అప్పు ఉందన్నారు. ఏపీ ఫైబర్ నెట్‌లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని తెలిపారు. ఇకపై నియామకాల నుంచి ఏ నిర్ణయమైనా అంతా పారదర్శకంగా ఉంటుందన్నారు. కాగా, సెట్‌టాప్ బాక్సుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇకనైనా వాటిని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ఆపరేటర్లు చైర్మన్ జీవీ రెడ్డిని కోరారు. ఫైబర్ నెట్ లైన్లో ఏర్పడుతున్న అంతరాయాలను తరితగతిన పరిష్కరించాలని, గుంటూరులో సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలం చెల్లిన బాక్సులకు నేటికీ రూ.59 రెంటల్ వసూలు చేస్తున్నారని, దానిని రద్దు చేయాలని కోరారు. పోల్ ట్యాక్స్ జీవోను రద్దు చేసి, ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆపరేటర్లు ఆందోళన చెందవద్దని, వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తానని జీవీ రెడ్డి వారికి హామీ ఇచ్చారు.



వైసీపీకి విశాఖ డెయిరీ చైర్మన్ రాజీనామా

- పార్టీ అధ్యక్షుడు జగన్‌కు ఆడారి ఆనంద్ లేఖ
- వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి
- ఆడారితో పాటు 12 మంది డైరెక్టర్లు కూడా పార్టీకి గుడ్‌బై

విశాఖపట్నం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విశాఖలో వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేఖ పంపించారు. శుక్రవారం డెయిరీ డైరెక్టర్లతో సమావేశమైన ఆనంద్.. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ పదవులన్నింటి నుంచి తప్పుకొంటున్నట్లు జగన్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఆయనతో పాటు 12 మంది డైరెక్టర్లు కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఆనంద్ 2024 ఎన్నికల్లో వైసీపీ తరఫున విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. విశాఖ డెయిరీలో అక్రమాలు జరిగినట్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విచారణకు శాసన సభా కమిటీని నియమించింది. కమిటీ ఇటీవలే విశాఖ డెయిరీని సందర్శించి అక్కడ కార్యకలాపాలు, రికార్డులను పరిశీలించింది.


పార్వతీపురం మన్యం జిల్లా బాగుజోలలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి సంధ్యారాణి, వర్షంలోనూ ఆసక్తిగా తిలకిస్తున్న గిరిజనులు

డోలీ మోతలు తప్పిస్తాం

- అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు
- 3 విడతల్లో 4 వేల తండాలకు
- 2 నెలలకోసారి మన్యంలో పర్యటిస్తా
- ప్రజల కోసం కూలీలా పనిచేస్తాం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ
- మన్యం జిల్లాలో రోడ్ల పనులకు శంకుస్థాపన

పార్వతీపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రుషికొండలో ప్యాలెస్ నిర్మాణం కోసం రూ.500 కోట్ల ప్రజాధనం వృథా చేసిన గత వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేయలేకపోయిందని, నిధులు కేటాయించలేకపోయిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం సిరివర వద్ద రూ.9.50 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు సంబంధించి మక్కువ మండలం బాగుజోల వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం జోరున వర్షం కురుస్తున్నా సుమారు కిలోమీటరు వరకు నడుచుకుంటూ కొండపై ఉన్న చిలక మెండంగి గ్రామానికి చేరుకున్నారు. అనంతరం తిరిగి బాగుజోలకు చేరుకున్నారు. అక్కడ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. 'గత ప్రభుత్వం మద్యం ఆదాయం పేరిట, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు తెచ్చినా గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేయలేకపోయింది. వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.350 కోట్లు ఇస్తే, గత ఐదేళ్లలో వచ్చిన ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో వెనుకబడిన జిల్లాలు మరింత వెనుకబడ్డాయి. బుగ్గలు నిమరడం, తలపై చేయివేసి నిమరి మాటలు చెప్పి వెళ్లిపోవడం నాకు తెలియదు. ఏదో చెప్పి వెళ్లిపోవడం కాదు మాట ఇస్తున్నా. క్షేత్రస్థాయిలో గిరిజనుల కష్టాలు తెలుసుకోవడానికే వచ్చా. పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, సహచర మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, నేను ప్రజల కోసం కూలీలా పనిచేస్తాం. కొద్ది నెలల కిందట ప్రజల కష్టాలు తీర్చాలని తిరుమల కొండ ఎక్కాను. మళ్లీ గిరిజనుల కష్టాలు తెలుసుకోవడానికి ఇక్కడ కొండ ఎక్కాను. ప్రతి రెండు నెలలకు ఒకసారి మన్యం ప్రాంతాల్లో పర్యటిస్తా. గిరిజన గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తా. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నాతో పాటు పీఎం మోదీ, సీఎం చంద్రబాబు ఉన్నారు. గిరిజన యువత వివిధ నైపుణ్యాల సాధనకు కృషి చేయాలి. యువత నైపుణ్యాలు సాధిస్తే ఉపాధి అవకాశాలు పొందొచ్చు' అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా ఇప్పటికీ రోడ్లు, వైద్యం తదితర మౌలిక సదుపాయల్లేని గ్రామాలు ఉండడం సరికాదు. ఈ విషయంపై సీఎం చంద్రబాబుతో ప్రత్యేకంగా చర్చించా. రాష్ట్రంలో నాలుగు వేల తండాలకు రోడ్లు కావాల్సి ఉంది. మూడు విడతలుగా అన్ని గ్రామాలకు రోడ్లు వేస్తాం. డోలీ మోతలు తప్పించేందుకు అన్ని గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపడతాం.

\- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఏజెన్సీలో రహదారుల నిర్మాణం

'ఉపాధి హామీ పథకం కింద రూ.36.71 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో 19 గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేశాం. నిధుల సమస్య ఉన్నా రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. గిరిజన ప్రాంతాలకు పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నేను మీసం మెలిస్తే, ఛాతీ కొట్టుకుంటే రోడ్లు పడవు. సీఎం, పీఎంలకు ఇక్కడి పరిస్థితి వివరించి నిధులు సాధిస్తేనే రోడ్లు పడతాయి. నా పని చేసుకోవడానికి ప్రజలు సహకరించాలి. పర్యటనకు వస్తే నా చుట్టూ మూగి పనికి అడ్డం పడరాదు. ప్రజలు చూపిస్తున్న ప్రేమకు ఐ టూ లవ్‌యూ. 2019లో నన్ను ఓడించారు. ప్రజల కోసం నేను నిలబడతానా? లేదా? అని పరీక్ష పెట్టారు. నాయకుడికి ఇలాంటి పరీక్షలు పెట్టడం మంచిదే' అని అన్నారు. పనసభద్ర, పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.4 కోట్ల మేర చెక్కులను ఉపముఖ్యమంత్రి పంపిణీ చేశారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా...: గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. డోలీమోతకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆసుపత్రి ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేస్తున్నామన్నారు. ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ, జగదీశ్వరి, మాధవి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత మహావీర్ సురానా తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌లో 'డిప్యుటేషన్ల' అధికారి!

- మొన్నటివరకూ రాజ్‌భవన్, ఇప్పుడు సీడాప్
- ఎక్సైజ్‌లో అధికారుల కొరత ఉన్నా బయటికే..
- ఉపసభాపతి పీఎస్‌గా మరో ఈఎస్

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో అధికారుల కొరత ఉన్నప్పటికీ డిప్యుటేషన్ల పరంపర కొనసాగుతోంది. ఓవైపు ఎక్సైజ్ సూపరింటెండెంట్ల (ఈఎస్) కొరత ఉండగా, కొందరు అధికారులు ఇతర శాఖల్లో పనిచేసేందుకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోతున్నారు. తాజాగా ఉపసభాపతి రఘురామకృష్ణరాజు వ్యక్తిగత కార్యదర్శిగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేట్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఓ ఈఎస్‌ను నియమించారు. టాస్క్‌ఫోర్స్‌లో ఈ నెలాఖరుకు మరో ఈఎస్ రిటైర్ కాబోతున్నారు. ఇక ఇటీవల సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ(సీడాప్) సీఈవోగా మరో ఈఎస్ నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో ఆయన రాజ్‌భవన్‌లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేశారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ నుంచి విడివడిన సెబ్‌లో పనిచేయడం ఇష్టంలేని ఆయన వైసీపీ సభల నిర్వహణ బాధ్యతలు చూసే ఓ ఎమ్మెల్సీ సిఫారసుతో రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ పదవీకాలం ముగియగానే తిరిగి మాతృశాఖలో చేరకుండా కూటమి నేతల సిఫారసుతో సీడాప్ సీఈవో అయ్యారు. మరోవైపు ఎక్సైజ్ శాఖలో అటు టాస్క్‌ఫోర్స్‌తో పాటుగా గంజాయి సాగు ఎక్కువగా ఉండే పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఈఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారుల కొరత కారణంగా ఆ జిల్లాలను ఇన్‌చార్జ్‌లతో నడిపిస్తున్నారు. అయితే సొంత అధికారులను డిప్యుటేషన్‌పై పంపి, ఖాళీలను ఇన్‌చార్జ్‌లతో నెట్టుకురావడంపై విమర్శలు పెరుగుతున్నాయి. అలాగే, గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో సిఫారసులు చేయించుకున్న వారికి.. ఇప్పుడు మళ్లీ కూటమి నేతలు సిఫారసు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణ

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్‌లను పునర్వ్యవస్థీకరిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకూ 5వేలకు పైగా పాఠశాలలు స్కూల్ కాంప్లెక్స్‌లుగా వ్యవహరించగా వాటిని రెండు రకాలుగా వర్గీకరిస్తూ ఏ కేటగిరీలో 2807, బీ కేటగిరీలో 1227 స్కూల్ కాంప్లెక్స్‌లుగా మార్చింది. వీటిపై అభ్యంతరాలు తెలిపేందుకు ఉపాధ్యాయులకు అవకాశమిచ్చింది. కాగా ల్యాబ్‌లు, ఆట స్థలాలు, ఇతర అన్ని సౌకర్యాలు ఉన్నచోటే స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటుచేయాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

వారే కొట్టుకుని.. రాహుల్‌ను అంటున్నారు

- అమిత్‌షా రాజీనామా కోరుతున్నందుకే ఈ డ్రామా: షర్మిల



అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలు వారే కొట్టుకుని.. నెపం రాహుల్‌గాంధీపై నెడుతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. శుక్రవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పట్టుబట్టడంతో బీజేపీ దాడి డ్రామాకు తెరతీసిందన్నారు. అంబేడ్కర్, రాజ్యాంగంపై బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎప్పుడూ చులకన భావమేనని అన్నారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తొలగించాలంటూ 'ఎక్స్'కు కేంద్రం నోటీసులు ఇవ్వడం చూస్తుంటే వారు తప్పు చేశారని అర్థమవుతోందన్నారు. దేశానికి రాజ్యాంగాన్ని, కోట్లాదిమంది దళితులు, అణగారిన వర్గాల జీవితాలను మార్చేసిన గొప్పవ్యక్తి అంబేడ్కర్‌ను బీజేపీ అవమానిస్తూనే ఉందని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాషాయ మూకపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని చెప్పారు.

ఏపీ హైకోర్టులో 2.47 లక్షల పెండింగ్ కేసులు

- ఎంపీ పరిమళ్ నత్వాని ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ సమాధానం

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొత్తం 2,47,097 కేసులు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 9,04,462 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు ఈ నెల 19న మేఘ్వాల్ రాజ్యసభకు సమాచారం అందించారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా.. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 623 మంది న్యాయాధికారులు ఉండాల్సి ఉండగా 59 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అలాగే సుప్రీం కోర్టులో 82,640 పెండింగ్ కేసులు ఉండగా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల హైకోర్టుల్లో 61,80,878, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 4,62,34,646 పెండింగ్ కేసులు ఉన్నాయని తెలిపారు.

ఏపీ హైకోర్టులో సెర్ప్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది మాగులూరి హరిబాబు

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది మాగులూరి హరిబాబు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఆయన నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభ దేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హరిబాబు మూడేళ్లపాటు ఈ పోస్టులో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహాకుంభ మేళాకు 14 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహాకుంభ మేళా రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ముఖ్య నగరాల నుంచి 14 ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. అత్యధికంగా హైదరాబాద్ నుంచి 8 రైళ్లను నడుపుతుండగా, గుంటూరు నుంచి 4, నాందేడ్ నుంచి 2 ప్రత్యేక రైళ్లు నడుస్తాయని సీపీఆర్వో శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 19 నుంచి 27 వరకు ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాట్లో ఉంటాయని పేర్కొన్నారు. కుంభమేళా జరిగే ప్రాంతాలైన అజాంఘర్, గయా, పాట్నా వెళ్లేందుకు ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. కాగా, ట్రాక్ మరమ్మతులు, నిర్వహణ కారణాల వల్ల 24 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కొన్ని రైళ్లు ఈ నెల 21 నుంచి 28 వరకు, మరికొన్ని రైళ్లను ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు రద్దు చేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి చిత్తాపూర్, కాచిగూడ-మిర్యాలగూడ, కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్, నడికుడి నుంచి కాచిగూడ, నడికుడి-మిర్యాలగూడ, తిరుపతి-కాట్పాడి, విజయనగరం నుంచి విశాఖపట్నం, పలాస నుంచి విశాఖపట్నం, రాజమండ్రి-విశాఖపట్నం, కాట్పాడి నుంచి జోలార్‌పేట మార్గాల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు చెప్పారు.

ఇష్టంలేని పని చేయలేక.. 14 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

- బలవంతంగా సెంట్రింగ్ పనులకు పంపిన తల్లిదండ్రులు
- వ్యవసాయ పనులు చేస్తానన్నా వినని వైనం

అనంతపురం క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లాల్సిన వయసులో తమ కుమారుడిని పని బాట పట్టించారు. ఊరికి దూరంగా, బాలుడికి ఇష్టం లేని పనిలో చేర్చారు. 'ఊరికి వచ్చేస్తాను. నాన్నతో కలిసి వ్యవసాయ పనులు చేస్తాను' అని ఆ బాలుడు చెప్పినా తల్లిదండ్రులు వినిపించుకోలేదు. సెంట్రింగ్ పనులు చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని నచ్చజెప్పారు. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన 14 ఏళ్ల బాలుడు శివ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన అనంతపురం జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామానికి చెందిన కురవ అయ్యన్నకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వ్యవసాయం జీవనాధారం. అయితే పెద్ద కుమారుడు నాగేంద్ర, చిన్న కుమారుడు శివ ఆరో తరగతితోనే చదువు మానేశారు. నాగేంద్ర తమ బంధువుల పిల్లలైన సురేశ్, రమేశ్‌లతో కలిసి కొన్నేళ్ల క్రితం నుంచి అనంతపురం నగరంలోని హమాలీ కాలనీలో ఉంటూ, సెంట్రింగ్ పనులకు వెళుతున్నాడు. ఆరు నెలల క్రితం శివను కూడా పెద్ద కొడుకు వద్దకు తల్లిదండ్రులు పంపించారు. అయితే అనంతపురంలో ఉండలేనని, ఊరికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటానని శివ తల్లిదండ్రులకు చెప్పేవాడు. వ్యవసాయం కంటే సెంట్రింగ్ పనులతోనే ఎక్కువ డబ్బులొస్తాయని నచ్చజెప్పారు. ఈ క్రమంలో అనంతపురం శారదానగర్‌లో శుక్రవారం ఉదయం సెంట్రింగ్ పనులకు అందరూ వెళ్లారు. బాత్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి 11.30 గంటల సమయంలో హమాలీకాలనీలో గదికి శివ వెళ్లాడు. రెండు సెల్ఫీలు తీసుకుని, ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. శివ ఎంత సేపటికీ రాకపోవడంతో మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నాగేంద్ర గదికి వెళ్లి చూసేసరికి శివ చనిపోయి ఉన్నాడు. ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఈ ఘటనపై అనంతపురం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీధి వ్యాపారులకు సర్కారు బాసట

- స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లకు శ్రీకారం
- స్థిరమైన, ఆకర్షణీయమైన స్థలాల్లో వ్యాపారం
- నెల్లూరు మైపాడు రోడ్డులో పైలట్ ప్రాజెక్టు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీధి వ్యాపారుల కోసం పట్టణాలు, నగరాల్లో స్థిరమైన, ఆకర్షణీయమైన స్థలాలను కేటాయించి వాటిలో 'స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ల'ను ఏర్పాటు చేస్తోంది. వీధుల్లో రద్దీని తగ్గించడం, వీధి వ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరచడం, వారికి స్థిరమైన మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని, స్వయం సహాయక సంఘాలలోని కుటుంబాలను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మెప్మా ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టు కింద నెల్లూరు నగరంలోని మైపాడు రోడ్డులో 200 షాపులతో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. కంటైనర్ మోడల్‌లో ఏర్పాటు చేయనున్న ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌కు రూ.7 నుంచి రూ.9కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ఆ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. వీధి వ్యాపారుల సర్వే, గుర్తింపు కార్డుల జారీ, వ్యాపార ప్రణాళిక తయారీ, వ్యాపార జోన్ల ఏర్పాటు, నెలవారీ కార్యకలాపాలను మెప్మా సమీక్షిస్తుంది. స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్లలో వ్యాపారులకు అనుకూలమైన రూఫ్‌టాప్, స్థలం కేటాయింపు, సోలార్ ప్యానెల్స్ ద్వారా రోజుకు 12.96 కిలో వాట్స్ సామర్థ్యంతో కంటైనర్, డిజిటల్ అనుసంధానం, తగిన భద్రతా ఏర్పాట్లను కల్పించనున్నారు.



లబ్ధిదారుల ఎంపిక ఇలా..

- 18 ఏళ్లు పైబడిన వారు అర్హులు.
- విస్తృత ప్రచారం కల్పించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.
- సోషల్ ఆడిట్ నిర్వహించిన తర్వాత తుది జాబితాను తయారు చేస్తారు.
- సంబంధిత టౌన్ వెండింగ్ కమిటీల సిఫార్సుల మేరకు మున్సిపల్ కమిషనర్లు వారికి వెండింగ్ కార్డులు, సర్టిఫికెట్లు జారీ చేస్తారు.
- లాటరీ పద్ధతిలో షాపులు, స్థలాలను కేటాయిస్తారు.
- షాపులు పొందిన వారికి వివిధ పథకాల కింద రుణ సౌకర్యం కోసం గ్రూపులు ఏర్పాటు చేస్తారు.
- ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు మార్గనిర్దేశం చేస్తారు.
- డిజిటల్ నగదు బదలాయింపులు నిర్వహించేందుకు సాంకేతిక సహాయాన్ని అందిస్తారు.

వైసీపీ హయాంలో నందిగంను ఎందుకు విచారించలేదు!

- మరియమ్మ హత్య కేసులో నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య
- మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
- నేర చరిత్రను దాచడంపై తీవ్ర అసహనం



న్యూఢిల్లీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మరియమ్మ హత్యకేసులో మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. "మరియమ్మ హత్య జరిగినప్పుడు మీ ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా? అప్పుడే విచారిస్తే మీ నిర్దోషిత్వం బయట పడేది కదా?" అని సురేశ్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. 2020, డిసెంబరులో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, వెలగపూడి గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మరియమ్మ మృతి చెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి, అప్పటి ఎంపీ నందిగం సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు. అయితే, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ గుంటూరు కోర్టును ఆశ్రయించగా జడ్జి సదరు పిటిషన్‌ను తోసిపుచ్చారు. హైకోర్టు సైతం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. హైకోర్టు తీర్పును నందిగం సురేశ్ ఈ ఏడాది అక్టోబరు 11న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్ర వాదనలు వినిపించారు. కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. "2020లో కేసు నమోదైతే నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు దర్యాప్తు చేస్తున్నారు" అని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుని "ఎఫ్ఐఆర్ నమోదైతే వెంటనే విచారణ చేపట్టాలి. అప్పట్లో మీ(వైసీపీ) ప్రభుత్వమే ఉంది. అలాంటప్పుడు విచారణ ఎందుకు చేయలేదు? అప్పట్లోనే విచారించి ఉంటే.. నిర్దోషిత్వం బయట పడేది కదా?" అని వ్యాఖ్యానించింది. సిబల్ వాదనలు కొనసాగిస్తూ.. ఉద్దేశపూర్వకంగానే సురేశ్‌పై కేసు పెట్టారని, బెయిల్ ఇవ్వాలని కోరారు.

కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారు: లూథ్రా

ప్రభుత్వం తరఫున సిద్ధార్థ లూథ్ర వాదనలు వినిపిస్తూ.. నందిగం సురేశ్‌కు పార్లమెంట్ సభ్యుడు కాకముందు నుంచే నేర చరిత్ర ఉందని తెలిపారు. సురేశ్.. తనపై ఉన్న కేసుల వివరాలను దాచిపెట్టి, న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం.. సురేశ్‌పై గతంలో ఉన్న కేసుల వివరాలను పిటిషన్‌లో పేర్కొనక పోవడంపై అసహనం వ్యక్తంచేసింది. మరిన్ని వివరాలు అందించేందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని కపిల్ సిబల్ కోరగా, తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని, ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మంజూరు చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను జనవరి 7కు వాయిదా వేసింది.

వివేకా పీఏ కృష్ణారెడ్డి కేసులో సాక్షుల విచారణ పూర్తి

పులివెందుల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ వెంకటకృష్ణారెడ్డి ప్రైవేట్ కేసుకు సంబంధించి 39మంది సాక్షులను పోలీసులు విచారించారు. దీంతో ఈ విచారణ ప్రక్రియ పూర్తయింది. మాజీ సీఎం జగన్ బంధువు, పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలను పులివెందుల డీఎస్పీ మురళినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం విచారించారు. మరోసాక్షి వైఎస్ అభిషేక్‌రెడ్డి అనారోగ్య కారణాలతో విచారణకు హాజరుకాలేదు. ఇక, సీబీఐ అధికారులకు నోటీసులిచ్చిన వారిని కూడా విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 2019లో వివేకానందరెడ్డి హత్యకేసుపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి వివేకా పీఏ వెంకటకృష్ణారెడ్డి.. తనను తప్పుడు సాక్ష్యం చెప్పాలని బెదిరించారంటూ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సీబీఐ విచారణాధికారి రామ్‌సింగ్‌పై పులివెందుల కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సాక్షులను విచారించి చార్జిషీటు వేయాలని పులివెందుల పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు 39 మంది సాక్షులను విచారించారు.

వైసీపీ నేతల సిఫారసు లేఖలతో భక్తులకు ఐటీబీపీ కానిస్టేబుల్ టోకరా

- పది రూ.300 దర్శన టికెట్లు రూ.70 వేలకు విక్రయం

తిరుమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సిఫారసు లేఖలతో ఓ ఐటీబీపీ కానిస్టేబుల్ బెంగళూరుకు చెందిన భక్తులను మోసగించాడు. వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తానని చెప్పి పది రూ.300 టికెట్లను రూ.70 వేలకు విక్రయించాడు. భక్తులు విజిలెన్స్ అధికారులను ఆశ్రయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెంగళూరుకు చెందిన జగదీశ్ అనే భక్తుడు తనకు నాలుగు వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కావాలని ఐటీబీపీ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను సంప్రదించారు. చంద్రశేఖర్ అతని వద్ద నుంచి నాలుగు వీఐపీ బ్రేక్ టికెట్లకు రూ.5 వేల చొప్పున రూ.20 వేలు వసూలు చేశాడు. ఈ క్రమంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓ వైసీపీ ఎమ్మెల్యే సిఫారసు లేఖపై రూ.300 టికెట్లు తీసుకుని భక్తులకు అందజేశాడు. చిత్తూరుకు చెందిన హరిబాబు అనే మరో భక్తుడి నుంచి కూడా ఇలాగే 6 శ్రీవాణి టికెట్ల కోసం రూ.50 వేలు తీసుకుని రూ.300 విలువైన టికెట్లు ఇచ్చాడు. ఈ టికెట్లను అనంతపురానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ సిఫారసు లేఖ ద్వారా పొందినట్టు తెలిసింది. మోసపోయామని గుర్తించిన భక్తులు గురువారం విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తిరుమల టూ టౌన్ సీఐ శ్రీరాముడు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ విజిలెన్స్ వింగ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని రూ. 1.05 లక్షలు వసూలు

తిరుమల శ్రీవారి అభిషేకం, మేల్‌ఛాట్ వస్త్రం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి భక్తుల నుంచి ఓ దళారీ రూ.1.05 లక్షలు వసూలు చేసి మోసగించాడు. ఓ భక్తుడి ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు శుక్రవారం ఆ దళారీని అరెస్ట్ చేశారు. చీరాలకు చెందిన లలిత్‌కుమార్ గతంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ పరకామణిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసేవాడు. శ్రీవారి సేవా టికెట్లు ఇస్తానని నమ్మించి భక్తులను మోసం చేసిన ఘటనతో 2015లో అతన్ని విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత దళారీగా మారిన లలిత్‌కుమార్.. తాజాగా నిజామాబాద్‌కు చెందిన సాయిచంద్ అనే భక్తుడికి ఐదు అభిషేకం, ఒక మేల్‌ఛాట్ వస్త్రం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి ఆన్‌లైన్ ద్వారా రూ.1.05 లక్షలు తీసుకున్నాడు. మేల్‌ఛాట్ వస్త్రం టికెట్ బుక్ అయినట్టు నకిలీ మెసేజీ పంపాడు. దీనిపై భక్తుడికి అనుమానం రావడంతో టీటీడీ హెల్ప్‌లైన్ ద్వారా పరిశీలించగా అది ఫేక్ అని తేలింది. దీంతో భక్తుడు తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా.. లలిత్‌కుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. లలిత్ బ్యాంక్ ఖాతాను తనిఖీ చేయగా 2023 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల లావాదేవీలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

- తీరంలో 60 కి.మీ. వేగంతో గాలులు
- కోస్తాలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు సూచిక
- నేడు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తాజా బులెటిన్ ప్రకారం ఇది శుక్రవారం రాత్రి చెన్నైకి 370 కి.మీ. తూర్పు ఈశాన్యంగా, విశాఖపట్నానికి 450 కి.మీ. దక్షిణంగా.. పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. వాయుగుండం శనివారం సాయంత్రం వరకు ఉత్తర ఈశాన్యంగా పయనిస్తుందని ఐఎండీ తెలిపింది. ఇది ఒడిశా తీరం వైపు పయనించే క్రమంలో బలహీనపడుతుందా? లేదా? అనేది ఇంకా వెల్లడించలేదు. అయితే, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఉష్ణోగ్రతలు 25 నుంచి 26 డిగ్రీలు నమోదవడంతోపాటు ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో సముద్రంలోనే వాయుగుండం బలహీనపడుతుందని వాతావరణ నిపుణుడొకరు అంచనా వేశారు. దీని ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ అనేక ప్రాంతాల్లో వర్షాలు, కొన్నిచోట్ల భారీవర్షాలు కురిశాయి. కోస్తాలోని అనేక ప్రాంతాల్లో ముసురు వాతావరణం కొనసాగడంతో చలిగాలులు వీస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి, పత్తి, పొగాకు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కోస్తాలో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నందున ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరిక కేంద్రం పేర్కొంది. కోస్తాలోని అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. శనివారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో మరీముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కాగా, రానున్న 24 గంటల్లో వాయుగుండం ఉత్తర ఈశాన్యం దిశగా కదులుతూ తీవ్రతను కొనసాగిస్తుందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

మేం అమెరికా పోలీసులం..

మీ అమ్మాయి ఇక్కడ ట్రాఫిక్ రూల్స్ పాటించలేదు

- బెదిరించి లక్ష స్వాహా చేసిన మోసగాళ్లు

కలువాయి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'హలో... మేం అమెరికా పోలీసులం. మీ అమ్మాయి ఇక్కడ ఉంటోంది కదా. ఆమె ట్రాఫిక్ నిబంధలు పాటించనందున రూ.లక్ష ఫైన్ కట్టాలి. లేదంటే మీ అమ్మాయిని వదిలేది లేదు...' అంటూ ఫోన్‌లో అవతల వ్యక్తి ఇంగ్లీషులో గంభీరంగా మాట్లాడటంతో ఆ తల్లిదండ్రులు గాభరా పడ్డారు. వెంటనే కుమార్తెకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ కలవలేదు. దీంతో ఆందోళన చెందిన వారు భయంతో లక్ష రూపాయలు కట్టేశారు. నెల్లూరు జిల్లా కలువాయిలో శుక్రవారం సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడిన ఓ వ్యాపారి దీనగాథ ఇది. వివరాల్లోకి వెళితే.. కలువాయి బజారు వీధికి చెందిన ఓ వ్యాపారి కుమార్తె ప్రస్తుతం అమెరికాలో ఉంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ వ్యాపారికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు తాము అమెరికా పోలీసులం అంటూ ఇంగ్లీషులో మాట్లాడారు. 'మీ కుమార్తె ఇక్కడ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారు. కాబట్టి భారత కరెన్సీ ప్రకారం లక్ష రూపాయిలు ఫైన్ కట్టాలి. ఇప్పుడు మీ అమ్మాయి మా ఆధీనంలోనే ఉంది' అంటూ నమ్మించారు. ఆ వెంటనే మరో మహిళ ద్వారా వ్యాపారితో మాట్లాడించారు. ఇక్కడ తనను హింసిస్తున్నారని, వెంటనే డబ్బు కట్టాలని కుమార్తెలా మాట్లాడించారు. అదే సమయంలో వారు తమ కుమార్తెకు ఫోన్ చేయగా ఆ నంబర్ కలవలేదు. దీంతో భయపడిన వ్యాపారి సైబర్ నేరగాళ్లు తెలిపిన బ్యాంకు ఖాతాకు రూ.50 వేలు చొప్పున రెండు దఫాలుగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కొద్ది సేపటికే కుమార్తె ఫోన్ కలవడంతో జరిగిన విషయం ఆమెకు తెలిపారు. అదేం జరగలేదని, తాను ఇంట్లోనే ఉన్నానని ఆమె చెప్పడంతో మోసపోయామని గ్రహించిన సదరు వ్యాపారి సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశారు. ఆ విషయాన్ని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.